
www.manatelangana.news
Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 206 | సోమవారం | 15 జనవరి, 2018
...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad
పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00





మరింత ఆసరా!

వచ్చే బడ్జెట్‌లో ఆసరా పింఛన్‌ను రూ.1500 చేసే యోచన

వికలాంగులకు ఇస్తున్నట్లుగానే మిగతా అన్ని వర్గాలకు ఇచ్చి సంక్షేమానికి మరింతగా పెద్దపీట వేయాలని ప్రభుత్వం నిర్ణయం?

ప్రభుత్వంపై రూ.2 వేల కోట్ల మేరకు భారం

పింఛన్‌దారుల్లో 13.98 లక్షల మంది వితంతువులు



మన తెలంగాణ / హైదరాబాద్ : ప్రస్తుతం వెయ్యి రూపాయలుగా ఉన్న 'ఆసరా' పింఛన్‌ను రానున్న బడ్జెట్ నుంచి రూ. 1500కు పెంచడానికి ప్రభుత్వం ఆలోచన చేస్తూ ఉంది. సంక్షేమ బడ్జెట్‌గా ఉండబోతుందని స్వయంగా ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ గత వారం ప్రకటించిన నేపథ్యంలో ఆసరా పింఛన్‌ను కనీసంగా రూ. 500 మేర పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది. అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ పార్టీ ఈ మొత్తాన్ని రూ.2000కు పెంచాలని ఆలోచిస్తున్న సమయంలో ప్రభుత్వం దీనిపై దృష్టి సారించడం గమనార్హం. ప్రస్తుతం వృద్ధులు, ఒంటరి మహిళలు, వితంతువులు, కల్లుగీత కార్మికులు, బీడీ కార్మికులు, చేనేతలు తదితరులకు ప్రతి నెలా ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల చొప్పున 'ఆసరా' పింఛను చెల్లిస్తుండగా, దివ్యాంగులకు మాత్రం రూ.1500 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తోంది. అయితే అన్ని వర్గాల వారికి పింఛనును రానున్న బడ్జెట్ నుంచి రూ. 500 చొప్పున పెంచడంపై ప్రభుత్వం ఆలోచిస్తూ ఉంది. ఏటా బడ్జెట్‌లో పింఛన్‌ల కోసం ప్రభుత్వం ప్రస్తుతం రూ.4000 కోట్లను ఖర్చు చేస్తూ ఉంది. ఇప్పుడు రూ.500 చొప్పున పెంచితే సుమారు రూ.2000 కోట్ల మేర ప్రభుత్వంపై భారం పడే అవకాశం ఉంది. తెలంగాణ ఏర్పడిన తర్వాత 2014 నవంబరు నుంచి రాష్ట్రంలో తరువాయి 6లో



సిటీ బస్సుల్లో నేటి నుంచి కొత్త చార్జీలు

- హైదరాబాద్, వరంగల్‌లో అమలు
- ఆర్డినరీ, పల్లెవెలుగు బస్సుల్లో రూ.5కు తగ్గనున్న కనీస చార్జి

మన తెలంగాణ / హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్, వరంగల్ నగరాలలో హేతుబద్ధీకరించిన ఆర్‌టిసి సిటీ బస్‌చార్జీలు ఈ నెల 15 నుంచి అమలులోకి రానున్నాయి. బస్ టిక్కెట్‌కు సరిపడా చిల్లర డబ్బులు తీసుకోవడం, తిరిగి ఇచ్చే విషయంలో తరచూ ప్రయాణికులు, కండక్టర్ల మధ్య వాగ్వాదాలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో చార్జీలను క్రమబద్ధీకరించినట్లు టిఎస్‌ఆర్‌టిసి మేనేజింగ్ డైరెక్టర్ తరువాయి 6లో

96 ఎంబిసి కులాలు?

మన తెలంగాణ / హైదరాబాద్ : ప్రస్తుతం బిసి జాబితాలో ఉన్న 112 కులాలకు అదనంగా అనాథలకు కూడా అదే ప్రాతిపదికన సంక్షేమం కోసం బడ్జెట్‌లో కేటాయింపులు చేయాలని భావిస్తున్న ప్రభుత్వం మొత్తం 113 కులాలుగా పరిగణిస్తోంది. ఇందులో ఎంబిసి (బాగా వెనకబడినవర్గాలు) జాబితా కిందకు సుమారు 96 కులాలను తీసుకురావాలని ఎంబిసి కార్పొరేషన్ భావిస్తోంది. తొలుత 88 కులాలు అని వార్తలు వచ్చినా ఆ సంఖ్య 96గా ఉండే అవకాశం ఉంది. త్వరలోనే సిఎం కెసిఆర్ ప్రగతిభవన్‌లో ఎంబిసి జాబితాలో చేరే కులాలపైనా, ఇతర బిసి (ఒబిసి) కులాల సంక్షేమం, అభివృద్ధిపైనా సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిసింది. ప్రస్తుతం ఎంబిసిల తరువాయి 6లో





ఆరు రోజుల పర్యటనకు వచ్చిన ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహును ప్రధాని నరేంద్ర మోడీ ఆలింగనం చేసుకొని ఢిల్లీ విమానాశ్రయంలో ఆత్మీయ స్వాగతం పలుకుతున్న దృశ్యం 10

కీలక కేసులు రాజ్యాంగ పీఠానికి

- ప్రస్తుత సంక్షోభం తొలగే వరకు అప్పగించాలి
- తిరుగుబాటు న్యాయమూర్తుల వాదనను సమర్థిస్తూ సిజెకి నలుగురు మాజీల లేఖ
- చలమేశ్వర్‌ను కలిసిన బార్ కౌన్సిల్ బృందం

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టులో పాలనా వ్యవహారాలు సక్రమంగా లేవంటూ నలుగురు సీనియర్ న్యాయమూర్తులు మీడియా ముందుకు వచ్చి సంచలనం సృష్టించిన నేపథ్యంలో వారు లేవనెత్తిన అంశాలతో తామూ ఏకీభవిస్తున్నామని ఒక సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి సహా నలుగురు రిటైర్డ్ న్యాయమూర్తులు ఆదివారం బహిరంగ లేఖ రాశారు. సుప్రీంకోర్టు సంక్షోభాన్ని న్యాయవ్యవస్థ పరిధిలోనే పరిష్కరించాల్సి ఉందని వారు ఆ లేఖలో పేర్కొన్నారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సావంత్, ఢిల్లీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎపి షా, మద్రాస్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి కె చంద్రు, బొంబాయి హైకోర్టు మాజీ న్యాయమూర్తి హెచ్. సురేశ్‌లు బహిరంగ లేఖ రాసిన వారిలో ఉన్నారు. ఈ లేఖ సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఇతర న్యాయమూర్తులతో కలిసి తరువాయి 6లో



శుభాకాంక్షలు

పాఠకులకు, ప్రకటనకర్తలకు, ఏజెంట్లకు, శ్రేయోభిలాషులకు సంక్రాంతి శుభాకాంక్షలు.

సెలవు

మకర సంక్రాంతి సందర్భంగా సోమవారం (15-1-2018) మన తెలంగాణ కార్యాలయానికి సెలవు. తిరిగి బుధవారం (17-1-2018) మీ ముంగిట.

\- ఎడిటర్



మేడిపల్లి నిందితుల అరెస్టు

10 ట్యాంకర్లు, 2 కార్లు, 2 మోటార్ సైకిళ్లు సీజ్

రూ.7.49 లక్షల నగదు స్వాధీనం

పేలుడు ప్రమాదం వెనుక పోలీస్ పాత్రపైనా దర్యాప్తు

పరారీలో ఇంకా ముగ్గురు

మన తెలంగాణ/ హైదరాబాద్ సిటీ బ్యూరో : హైదరాబాద్ నగర శివారు మేడిపల్లిలో అగ్నిప్రమాదానికి కారకులను స్థానిక పోలీసులు గుర్తించారు. వారిలో ఇద్దరిని అరెస్టు చేయగా, ముగ్గురు పరారీలో ఉన్నారు. వారి వద్ద నుండి 10 ట్యాంకర్లు, 2 కార్లు, 2 మోటారు సైకిళ్లను, రూ. 7.49 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం తరువాయి 6లో



పెరూలో భూకంపం 11

సునామీ హెచ్చరికలు

రిక్టర్‌స్కేలుపై 7.3

శబరిమలలో మకర జ్యోతి దర్శనం 10





వైభవంగా గోదాదేవి కళ్యాణం



మన తెలంగాణ/భద్రాచలం: శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయ ప్రాంగణంలో ఆదివారం గోదాదేవి కళ్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. గోదా, రంగనాధునికి కళ్యాణ తంతును కనులారా వీక్షించేందుకు పెద్ద ఎత్తున భక్త జనం ఆలయ ప్రాంగణానికి తరలివచ్చారు. భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రజలంతా భోగభాగ్యాలతో విలసిల్లాలని ఈ కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించడం శాస్త్రోక్త సాంప్రదాయం. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణ తంతును తిలకించేందుకు తరలివచ్చిన భక్తులు స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించి తరించారు. ఈ సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దూపదీప నైవేద్యాలు సమర్పించి అంత్యత భక్తిశ్రద్ధలతో పూజాలు జరిపించారు. గోదాదేవి కళ్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు విచ్చేసిన భక్తులు భక్తి పారవశ్యంలో మునిగితేలారు. ఆలయ అధికారులు,అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్ట్ వద్ద కారులో మంటలు

హైదరాబాద్: శంషాబాద్ విమానాశ్రయం వద్ద ఆదివారం రాత్రి ఓ కారులో మంటలు చెలరేగాయి. విమానాశ్రయంలోని డిపార్చర్ వద్ద అకస్మాత్తుగా కారులోంచి మంటలు చెలరేగడంతో అక్కడి ప్రయాణికులు తీవ్ర భయాం దోళనకు గురయ్యారు. దీంతో అప్రమత్తమైన విమానాశ్రయ సిబ్బంది మంట లను అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది.

ఎత్తిపోతల విద్యుత్ చార్జీలు తగ్గించండి



మన తెలంగాణ/హైదరాబాద్: ఎత్తిపోతల విద్యుత్ చార్జీలు మరింత తగ్గించాలని విద్యుత్ క్రమబద్ధీకరణ సంస్థను ఇరిగేషన్ శాఖ అధికారులు కోరనున్నారు. డిస్కంలు ఇటీవల ప్రతిపాదించిన టారిఫ్‌లో ఎత్తిపోతల కరెంటు చార్జీలను గతం కంటే తగ్గించాయి. కానీ ఈ దిశగా విద్యుత్ క్రమబద్ధీకరణ సంస్థ నిర్ణయం తీసుకోలేదు. ప్రభుత్వం కూడా దీనిపై ఇంకా స్పష్టత ఇవ్వలేదు. డిస్కంలు ప్రతిపాదించినదానికంటే ఇంకా తక్కువ ధరకు విద్యుత్‌ను సరఫరా చేయాల్సిందిగా సాగునీటి పారుదలశాఖ విజ్ఞప్తి చేస్తోంది. ఇప్పటికే గణనీయమైన విద్యుత్‌ను వినియోగిస్తున్న సాగునీటి పారుదలశాఖ రానున్న ఒకటి,రెండేళ్లలో ఎత్తిపోతల పథకాలకు మరింత విద్యుత్‌ను వాడుకుని అతి పెద్ద వినియోగదారుగా మారనుంది. ఎత్తిపోతల ప్రాజెక్టులు పూర్తయ్యి వినియోగంలోకి వస్తే విద్యుత్ వినియోగం ఇంకా పెరుగుతుంది కాబట్టి చార్జీల తగ్గింపును కోరుతోంది. గతంలో యూనిట్‌కు రూ.6.40 చొప్పున వసూలు చేస్తున్న డిస్కంలు రానున్న ఆర్థిక సంవత్సరం నుంచి ఈ చార్జీలను రూ.4.88కు తగ్గిస్తూ తన ప్రతిపాదనల్లో పేర్కొన్నాయి. దీన్ని రూ.4.50కు తగ్గించాలని ఇరిగేషన్ శాఖ తరపున విద్యుత్ నియంత్రణ కమిషన్‌ను కోరే అవకాశం ఉన్నట్లు తెలిసింది. గత రెండేళ్ల నుంచి కొన్ని ఎత్తిపోతల పథకాలు నడుస్తున్నా, వచ్చే సంవత్సరం నుంచి ఈ పథకాలకు కరెంటు అవసరాలు భారీగా పెరుగుతాయి. కాళేశ్వరం ఎత్తిపోతల ప్రారంభమైందంటే, కరెంటు డిమాండ్ గణనీయంగా పెరుగుతుంది. వేల కోట్ల రూపాయలు కరెంటు బిల్లులకే వెచ్చించాల్సి ఉంటుంది. దీనికి తోడు ఇతర ఎత్తిపోతల ప్రాజెక్టులు కూడా కొన్ని నెలల తేడాతోనే పూర్తయి అందుబాటులోకి వస్తాయి. ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ పథకాలు కూడా ఒక్కొక్కటిగా పూర్తవుతున్నాయి. దీంతో ఇరిగేషన్ శాఖ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని కరెంటు చార్జీలు తగ్గించాలని కోరుతోంది. కృష్ణా నదిపై కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ పథకాలు పూర్తయి, నీటిని ఇప్పటికే ఎత్తిపోస్తున్నాయి. పాలేరు రిజర్వాయర్ ఆధారంగా చేపట్టిన భక్త రామదాసు ఎత్తిపోతల అందుబాటులోకి వచ్చింది. గోదావరి నదిపై కాళేశ్వరం ప్రాజెక్టు, సీతారామ ప్రాజెక్టు నిర్మాణంలో ఉన్నాయి. ప్రస్తుతం 14 ఎత్తిపోతల పథకాలు పంపింగ్ అవసరాల కోసం సుమారుగా 1400 మెగావాట్ల కరెంటును వాడుకుంటున్నాయి. ఈ వినియోగం వచ్చే జూన్ నాటికి 3331 మెగావాట్లకు చేరనుంది. 2018–19 కల్లా 5,900 మెగావాట్లకు, 2019–20 నాటికి 8,400 మెగావాట్లకు చేరుతుంది. 2020–21కు 10 వేల మెగావాట్ల డిమాండ్‌ను దాటుతుంది. 2021–22 సంవత్సరం నాటికి 11,500 మెగావాట్లకు ఎత్తిపోతల పథకాల విద్యుత్ డిమాండ్ చేరుతుంది. ఇందులో కాళేశ్వరం ప్రాజెక్టుకే 4,627 మెగావాట్లు కావాలి. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పనులు వేగంగా పూర్తి అయితే 4,705 మెగావాట్లు అవసరం. దేవాదుల, సీతారామ ఎత్తిపోతల పథకాలకే 1300 మెగావాట్లకు పైగా కరంటు కావాల్సి ఉంటుంది. దీంతో చార్జీల భారం భారీగా తగ్గించాలని కోరుతూ ఇరిగేషన్ శాఖ విద్యుత్ నియంత్రణ కమిషన్‌ను కోరనుందని తెలిసింది.

పంచాయతీలకు పరోక్ష పద్ధతి ఎన్నికలు వద్దు

జాజుల శ్రీనివాస్‌గౌడ్

మన తెలంగాణ/ హైదరాబాద్: పంచాయతీ ఎన్నికలకు పరోక్ష పద్ధతి పెట్టవద్దని, ఈ విధానం ద్వారా బిసిలకు రాజకీయంగా నష్టం జరుగుతుందని తెలంగాణ రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో వార్డు మెంబర్ల ద్వారా సర్పంచ్‌లను పరోక్ష పద్ధతి ద్వారా ఎన్నుకోవాలనే మంత్రి వర్గ ఉపసంఘం సిఫార్సును ఆయన వ్యతిరేకించారు. వార్డు మెంబర్ల ద్వారా పరోక్ష ఎన్నికలు జరిగితే ధనబలం ఉన్నవారికి ప్రయోజనమని, క్యాంప్ రాజకీయాలతో సర్పంచ్ స్థానాలను కైవసం చేసుకునే అవకాశం ఉంటుందనిఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇలాంటి విధానంతో బంగారు తెలంగాణలో పచ్చని పల్లెలు పాతకక్షలకు నిలయాలుగా మారుతాయని ఆవేదన వ్యక్తం చేశారు.అభివృద్ధి చెం దిన అమెరికాలో దేశాధ్యక్షుల ను కూడా ప్రజలు నేరుగా ఎన్నుకుంటున్నారని గుర్తుచేశారు. పరోక్షపద్ధతి అంటే దొడ్డిదారిన అధికారం చెలాయించేందుకు అవకాశం ఉంటుంద ని చెప్పారు.మంత్రివర్గ ఉప సంఘం చేసిన సిఫార్సుల కు సిఎం కెసిఆర్ ఆమోదం తెలుపొద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

సత్వరమే ఎంబిసి జాబితా విడుదల

మన తెలంగాణ / హైదరాబాద్ : అత్యంత వెనుకబడిన కులాల (ఎంబిసి) జాబితా వెం టనే విడుదల చేసి రూ.1000 కోట్ల బడ్జెట్ ఖర్చు చేయాలని సుందరయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎస్.వినయ్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్‌వికె ఆదివారం జరిగిన సమావేశంలో ఎంబిసి సంఘం 2018 క్యాలెండర్‌ను ఎంబిసి కార్పొరేషన్ ఛైర్మెన్ తాడూరి శ్రీనివాస్ ఆవిష్కరించారు. సమావేశానికి ఎంబిసి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ళ ఆశయ్య అధ్యక్షతన వహించగా వినయ్‌కుమార్‌తో పాటు వివిధ సంఘాల నాయకులు సూరేపల్లి శ్రీనివాస్ (ఎంబిసి సంక్షేమ సంఘం), జి.మహేష్‌చంద్ర (గంగపుత్ర సంఘం), మేడి పాపయ్య మాదిగ (ఎంఆర్‌పిఎస్), కోలా శ్రీనివాస్ (పూసల సంఘం), కొందోజు అశోక్ చారి (విశ్వకర్మ వృత్తిదారుల సంఘం), ఆవులదొడ్డి రామస్వామి (గంగిరెద్దుల సంఘం) తదితరులు పాల్గొన్నారు. ఎంబిసిల జీవన విధానం ఉట్టి పడేలా క్యాలెండర్‌ను రూపొందించడం అభినందనీయమని తాడూరి శ్రీనివాస్ అన్నారు.

రేపు కలెక్టర్ల సమావేశం

మన తెలంగాణ / హైదరాబాద్ : భూ రికార్డుల ప్రక్షాళన ప్రక్రియ పూర్తికావడంతో తదుపరి చేపట్టాల్సిన చర్యలపైనా, ఆన్‌లైన్ భూలావాదేవీలపైనా అన్ని జిల్లాల కలెక్టర్లతో ముఖ్యమంత్రి కెసిఆర్ మంగళవారం సమీక్ష నిర్వహించనున్నారు. రెవిన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, భూపరిపాలన ప్రధాన కమిషనర్ తదితర ఉన్నతాధికారులు కూడా ఈ సమావేశానికి హాజరుకానున్నారు. ఇప్పటివరకు జరిగిన భూ రికార్డుల ప్రక్షాళన, సజావుగా ఉన్న భూములు, సాగు, వివాదంలో ఉన్న భూములకు పరిష్కారం, రికార్డులను కంప్యూటరీకరించడం, ఇకపైన భూ క్రయ విక్రయాల వివరాలు తదితర అంశాలను సిఎం సమీక్షించనున్నారు.

మన తెలంగాణ
3
హైదరాబాద్
సోమవారం
15, జనవరి 2018
www.manatelangana.news



విద్యుత్ కొనుగోళ్లపై సమగ్ర విచారణకు బిఎల్ఎఫ్ డిమాండ్

మన తెలంగాణ / హైదరాబాద్ : విద్యుత్ కొనుగోళ్లలో కమీషన్ల వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బిఎల్ఎఫ్) అధ్యక్షులు నల్లా సూర్యప్రకాశ్, కన్వీనర్ తమ్మినేని వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. న్యాయమూర్తుల సమస్యలను న్యాయమూర్తులే పరిష్కరించుకోవాలని, అది సాధ్యం కానప్పుడు రాష్ట్రపతి జోక్యం చేసుకోవాలని వారన్నారు. బిఎల్ఎఫ్ ముఖ్యనేతల సమావేశం నల్లా సూర్యప్రకాశ్ అధ్యక్షతన సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగింది. ఈ నెల 25న బిఎల్ఎఫ్ ఆవిర్భావ సభకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. తమ్మినేని, సూర్యప్రకాష్‌తో పాటు ఆప్ నేత పి.ఎల్.విశ్వేశ్వరరావు, ఆర్ఎస్‌పి ప్రధాన కార్యదర్శి జె.జానకిరాములు, సోషల్ జస్టిస్ నేత రాంనర్సయ్య, ఎంసిపిఐ(యు) నేత అశోక్ ఓంకార్, ఎంబిటి నేత ఖాన్, తెలంగాణ లేబర్ పార్టీ నేత గొర్రె రమేష్ తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం తమ్మినేని మీడియాతో మాట్లాడుతూ వచ్చే నెల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో బిఎల్ఎఫ్ నేతలు విస్తృతంగా పర్యటిస్తారని, ఆరు నెలల్లో రాజకీయంగా బలోపేతమవుతామని తమ్మినేని వీరభద్రం చెప్పారు. కాంగ్రెస్ కంటే దుర్మార్గంగా టిఆర్ఎస్ పాలిస్తోందని, ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని బిఎల్ఎఫ్ నేత నల్లా సూర్యప్రకాశ్ విమర్శించారు.

బిసిలపై కాంగ్రెస్ కపట ప్రేమ



మన తెలంగాణ/హైదరాబాద్: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కాంగ్రెస్ పార్టీకి బిసిలు, కుల వృత్తులపై వల్లమాలిన ప్రేమ పుట్టుకొస్తున్నదని టిఆర్ఎస్ ఎంఎల్ఎ వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. టిఆర్ఎస్ఎల్‌పి కార్యాలయంలో ఆదివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిసిల గురించి మాట్లాడుతున్న పిసిసి అధ్యక్షులు ఉత్తమ్ కుమార్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంలో బిసిలకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. వారి హయాంలో బిసిలను నిర్లక్ష్యం చేశారని, కులవృత్తులను అణచివేశారని ఆరోపించారు. ఎన్నికల సమయం దగ్గరపడుతుండడంతో కాంగ్రెస్‌కు బిసిలు గుర్తుకొచ్చారన్నారు. ఆ పార్టీలో ఒక్క బిసిఎ ఎంఎల్‌ఎ లేదని, కనీసం పిసిసి రేసులో కూడా బిసి నేత కనిపించడం లేదని వ్యాఖ్యానించారు. మహాత్మా జ్యోతిభాపూలే ఆశయాలను సిఎం కెసిఆర్ అమలు చేస్తున్నారన్నారు. అక్షరాస్యత లేనిదే అట్టడుగు వర్గాల్లో అభివృద్ధి జరగదని గుర్తించిన సిఎం కెసిఆర్, అందుకు వీలుగా బిసిలకు 120 గురుకుల విద్యాసంస్థలను ఏర్పాటు చేశారని, మండలానికో గురుకుల పాఠశాలను ఏర్పాటుచేసే యోచనలో ఉన్నారని పేర్కొన్నారు. నీళ్లు లేని చోట సొరంగాలు తవ్వి, మొబలైజేషన్ అడ్వాన్స్‌లతో అవినీతికి పాల్పడిన చరిత్ర కాంగ్రెస్‌ది అని, తమ ప్రభుత్వం కాళేశ్వరం, పాలమూరు– రంగారెడ్డి, తుమ్మిళ్ల, తదితర ప్రాజెక్టులను చేపట్టి శరవేగంగా పనులను సాగిస్తున్నదన్నారు. గీత కార్మికులపై కాంగ్రెస్ మొసలికన్నీరు కాలరాస్తున్నారన్నారు. కేరళ తరహా కల్లుగీత విధానాన్ని రాష్ట్రంలో అమలు చేసే యోచనలో ప్రభుత్వం ఉన్నదని, దీనిని అధ్యయనం చేసేందుకు కేరళకు బృందాన్ని పంపించనున్నదని తెలిపారు. అంతో ఇంతో ఎన్‌టిఆర్ హయాంలో కులవృత్తులకు న్యాయం జరిగిందని గుర్తు చేశారు.

అభివృద్ధి కోణంలోనే సిఎం కెసిఆర్ నిర్ణయాలు :

తెలంగాణ ప్రయోజనాలు, అభివృద్ధిని దృష్టిలో పెట్టుకునే ముఖ్యమంత్రి కెసిఆర్ నిర్ణయాలు తీసుకుంటారని ఎంఎల్‌ఎ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. తెలంగాణ ఉద్యమంలో లేనివారికి మంత్రివర్గంలో అవకాశం కల్పించారనే అంశాన్ని మీడియా ప్రస్తావించగా అనేక అంశాలను, సుదీర్ఘ ప్రయోజనాలు, అభివృద్ధి కోణంలోనే సిఎం కెసిఆర్ మంత్రివర్గ కూర్పు చేశారని, మరో 15 నుంచి 20 ఏళ్ల వరకు టిఆర్ఎస్ అధికారంలో ఉంటుందని, అందరికీ అవకాశాలు వస్తాయని మాత్రమే వ్యాఖ్యానించానన్నారు.

కెటిఆర్‌వి ఉత్తర కుమార ప్రగల్భాలు

మన తెలంగాణ / హైదరాబాద్ : విద్యుత్ కొనుగోళ్లలో అక్రమాలు జరిగాయని అన్ని రకాల ఆధారాలతో ఎంఎల్‌ఎ రేవంత్ రెడ్డి నిరూపించడంతో రాష్ట్ర మంత్రి కె.తారకరామారావుకు మతి పోయిందని, ఆ కారణంగానే ఆయన ఉత్తర కుమార ప్రగల్భాలు పలుకుతున్నారని టిపిసిసి ఉపాధ్యక్షులు మల్లు రవి అన్నారు. విద్యుత్ కొనుగోళ్ల అక్రమాలపై బహిరంగ చర్చకు ఎంపి బాల్క సుమన్ సవాల్ విసిరారని, అందుకు రేవంత్ రెడ్డి సిద్ధంగా ఉన్నామని చెప్పడంతో తేలు కుట్టిన దొంగలా దొరికిపోయిన టిఆర్ఎస్ నాయకులు ఆ అంశం నుంచి తప్పించుకోవడానికి అనవసర అంశాలను ముందుకు తెస్తున్నారన్నారు. టిఆర్ఎస్ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే విద్యుత్ అంశంపైన చర్చకు రావాలని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

వ్యవసాయ రంగాన్ని గట్టెక్కించాలి

రైతన్న డైరీ ఆవిష్కరణలో వక్తలు



మనతెలంగాణ/హైదరాబాద్ : రైతులు నీటి యాజమాన్య పద్ధతులపై అవగాహన పెంచుకుంటే వ్యవసాయం చేయడం సులభతరమవుతుందని వ్యవసాయ, సామాజిక శాస్త్రవేత్త డాక్టర్ సైదులు అన్నారు. భూసార పరీక్షలపై మరింత అవగాహన పెంచుకోవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ముద్రించిన 2018 రైతన్న డైరీ, రైతు పథం క్యాలెండర్‌లను ఆదివారం రైతు సంఘం కార్యాలయంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ, కృషి ఫౌండేషన్ డైరెక్టర్ ప్రేమ్‌చంద్, రైతు నాయకులతో కలిసి డాక్టర్ సైదులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ, రైతులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించేందుకు 'రైతన్న డైరీ' ఎంతగానో దోహదపడుతుందన్నారు. ప్రేమ్‌చంద్ మాట్లాడుతూ, జాతీయ స్థూల ఉత్పత్తిలో వ్యవసాయ, పరిశ్రమ, సేవా రంగాలు ముఖ్య పాత్ర పోషిస్తున్నాయని, కానీ వ్యవసాయ రంగాన్ని మాత్రం విస్మరించడం తగదని అన్నారు. దేశంలో వ్యవసాయం రంగంలో 60 నుంచి 70 శాతం ఉపాధి పొందుతున్నారని తెలిపారు. సమావేశానికి అధ్యక్షతన వహించిన రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ మాట్లాడుతూ, రైతులు వ్యవసాయం చేసుకోవడానికి 'రైతన్న డైరీ' ఒక కరదీపికగా నిలుస్తుందని పేర్కొన్నారు. సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న వ్యవసాయ రంగాన్ని గట్టెక్కించాలని పాలకులకు విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ రంగానికి అవసరమైన పరికరాలను జిఎస్‌టి నుంచి మినహాయించాలని కోరారు. ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలందరికీ ప్రభుత్వం ప్రకటించిన విధంగా రూ.6 లక్షల ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని డిమాండ్ చేశారు.పంటల మద్దతు ధరలపై చట్టం చేయాలని, రైతు రుణాలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా 184 సంఘాలతో కూడిన అఖిల భారత రైతు పోరాట సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో గత ఏడాది నవంబర్ 20,21 తేదీలలో 'ఛలో పార్లమెంట్' నిర్వహించామని, వచ్చే పార్లమెంట్ సమావేశాలలో తమ డిమాండ్లపై ప్రభుత్వం బిల్లు ప్రవేశ పెట్టకపోతే తాము ప్రైవేట్ బిల్లు పెట్టనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో రైతు నాయకులు రామకృష్ణారెడ్డి, ప్రభులింగం, రామిరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, సునంద పాల్గొన్నారు.

పర్యావరణ అనుమతుల దిశగా

హైదరాబాద్ ఫార్మాసిటీ

- ఒకవైపు భూసేకరణ మరో వైపు ఇసి కోసం యత్నం
- ఫార్మాసిటీని హరితవనంగా మార్చేందుకు ప్రణాళిక



మన తెలంగాణ / హైదరాబాద్ : ఔషధాల తయారీకి కేరాఫ్‌గా ఉన్న హైదరాబాద్ త్వరలోనే ఔషధ హబ్‌గా మారేందుకు వడివడిగా అడుగులు వేస్తోంది. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం ముచ్చర్ల కేంద్రంగా హైదరాబాద్ ఫార్మా సిటి నిర్మితం కానుండడంతో ఔషధ పరిశ్రమ మరింత వృద్ధి చెందుతుందని పరిశ్రమ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

హైదరాబాద్ ఫార్మా సిటి కోసం మొత్తం 18 వేల 782 ఎకరాల భూమి అవసరం కానుండగా, ఇప్పటి వరకు టిఎస్ఐఐసి 8 వేల ఎకరాలను సేకరించింది. ఈ భూసేకరణ ప్రక్రియను నిరంతరం కొనసాగించి నిర్దేశిత లక్ష్యాన్ని ఎనిమిది నెలల్లోనే చేరుకుంటామని, అందుకనుగుణంగా కార్యాచరణ చేపట్టామని టిఎస్ఐఐసి ఉన్నతాధికార వర్గాలు 'మన తెలంగాణ'కు తెలిపాయి. 2019–20 నాటికి ఫార్మాసిటి ఒక రూపుకు వస్తుందని ధీమా వ్యక్తం చేశాయి. ఒక పక్క రోజువారీగా భూసేకరణ అంశాన్ని చేపడుతూనే మరో వైపు కేంద్ర ప్రభుత్వం వైపు నుండి కూడా అందాల్సిన సహాయ సహకారాలు, అనుమతులను సాధించుకోవాల్సి ఉందంటున్నారు. ఫార్మా సిటి ఏర్పాటు కోసం పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని కోరుతూ ఈ నెల మూడో వారంలో కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపించనుందని టిఎస్ఐఐసి విసి అండ్ ఎండి వెంకట నర్సింహారెడ్డి తెలిపారు. ఈ ఫార్మా సిటి ఏర్పాటుకు స్టాండర్డ్ డిపిఆర్ ఉంటుందని, ఏఏ పరిశ్రమలు ఇందులోకి వస్తాయో కూడా కేంద్రానికి సూత్రప్రాయంగా తెలియజేయాల్సి ఉంటుందని ఆయన వెల్లడించారు.



హరిత వనంగా ఫార్మా సిటీని తీర్చిదిద్దుతామని, రోడ్లు, విద్యుత్, నీరు, అలాగే రైల్వే కనెక్టివిటికి కావాల్సిన మౌలిక సదుపాయాలను టిఎస్ఐఐసి కల్పిస్తోందని తెలిపారు. ఈ ఔషధ నగరిలో విధులు నిర్వర్తించే శాస్త్రవేత్తలు, ఉద్యోగులు, సిబ్బందికి ప్రత్యేక టౌన్ షిప్‌ల నిర్మాణం కూడా చేపట్టనున్నారు. ఫార్మాసిటి అంటేనే పర్యావరణం కాలుష్యం అవుతుందన్న భయాందోళనలు నెలకొనడం సహజం. కానీ ప్రజలకు ఆరోగ్య సమస్యలు లేకుండా హానికరమైన జలాల శుద్ధికి ట్రీట్‌మెంట్ ప్లాంట్లు కూడా ఈ ఫార్మాసిటీలోనే ఏర్పాటు కానుంది. హరిత హారం కార్యక్రమాన్ని ప్రభుత్వ పెద్ద ఎత్తున నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ప్రతిష్టాత్మకమైన ఈ ఫార్మాసిటీని కూడా కాలుష్య రహిత గ్రీన్ బెల్ట్ కింద పెద్దయెత్తున మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కేరాఫ్‌గా నిలుపుతామని చెబుతోంది. ఫార్మాసిటిని హరితవనంగా మారుస్తామని అంటోంది.

ప్రతిష్టాత్మకమైన ఈ ఫార్మాసిటీని కూడా కాలుష్య రహిత గ్రీన్ బెల్ట్ కింద పెద్దయెత్తున మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కేరాఫ్‌గా నిలుపుతామని ఫార్మాసిటీని హరితవనంగా మారుస్తామని అంటోంది. ఫార్మాసిటీలో పరిశ్రమలను స్థాపించడానికి దేశీయ కంపెనీలతో పాటు అంతర్జాతీయ కంపెనీలు కూడా ఆసక్తిని కనబరుస్తున్నాయి. వీటిలో బల్క్ డ్రగ్, జనరల్ అండ్ పీడియాట్రిక్, ఎండోక్రినాలజీ, గ్యాస్ట్రో ఎంటరాలజీ, ఇన్‌ఫెర్టిలిటీ, గైనకాలజీ సంబంధిత ఔషధ కంపెనీలు ఉన్నాయి.

ఫార్మాసిటిలో పరిశ్రమలను స్థాపించడానికి దేశీయ కంపెనీలతో పాటు అంతర్జాతీయ కంపెనీలు కూడా ఆసక్తిని కనబరుస్తున్నాయి. వీటిలో బల్క్ డ్రగ్, జనరల్ అండ్ పీడియాట్రిక్, ఎండోక్రైనాలజీ, గ్యాస్ట్రో ఎంటరాలజీ, ఇన్‌ఫెర్టిలిటీ, గైనకాలజీ సంబంధిత ఔషధ కంపెనీలు ఉన్నాయి. తెలంగాణలో ఇప్పటికే డాక్టర్ రెడ్డీస్, హెటిరో డ్రగ్స్ తదితర దేశీయ పరిశ్రమలు ఔషధ ఉత్పత్తితో తమ ఉనికిని చాటుకుంటున్నాయి. దేశీయ సంస్థలకు తామేమే తక్కువ కాదన్నట్లు అంతర్జాతీయ ఫార్మా సంస్థలు ముచ్చెర్ల ఫార్మా సిటిపై ఒక కన్నేశాయి. అంతర్జాతీయ ఫార్మా సంస్థ ఫెర్రింగ్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ తెలంగాణలో పెట్టుబడులకు ఆసక్తిని కనబరుస్తోంది.

రీసెర్చ్, డెవలప్‌మెంట్ రంగాల్లోనూ ఈ సంస్థకు అంతర్జాతీయంగా మంచి పేరు ఉంది. గతంలో పరిశ్రమలశాఖ మంత్రిగా జూపల్లి కృష్ణారావు ఉన్నప్పుడు ఆ కంపెనీ ప్రతినిధులు ముచ్చెర్ల, కందుకూరు ప్రాంతాల భూములను పరిశీలించి తెలంగాణకు వచ్చేందుకు సంసిద్ధతను వ్యక్తం చేశారు. ఈ కంపెనీకి అంతర్జాతీయంగా మంచి పేరు ఉందని ఇలాంటి పలు కంపెనీలు మరిన్ని వస్తాయని అంచనాలు ఉన్నాయని టిఎస్ఐఐసి అధికారులు విశ్లేషిస్తున్నారు. మేకిన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా దేశీయంగా పలు ఉత్పత్తులను ప్రోత్సహిస్తున్న కేంద్ర ప్రభుత్వం బల్క్ డ్రగ్ తదితర మ్యానిఫ్యాక్చరింగ్ కంపెనీలు మన దేశంలో ఏర్పాటు చేసుకుంటామంటే తప్పనిసరిగా అనుమతులు ఇస్తుందని రాష్ట్ర అధికారులు అంచనా వేస్తున్నారు.

కేంద్రం కొర్రీలు వేయకుండా అనుమతులు త్వరిత గతిన వచ్చేలా చూసేందుకు ప్రభుత్వానికి అన్ని విధాలా సహకారం అందిస్తామని వారు చెబుతున్నారు.

తడవవు... చిరగవు

కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు

మన తెలంగాణ / హైదరాబాద్ : అక్రమాలకు, అవకతవకలకు తావులేని పట్టాదారు పాసుపుస్తకాల తయారీపై ప్రభుత్వం దృష్టి సారించింది. మార్చి 11 తేదీన ప్రధానమంత్రి లేదా రాష్ట్రపతి చేతుల మీదుగా లాంఛనంగా రైతులకు అందజేయనున్నట్లు స్వయంగా సిఎం కెసిఆర్ స్పష్టం చేశారు. నకిలీ తయారీకి తావులేని విధంగా పాసు పుస్తకాలను రూపొందించే ఉద్దేశంతో 26 భద్రతా ప్రమాణాలను పొందుపర్చే ప్రక్రియ ప్రారంభమైAంది. ఇందులో భాగంగా సిసిఎల్ఎ కార్యాలయంలో రెండు రోజుల క్రితం ప్రి–బిడ్డింగ్ సమావేశం జరిగింది. నీళ్ళలో వేసినా తడవకుండా, చింపినా చిరగకుండా ఉండే తీరులో పాసుపుస్తకాలను తయారుచేయాలని బిడ్డర్లకు అధికారులు స్పష్టం చేశారు. కాగితం కొనుగోలు మొదలు భద్రతా ప్రమాణాలను పొందుపర్చి ప్రింటింగ్ వరకు తుదిరూపు తీసుకొచ్చేవరకు బిడ్డర్లకే బాధ్యత అప్పజెప్పారు. ఇందుకు అవసరమైన సాంకేతిక సహకారాన్ని తెలంగాణ ప్రభుత్వ టెక్నాలజీ సర్వీసెస్ అందిస్తోంది. ప్రతి కాగితం ప్లాస్టిక్ మిశ్రమంతో తయారవుతున్నట్లు తెలిసింది. ప్రస్తుతం అత్యంత భద్రతా ప్రమాణాలు కలిగిన పాస్‌పోర్టుకంటే ఎక్కువ సెక్యూరిటీ ఫీచర్స్ ఈ పట్టాదారు పాసుపుస్తకంలో ఉంటున్నాయి. అతి నీలలోహిత కిరణాల ద్వారా భద్రతా ప్రమాణాలను పసిగట్టే టెక్నాలజీని పాసు పుస్తకాల్లో వాడుతున్నట్లు ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ ఇటీవల 'మన తెలంగాణ'కు వివరించారు. బార్‌కోడ్‌తో స్కాన్ చేసే సౌకర్యంతో పాటు 'మాగ్నటిక్' భద్రత కూడా ఉంటుందని అధికారులు తెలిపారు.

ఏ మాత్రం నకిలీ తయారీకి అవకాశమే ఉండదని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. ఈ ప్రమాణాల వలన స్కానింగ్ చేసే సమయంలోనే సదరు పాసుపుస్తకం కలిగిన రైతుకు సంబంధించిన పూర్తి వివరాలు, వారికి సంబంధించిన భూ లావాదేవీలన్నీ తెలిసిపోతాయని, నకిలీ పుస్తకం అయినట్లయితే వెంటనే పసిగట్టవచ్చునని అధికారులు వ్యాఖ్యానించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత లాంఛనంగా తయారవుతున్న పాస్‌పుస్తకాలు కాబట్టి ప్రతి పేజీమీద తెలంగాణ ప్రభుత్వ రాజముద్ర ఉంటుంది. ఈ పుస్తకాలను జారీ చేసిన తహసీల్దారు డిజిటల్ సంతకం అన్ని పేజీలపైనా ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

కక్ష సాధింపు చర్యలు ప్రజాస్వామ్యంలో తగదు : చాడ

మన తెలంగాణ / హైదరాబాద్ : ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాల నాయకులపై కక్ష సాధింపు ధోరణిని విడనాడాలని, అరెస్టు చేసిన నాయకులను బేషరతుగా విడుదల చేయాలని, అక్రమ కేసులను ఉపసంహరిచుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భూ నిర్వాసితుల సమస్యలపై క్రియాశీలకంగా ఉద్యమించిన తెలుగు రైతు అధ్యక్షులు ఒంటేరు ప్రతాపరెడ్డి, ఎస్‌సి వర్గీకరణ కోసం ఉద్యమిస్తున్న మందకృష్ణ మాదిగ తదితర నాయకులపై టిఆర్ఎస్ ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణితో వ్యవహరిస్తుందని ఆయన ఒక ప్రకటనలో విమర్శించారు. ఒంటేరు ప్రతాపరెడ్డిని ఆరెస్టు చేసిన తీరు దారుణమని, ఇంతటి కక్షసాధింపు అవసరమా అని ఆయన ప్రశ్నించారు. ఉస్మానియా యూనివర్శిటీలో విద్యార్థి చనిపోయిన సందర్భంలో అక్కడికి వెళ్ళిన ప్రతాపరెడ్డి, అద్దంకి దయాకర్, తదితరులపై కేసులు పెట్టి ఉద్యమాలను అణచివేసే ప్రయత్నం ప్రభుత్వం చేస్తున్నదన్నారు. గత ప్రభుత్వ కాలంలో ఇలాంటి పరిస్థితి వుంటే ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి ఎలాంటి అవాంతరాలు వచ్చేవో ఉద్యమ పార్టీ టిఆర్ఎస్ ప్రభుత్వం ఆలోచించుకోవాలన్నారు. ప్రతిపక్షాలను తుడిచిపెట్టడమే పరమావధిగా ప్రభుత్వం భావిస్తున్నదని, ప్రజాస్వామ్యానికి అది ఆరోగ్యకరమైన పరిణామం కాదన్నారు.

మేలైన విత్తనాల వృద్ధికి పరస్పర సహకారం

విత్తనోత్పత్తి.. మార్కెటింగ్‌పై యూపితో ఎమ్ఒయూ కుదుర్చుకున్న టిఎస్ఎస్‌డిసి

మన తెలంగాణ/హైదరాబాద్ : మన రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న వరి, పెసర్లు, మినుములు, శనగ విత్తనాలు ఉత్తర్‌ప్రదేశ్‌కు, అక్కడి నుంచి వరి, జిలుగ, గడ్డి విత్తనాలు మన రాష్ట్రానికి రానున్నాయి. ఈ మేరకు రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ (టిఎస్ఎస్‌డిసి), ఉత్తర్‌ప్రదేశ్ బీజ్ వికాస్ నిగమ్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ నెల 10,11 తేదీల్లో టిఎస్ఎస్‌డిసి ఛైర్మన్ కొండబాల కోటేశ్వర్‌రావు, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎం. జగన్‌మోహన్, అధికారులు సదానందం ఉత్తర్ ప్రదేశ్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడ విత్తన క్షేత్రాలను, ప్రాసెసింగ్ యూనిట్లను పరిశీలించారు. ఉత్తర్‌ప్రదేశ్ వరి విత్తన రకాలు మంచి దిగుబడిని ఇస్తుండటంతో ఇక్కడ పరీక్షించి ఉత్పత్తి చేయాలని నిర్ణయించారు. అందులో భాగంగానే మూల విత్తనాలతో పాటుగా ధ్రువీకరణ, ట్రూత్‌ఫుల్ లేబుల్ కలిగిన విత్తనాల మార్కెటింగ్‌కు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఫలితంగా ఇప్పటి వరకు టెండర్ల ద్వారా ప్రైవేట్ సంస్థల నుంచి కొనుగోలు చేస్తున్న విధానంలోని అధిక ధరలతో పోలిస్తే ఈ ఒప్పందం ద్వారా తక్కువ ధరకు లభించే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఒక్క ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలోనే కాకుండా మన రాష్ట్రానికి సరిపడా నాణ్యమైన విత్తనాల కోసం వేరే ఏ రాష్ట్రంలో బాగుంటే వారితో ఒప్పందం చేసుకుని మూల, ట్రూత్‌ఫుల్ లేబుల్ విత్తనాలు తీసుకోనున్నారు. ఈ విధంగా వివిధ రాష్ట్రాలలో వివిధ పంటల విత్తనోత్పత్తిలో పాటిస్తున్న మెలకువలను క్రోడీకరించి అనుసరించనున్నారు. గత అక్టోబర్‌లో హైదరాబాద్‌లో జరిగిన విత్తనాభివృద్ధి సంస్థల జాతీయ స్థాయి సమావేశంలో తీర్మానించిన విధంగా వివిధ రాష్ట్రాల విత్తనాభివృద్ధి సంస్థల మధ్య విత్తనోత్పత్తి, మార్కెటింగ్ రంగాలలో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోవాల్సి ఉంది. విత్తనోత్పత్తిలో నాణ్యతతో పాటు పంపిణీలో జవాబుదారీతనం పెంచేందుకు విత్తన ఉత్పత్తి సంస్థలు, సరఫరాదారులతో ప్రభుత్వాల ఎమ్ఓయూను ఖచ్చితం చేయాలని కేంద్రం ఇప్పటికే స్పష్టం చేసింది. విత్తన సంస్థలతో ఎమ్ఓయూ చేసుకోనట్లయితే జాతీయ ఆహార భద్రతా మిషన్, బిజిఆర్ఐ రాయితీ నిధుల విడుదల చేయమని హెచ్చరించింది. తద్వారా విత్తనాలలో నాణ్యత పెరిగి ప్రతి విత్తనం లెక్కలోకి వస్తుందని భావిస్తోంది. ఇప్పటికే మన రాష్ట్రం సజ్జలకు రాజస్థాన్‌తో, వరి, జొన్న, సజ్జలకు కర్నాటకతో , సోయాబీన్‌కు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ విత్తన కార్పొరేషన్‌లతో ఎమ్ఒయూ చేసుకున్నాయి.



ఆధునిక టెక్నాలజీతో విత్తన ప్లాంట్లు : టిఎస్ఎస్‌డిసి ఎమ్‌డి డాక్టర్. ఎం. జగన్‌మోహన్

"విత్తన ప్రాసెసింగ్ ప్లాంట్లు ఆధునిక టెక్నాలజీతో ఉన్నాయి. మన దగ్గర ప్రాసెసింగ్‌లో విత్తనాలను ఒక్కసారి జల్లెడ పడితే, అక్కడ మూడుసార్లు పడుతున్నారు. విత్తనాలు చాలా తేలికగా నాణ్యంగా వస్తున్నాయి. ఒక ప్లాంట్‌లో వివిధ రకాల విత్తనాలను ఒకేసారి ప్రాసెస్ చేస్తున్నారు. అలాంటి విత్తన ప్లాంట్ మిషన్‌లను మన రాష్ట్రంలోనూ స్థాపించే ఉద్దేశం ఉంది. ఇప్పటికే నాలుగు విత్తన ప్రాసెసింగ్ యూనిట్లకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. మనకు అవసరమైన నాణ్యమైన విత్తన రకాలను ఉత్తర్‌ప్రదేశ్ నుంచి తీసుకుంటాం. వారికి అవసరమైనవాటిని మనం సరఫరా చేస్తాం. ఇందుకోసం ఒప్పందం కుదిరింది. జాతీయ విత్తన పరీక్ష, పరిశోధన కేంద్రాన్ని కూడా సందర్శించాం. అక్కడ మన రాష్ట్ర సిఎం కెసిఆర్ ఫోటో ఉంది. వ్యవసాయం, రైతులకు మేలు చేసే విధానాలు అమలు చేస్తున్నందుకు కెసిఆర్ ఫోటో పెట్టినట్లు అక్కడి అధికారులు చెప్పడంతో గర్వంగా అనిపించింది.

కుంచెపోటు



మీరు పండక్కి ఊరెళ్లారేమో... మేము పండగ చేసుకుందామని వచ్చాం..!


జాతీయస్థాయి టోర్నమెంట్‌కు 'సరోజిని' విద్యార్థులు

మన తెలంగాణ / హైదరాబాద్ : చెన్నైలో అలీమ్ మహ్మద్ సాలేగ్ ఇంజనీరింగ్ కాలేజీలో జరుగనున్న జాతీయ స్థాయి జెమ్స్ మెమోరియల్ ట్రోఫీ టోర్నమెంట్‌కు బాగ్‌లింగంపల్లి లోని సరోజిని క్రికెట్ అండ్ ఫిట్‌నెస్ అకాడమీ విద్యార్థులు పాల్గొననున్నారు. ఈ నెల 15, 16వ తేదీలలో జరిగే అండర్13, అండర్15 కేటగిరీ పోటీల్లో సరోజిని అకాడమీ జట్టు తలపడనుంది. జట్టుకు క్రికెట్ కోచ్ ధనుంజయ్ నేతృత్వం వహిస్తున్నారు.

మన తెలంగాణ
www.manatelangana.news
4
హైదరాబాద్
సోమవారం
15, జనవరి 2018

కలం

మాటలే మంచి కవితలు



జి.కాళిదాసు
8686706463

జానపదులు చాలావరకు నిరక్షరాస్యులు. సాహిత్య ప్రక్రియలు వాళ్లకు తెలియవు. కావ్య పఠనం గాని, శ్రవణం గాని వారేమీఎరుగరు. వారికి ఛందస్సు, అలంకారాలు ఏమాత్రం తెలియవు. కవిత్వమంటే ఇది అని కూడా తెలియదు. అయినా వాళ్లు నిత్యజీవితంలో అడుగడుగునా కవితామయంగా మాట్లాడుకోవడం మనం చూస్తుంటాం. వినేవాళ్లు పులకించి పోయేట్టు, విరగబడినవ్వేటట్టు, ఎప్పుడు మరిచిపోలేనంత చమత్కారంగా వాక్చాతుర్యం చూపడం అనేక సందర్భాల్లో మనము గమనిస్తూ ఉంటాం.

అక్కడ గోడ నిర్మాణం జరుగుతోంది. కూలీలు రాళ్లు తెస్తున్నారు. సుతారి గోడ పెడుతున్నాడు. తొందర తొందరగా పని కావాలన్నది సుతారి ఆలోచన. ఎందుకంటే సుతారి ఆ పనిని గుత్తకు తీసుకొని కూలీల పెట్టి పనిచేయించుకుంటున్నడు. పని ఎంత తొందరగా అయితే సుతారికంత లాభం. అందుకే ఆయన కూలీలతో....

''జల్ది జల్ది రాళ్లు తేండ్రమ్మా ఏమో ముచ్చట్లు పెట్టుకుంట నడవపడితిరి?'' అన్నాడు పరాచికంగా నవ్వుతూ. ఆ మాట వినగానే రాళ్లు తెస్తున్న ఒక గడుసు పిల్ల.

''ఏంది తాత ఏమో తొందర చెయ్యపడితివి. ఇంతింత రాళ్లు లావట్టి ఎత్తుకోవాలె. అక్కడి నుంచి మోసుకరావాలె. వట్టిగానే అయితదనుకున్నావా? నీదేంది అందిత్తె పొందిత్తవు కూసొని'' అన్నది దబాయిస్తూ.

దగ్గరున్నోళ్లందరూ పగలబడిన నవ్విండ్రు. ఆ పిల్ల మాటలకు సుతారి తాతతో సహా,

రమ, ఉమ అక్కా చెల్లెండ్ల పిల్లలు. ఇద్దరిదీ ఇంచుమించు ఒకే వయసు. ఇద్దరూ హైస్కూల్ చదువుతున్నారు. ఉమ రమ్మంటే ఒక సారి సెలవుల్లో రమ ఉమ వాళ్ల ఇంటికి వచ్చింది. ఇద్దరూ సరదాగా పొద్దంతా మాట్లాడుకున్నరు. బడి విషయాలు పాఠాల విషయాలు పంతుల్ల విషయాలు ఇంకా ఎన్నెన్నో చెప్పుకున్నారు. సాయంత్రమైంది. చీకటి పడింది. సమయం 7 దాటింది. చుట్టుపక్కల ఇండ్లల్ల సద్దుమణిగింది.

ఉమ వాళ్ళ అమ్మ ఇద్దరికి అన్నము వడ్డించి పిలిచింది. రమ ఆశ్చర్య పోయింది. ''అయ్యో ఏడుగంటలకేనానె అన్నము తినుడు'' అన్నది ఆశ్చర్యంగా.

''ఇక్కడ అంతేనే. మా చుట్టూ పక్కలోల్లు ఎప్పుడో తిన్నరే'' అన్నది ఉమ.

''మా దగ్గర మేము తినే వరకు 9దాటుతదే'' అన్నది రమ.

''మా దగ్గర గూట్లో ఎక్క (దీపం)
నోట్లె బుక్క' అని ఉమ చమత్కరించింది.

ఆ మాటలకు రమ, రమతో ఉమ పడిపడి నవ్విండ్రు.

తరువాత ఇద్దరు భోజనం చేసిండ్రు. రమ వచ్చి కూచున్నది. ఉమ ఏదో సదురుతున్నది. అటు చూసే సరికి చిన్నాన్న బల్లపై నిదురపోవడం కనిపించింది రమకు. ఉమ రాగానే

''చిన్నాన్న అప్పుడె నిదురపోతున్నట్టున్నదే'' అన్నది రమ.

''అంతేనే వెన్నంటు కొంగనే మాకు కన్నంటు కుంటదే ఇక్కడ'' అన్నది నవ్వుకుంట.

మళ్లీ ఇద్దరు పగుల బడి నవ్వుకున్నరు.

ఒకావిడ కూరగాయల గంప తలపై పెట్టుకొని అమ్మడానికి బయలుదేరింది. దారిలో తెలిసినామె ఎదురుపడి.

''టమాటాలు ఎట్ల ధర వదినె'' అన్నది.

''నువ్వే మొదాలు మందలించినవు
ఇగ ఎట్ల అమ్ముడుపోతాయో చూడాలె వదినె'' అన్నది గంప దించుతు నవ్వుకుంట.

''అడిగిన ధరకియ్యి వదినె
కడిగినట్టు పోకుంటె చూడు' అన్నది ఆమె నవ్వుతూ కూరగాయలమ్మే ఆమె కూడా నవ్వక తప్పలేదు. అట్లా ఉంటుంది వాళ్ళ మాటల తీరు.

కవిత్వంలో ఒక విషయాన్ని ప్రతీకాత్మకంగా చెప్పడం గొప్ప విషయం. అది కవి ప్రతిభకు నిదర్శనం.

జానపదుల మాటల్లో ఈ ప్రతిభ అనేక సందర్భాల్లో వెల్లివిరుస్తుంది. అసలు విషయం తెలియపరచకుండానే తమ మనస్సులోని భావం



వెలిబుచ్చడం వాళ్ల సాహితీ ప్రియత్వాన్ని కనబరుచుతుంది. అలాంటి సన్నివేశాలు ఇప్పుడు మనం చూద్దాం.

దారిలో ఇద్దరు ఎదురయ్యారు. ఇద్దరూ పేదలే. అందులో ఒక వ్యక్తి తన కొడుకును అష్టకష్టాలు పడి చదివించాడు. ఆ బాబు చాలా కాలం నుండి ఉద్యోగం కోసం ప్రయత్నం చేస్తున్నాడు. ఆ అబ్బాయికి ఈ మధ్యనే గ్రూప్స్‌లో జాబు వచ్చింది. ఆ సందర్భంగా కలిసినాయన అబ్బాయి తండ్రితో ఏమంటున్నాడంటే

''బాబు ఇంకేంది గడ్డకుపడ్డవుగదనే'' ఈ చిన్న మాట అబ్బాయి కుటుంబ ఆర్థిక పరిస్థితినంతా ఎంత బాగా వివరిస్తుందో మనకు తెలిసిపోతుంది.

అలాగే నిరాదరణకు గురైన ఒక పేద స్త్రీ ''నల్లంగ ఉన్నోళ్లను ఎవరు కానుతరు బాంచెను'' అంటూ ఒక్క వాక్యంలో తన గోడునంతా తెలియజేస్తుంది. నల్లంగా అంటే పేదరికం, దరిద్రం అని అర్థం వినే వాళ్ళకు ఆమె పరిస్థితి ఇట్లే తెలిసిపోతుంది.

పల్లెల్లో జీవించే వాళ్లంతా కష్ట జీవులే. నూటికి తొంబైమంది నిరుపేదలే. వాళ్లకు జీవితం కత్తిమీద సాము. రెక్కాడితెగాని డొక్కాడదు. బాధ్యతాయుతంగా నిరాడంబరంగా పొదుపుగా జీవించడమే వాళ్ళకు తెలుసు. గొప్పలకు పోయినా, సోమరిగా వ్యవహరించినా వాళ్ళు బ్రతుకలేరు. అందుకే వాళ్లు పెద్ద పోకిల్లకు పోయేవాళ్లను, డంబాలు పలికేవాళ్లను, పనిచేయని వాళ్లను అడుగడునా ఎండకడతారు. అలాంటి మగవాళ్లను ఆడవాళ్లు ఎంత అసహ్యించుకుంటారో ఈ క్రింది మాటల్లో చూడండి.

''తిండంటే బండి కడుతడు''
''మాటలతోనె కోటలు కడుతడు''
''అంటె ఆగడు, పంటె లేవడు''

అదే విధంగా తాగుడు, తినుడు, అప్పులు చేయడం కూడా వాళ్లు సహించరు. అలాంటి వాళ్లను చూసి

''పుడితె పుట్లు దూస్తడు''
''ఇచ్చేటోడుంటే సచ్చేదాక తింటడు''
''పీక్క తినుడు లోపుక తాగుడు''

అంటూ అవహేళన చేస్తరు,

మగవాళ్లనే కాదు, ఆడవాళ్లను కూడా ఇక్కడి సమాజం సహించదు. బాధ్యత తెలియని సోమరులు దుబారా పరులైన స్త్రీలపై ఎలాంటి మాటల ఈటెలు ఎక్కుపెడుతారో చూడండి.

''గుమ్మికి ఎసరు పెడుతరు''
''కబళమంటె నోరు తెరుత్తది
కళ్ళెమంటె నోరు మూత్తది''
''తెత్తె తింటది సత్తె ముండమోత్తది''

ఈ పదునైన మాటలు తాకితే ఎంతటి వాళ్లైనా మారవలసిందే. వాళ్ల తీరు మార్చుకొని చక్కబడవలసిందే.

జీవితమంటే పోరాటం అడుగడుగునా ఆరాటపడవలసిందే. అప్పుడే జీవితానికో అందం ఉన్న దానితో తృప్తి పడితె ప్రగతి ఆగిపోతుంది.

ప్రగతి లేని జీవితాన్ని వాళ్లు కోరుకోరు . ఏదో ఇంత పని చేసిన ఉన్న దానితో బ్రతకడం వాళ్లకు నచ్చదు. అలా ఉండే వాళ్లను

'' ఉడుకేసుకొని తిని తడుకేసుకొని పన్నట్టు''

అని ఏవగించుకుంటరు.

దేశభక్తి కవితలో మహాకవి గురజాడ

''తిండి కలిగితె కండగలదోయి
కండగలవాడేను మనిషోయ్'' అన్నాడు. అదే భావాన్ని పల్లీ యులు 'తిండి' ప్రాధాన్యతను ఎంత బలంగా చెప్పారో ఈ మాటలు చూడండి.

''కుడిశినమ్మకు పొడిచినా చావులేదు''
''దవడాడితే దయ్యమదే వదలుతది''

తెలంగాణా ప్రజలకు విలువలు చాలా ప్రధానం. నియత్ (నిజాయితీ)ను వాళ్లు అయిదో ప్రాణంగా భావిస్తారు. ఈ క్రింద మాటల్లో ఆ భావం ఎంత అందంగా చెప్పబడిందో చూడండి.

''మూటపోతె దొరుకుతది గాని
మాట పోతె దొరుకుతదా?''
''అన్న ం పెట్టినోనికి సున్నంపెడుతరా''
''కువార మెంతో కుట్టాదంత''
''బుద్ధుల బట్టి బువ్వుంటది'' ఇద్దరు కలుసుకున్నప్పుడో పనిదగ్గర పదిమంది కూడినప్పుడో లేదా పనిలేక ఎక్కడైనా పదిమంది జమ అయినపుడో. శుభకార్యానికి ఒక చోట చేరినపుడో వాళ్ళు మాట్లాడుకుంటుంటే వినే వాళ్ళ మనస్సు పులకిస్తుంది. మంచి కవిత్వం చదివినంత ఆనందం కలుగుతుంది.

హేమంత పువ్వు



పరిగెడుతున్న కాలం నుండి
హేమంత ఋతువు భూమిపైకి రాలిపడి
శీతల పవనాల విత్తులు చిగురించాయి
కోట్ల కాంతుల ఖిలలు విరజిమ్ముతూ...
అంబరమణి మకరంలోకి దూకి
గగన పసిడి ద్వారాలను తెరిచాడు!
చలి రాకాసి శరీరాన్ని కొరుకుతుంటే...
అగిని నోట్లో మా గతాన్ని పోసి వెలిగిస్తే...
ఆ వెలుగులు మా కష్టాల గొంతులు నులిమి
అంధకార బందీఖానా నుండి విముక్తులను చేసి
భోగి పూల వర్షాన్ని కురిపించాయి!

ముంగిళ్ళు రంగవళ్ళులు అద్దుకుంటే...
డోలు సన్నాయిలు స్వరాలు అందిస్తే...
హరిదాసు గళం రాగాలాలపిస్తే...
దూడూలు నృత్యాలతో దండాలు చేస్తే...
పిండి వంటలు మా నాలుకలకు రుచులద్దితే...
మా పల్లె శోభను చూడటానికి
పట్టణమంతా వలసొచ్చింది!
ఆదర్శాల తీగలతో ఆశయాల పతంగులను
మేఘాల అంచుకు చేరుస్తాము!
సూర్య రేచ్ఛస్సుతో రేగు పండ్లు చేసి
చిన్నారుల దేహాలను అభిషేకిస్తాము!
సంప్రదాయాలను నిలువెల్లా నింపుకొని
మంచు పువ్వులను సాగనంపుతాము!!

విరాజిత (విజ్జు), 9700747280

పుస్తకం నా జెండా




చలికి బద్ధకించి
డ్యూటీ ఎగ్గొట్టిన సూర్యుడు
బడి తప్పిచ్చిన చివరి బెంచి పిల్లవాడిలా
ముసుగు తన్ని పడుకున్నాడు
దారి తప్పిన వరుణుడి
అకాలపు అతిథి పలకరింపు
రాజధాని తడిసి తడిసి ముద్దయ్యింది
ఎముకలు కొరికే చలిలో
మొద్దబ్బాయి నగరం
బల్మీటికి కళ్ళుతెరిచి నడుస్తోంది
అర్థం కాని గోల్‌చక్కర్లను దాటుకుని
ఆదరబాదరగా పరుగుపెడుతోంది
ఎన్నడూ లేని వెలుగుల్ని జిమ్ముతోంది
'దంగల్', 'ఫిదా' రిలీజో
నాయకుని 'రామ్‌లీలా' ఆటనో కాదు
'ఇండియా గేట్'ను ఆనుకొని
విశ్వదర్శనం జరుగుతోంది
మూడురంగుల పతాకం పక్కనే
పుస్తకం జెండాగా ఎగురుతోంది
విజ్ఞానం రాసులు పోసినట్టు
లక్షలాదిగా పుస్తకాలు
వందలాది భాషల్లో అక్షరాలు
ఏకకంఠంతో నేస్తాలై పిలుస్తున్నాయి
పుస్తకాల్ని చిరునామాలుగా చేసుకుని
ముసిముసి నవ్వులు రువ్వుతున్నాయి
నిజానికిక్కడ నిన్నటి దాకా
కార్లు జీపులు మోటారు సైకిళ్లు
తలుకుల్ని వెదజల్లాయి
నగలు, కాస్మోటిక్ మేళాలు
ట్రేడ్ ఫేర్ల అద్దాల అలమారాల్లో
సప్తవర్ణాల సాగరమై పరచుకున్నాయి
క్యాలెండర్లో పేజీ మారిందో లేదో
పుస్తకం భూషణమై వెలిగింది
ప్రపంచమే నడిచివచ్చి అచ్చంగా
నగరం ముంగిట్లో పరుచుకుంది
భాషల యాసలన్నీ
ఇక్కడి వేదిక మీద మాట్లాడుకుంటున్నాయి
ఒకటి కొకటి అర్థంకాక పోవచ్చుకానీ
గుండెవిప్పి ఊసులు పంచుకుంటున్నాయి
ఒక్కో పుట ఒక్కో చిరునామాను లిఖించి
మస్తకంలో ముద్రించు కుంటున్నాయి
అక్షరమెప్పుడూ అలమారాల్లో దాక్కోలేదు
వెలుగై... వెన్నెలై విశ్వమంతా పరచుకుంది
ఈ అక్షరాల పుస్తకమే కదా
బాబాసాహెబ్‌ను 'బోధిసత్వున్ని' చేసింది
ఈ అక్షరమే అబ్దుల్ కలాం పేరును
రామేశ్వరం నుండి రోదసీకి చాటింది
ఈ అక్షరమే లేకుంటే మన 'పీవి'
పేరుముందు ఇంత ఠీవి ఎక్కడిది
నిన్ననే కాదు
నేడు కూడా దేశం చిరునామా
అక్షరమై వెలుగులను విరజిమ్ముతోంది

మూడు రంగుల జెండాతో పాటు
తీరొక్క పుస్తకాలు జండాలై
విశ్వవీధిలో గుండెల్లో కాంతుల్ని కుమ్ముతోంది
ఇప్పుడూ నా దేశమే కాదు
పుస్తకమే నా జెండాగా శ్వాసిస్తున్నాను.

(ఎముకలు కొరికే చలిలో ఢిల్లీ ప్రగతి మైదాన్‌లోని విశ్వ పుస్తక మేళాను చూసి)

– డా. పత్తిపాక మోహన్, 9966229548

తెలుగులో దివ్యాంగ సాహిత్యం



బిల్ల మహేందర్
9177604480

ఇది అస్తిత్వాల యుగం. ఏ వర్గం, సమాజమయితే నిరాదరణకు, నిర్లక్ష్యానికి, చిన్నచూపుకు గురువుతుందో ఆ వర్గము, సమాజము ఆత్మగౌరవాన్ని నిలబెట్టే క్రమంలో నేడు అస్తిత్వ పోరాటాల్ని చేస్తున్న సందర్భం. ఈ పోరాటంలో ఆయా వర్గాలను, సమూహాలను ఒకే భావజాలంలోకి తీసుకరావడం, వారిలో ఎరుకను, స్పృహను రగిలించి, వారిని హక్కుల పరిరక్షణ వైపుగా కార్యోన్ముఖులను చేయడం, తద్వారా ఆ అస్తిత్వానికి సామాజిక గుర్తింపు తీసుకరావడానికి ఇతర వర్గాల, సమూహాల సానుభూతి సహకారంతో ఐక్య కార్యాచరణలో కల్సి వచ్చే విధంగా భావజాల వ్యాప్తి జరుగుతున్నది. వీటన్నటికి అక్షరాలుతోడై ఆయా వర్గాలకు, సమూహాలకు అనుగుణంగా సాహిత్యం సృజించబడుతున్నది. ఈ క్రమంలోనే తెలుగు సాహిత్యంలో దళిత, స్త్రీ, మైనార్టీ, బిసి అస్తిత్వానికి సంబంధించిన కవిత్వం వివిధ ప్రక్రియల్లో దీర్ఘకాలికంగా కొనసాగుతూ వారి ఆత్మగౌరవం నిలబెట్టుకొనే ప్రయత్నం చేస్తుంది. అదే క్రమంలో నేడు గత దశాబ్దం కాలం నుండి నూతనంగా దివ్యాంగ సాహిత్యం వివిధ ప్రక్రియలల్లో చోటు చేసుకుంటూ వారి సమూహానికి, వర్గానికి కొమ్ము కాస్తూ వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తున్నది. ఏ భావజాల వ్యాప్తికైనా సాహిత్యం ప్రధానాంశంగా ఉపయోగపడుతుంది. కాబట్టి అటువంటి సాహిత్యాన్ని ఆయుధంగా చేసుకొని నేడు వివిధ సాహిత్య ప్రక్రియలల్లో దివ్యాంగ సాహిత్యం మన ముందుకు వస్తున్నది. తెలుగు ప్రాచీన సాహిత్యంలో దివ్యాంగులకు సంబంధించిన సాహిత్యం మనకు అంతగా కనిపించనప్పటికి పురాణ గాథల్లో అక్కడక్కడ కొన్ని పాత్రల ద్వారా వారి ఉనికిని మనం గమనించవచ్చు. భాగవతంలోని కుబ్జ పాత్ర, మహాభారతంలోని ధృతరాష్ట్రుడు, అష్టావక్రుడి పాత్రలు, సూర్యుని రథ సారథి అనూరుడు తదితర పాత్రలు ఇందుకు ఉదాహరణలుగా చెప్పవచ్చు. ఆధునికి సాహిత్యంలో గుర్రం జాషువా, దేవులపల్లి కృష్ణ శాస్త్రి మొదలగు కవులు దివ్యాంగ సాహిత్యాన్ని సృజంచారు. అనంతరం నేడు ఎంతోమంది కవులు, రచయితలు, సామాజిక బాధ్యతతో దివ్యాంగ సాహిత్యాన్ని సృజిస్తూ వారి హక్కులు, ఆత్మగౌరవాన్ని పెంపొందించడమే కాకుండా, వారి అస్తిత్వాన్ని నిలబెట్టేందుకు ప్రయత్నిస్తుండడం నిజంగా అభినందించవలసిన విషయం. సమాజానికి మేలు చేకూర్చేది, మానవతకు పట్టం కట్టేది, సమభావనను కలిగించేదే నిజమైన సాహిత్యమైనప్పుడు అ దిశలోనే నేడు దివ్యాంగ సాహిత్యం మన ముందుకు కదులుతున్నది. తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియలలో ఉన్నటువంటి కవిత్వం, కథ, నవల, పాట, నాటిక తదితర అంశాల్లో దివ్యాంగ సాహిత్యం మనకు ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.దివ్యాంగ సాహిత్యంలో 'కవిత్వం ప్రధానమైనదిగా చెప్పవచ్చు. ఆర్తితోనూ, ఉద్వేగంతోనూ మనసు మూలాల్లోకి చొచ్చుకెళ్ళి ఘనీభవించిన మనసులను కరిగించే శక్తి కవిత్వానికి ఉంది. అందుకే నేడు అనేక మంది కవులు ఈ ప్రక్రియలో దివ్యాంగ సాహిత్యాన్ని సందర్భానుసారంగా సృష్టిస్తూ దివ్యాంగ సమాజానికి అండగా నిలుస్తున్నారు. అయితే గత దశాబ్దం పైగా దివ్యాంగలకు సంబంధించిన రచనలు సాహిత్యంలో చోటు చేసుకున్నా సంపుటాలుగా మాత్రం అర దశాబ్దం కాలం నుండే ఎక్కువగా ప్రచురణకు నోచుకోవడం ఆలోచించవలసిన విషయము. వీటిలో నెల్లూరు జిల్లాకు చెందిన కవి మోపూరు పెంచల నర్సింహ్మం వెలువరించిన ''వెలుగుపూలు'' (2007), అనంతపురం జిల్లాకు చెందిన కవి కేరే జగదీష్ వెలువరించిన ''రాత్రి సూర్యుడు'' (2012) రచనలు అంధుల జీవనశైలి, వారి స్థితిగతులను తెలిపే దీర్ఘకావ్య సంపుటులుగా వెలువడ్డాయి. అదే విధంగా మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన పరిశోధన విద్యార్థి చిక్కా హరీష్ కుమార్ వెలువరించిన ''నేనైతే వికలాంగున్నే'' (2013), వరంగల్ జిల్లాకు చెందిన కవి, ఉపాధ్యాయుడు బిల్ల మహేందర్ వెలువరించిన ''గెలుపు చిరునామా?' (2015), హైదరాబాద్‌కు చెందిన సామాజిక సేవకురాలు, రచయిత్రి వెలువరించిన ''ధిక్కారనానీలు'' (2013) మొదలగు స్వీయ సంపుటాలు దివ్యాంగుల అస్తిత్వాన్ని ఆత్మగౌరవాన్ని ప్రతిబింబిస్తాయి. ఆ తర్వాత దివ్యాంగులలో ఆత్మస్థైర్యాన్ని నింపే ప్రయత్నంలో భాగంగా వందమంది కవులు రాసిన వంద కవితలతో బిల్ల మహేందర్ సంపాదకత్వంలో వచ్చినటువంటి ''కాలాన్ని గెలుస్తూ'' (ప్రత్యేక ప్రతిభావంతులపై కవితా సంకలనం) సంకలనం తెలుగు సాహిత్య చరిత్రలో ఒక మైలురాయిగా చెప్పవచ్చు. ఒక ఆత్మవిశ్వాసం ప్రోదిచేసే లక్ష్యంతో ప్రయత్నపూర్వకంగా వచ్చినటువంటి ఈ కవితా సంపుటి దివ్యాంగులపై వచ్చిన మొట్టమొదటి కవితా సంకలనంగా దీనికి ముందు మాట రాసినటువంటి ప్రస్తుత తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ పేర్కొనడం విశేషం. తర్వాత 2015 లో టింగరి వెంకటేశ్ సంపాదత్వంలో వెలువడిన ''నన్ను మాట్లాడనివ్వండి'' కవితా సంకలనం, వాటితో పాటుగా అప్పడప్పుడు దివ్యాంగ సాహిత్యాన్ని సృజిస్తున్నటువంటి కత్తుల బాలక్రిష్ణ (నల్గొండ), సిరిసిల్ల రాజేశ్వరీ (సిరిసిల్లా) తదితర కవులు దివ్యాంగ సాహిత్యాన్ని సృజిసూ వారి ఉనికిని చాటుతున్నారు. అంతేగాకుండా డా.నందిని సిధారెడ్డి 'అవిటితనం, ఆచార్య సత్యనారాయణ ''దేహనేత్రాలు'', డా. నలిమెల భాస్కర్ 'గుడ్డివాళ్ళ చూపు', జూలూరి గౌరి శంకర్ చూపు, అన్వర్ ''గిఫ్టెడ్ చిల్డ్రన్ కవితలు వారి స్వీయ కవితా సంపుటాల్లో ప్రచురించి దివ్యాంగ సమాజానికి అండగా నిలుస్తున్నారు.

1995 వికలాంగుల చట్టం ప్రకారం సమాజంలో అన్ని వర్గాల వారు ఏ విధంగానైతే మావన హక్కుల్ని స్వేచ్ఛను అనుభవిస్తున్నారో అట్లాగే దివ్యాంగులు కూడా వాటిని అనుభవించాలి. వారి అస్తిత్వాన్ని పరిపూర్ణంగా కాపాడుకోవాలి. దీని కోసం తెలుగు సాహిత్యంలో వివిధ అస్తిత్వాలు ఏ విధంగానైతే గుర్తించబడి వారి వారి ప్రయోజనాలను కాపాడుతున్నాయో అదేవిధంగా దివ్యాంగ సాహిత్యం కూడా తెలుగు సాహిత్యంలో గుర్తించబడి, వివిధ ప్రక్రియలలో వస్తున్నటువంటి దివ్యాంగ సాహిత్యాన్ని పూర్తిగా వెలుగులోకి తీసుకొని రావాలి.

కథకు సంబంధించిన ప్రక్రియలను గమనించిప్పుడు మనకు ఎక్కడా దివ్యాంగ సాహిత్యానికి సంబంధిత స్వీయ కథా సంపుటాలు కనిపించవు. కాని ఆయా కవులు వారి స్వీయ సంపుటాలలో అక్కడక్కడ దివ్యాంగ సాహిత్యానికి సంబంధించిన కథల్ని వెలువరించడం మనం చూడవచ్చు. కథా సంకలనాలను పరిశీలించినట్లయితే వరంగల్ జిల్లాకు చెందిన వేముల ఎల్లయ్య సంపాదకత్వంలో వచ్చిన ''అవిటి కథలు'' (2012), కృష్ణా జిల్లాకు చెందిన అసిలేటి నాగరాజు సంపాదకత్వంలో వచ్చిన ''నేను సైతం'' (2016) కథా సంపుటాల్లో దివ్యాంగుల జీవన విధానము, సమాజములో వారి నడవడి, వాటితో పాటుగా కాలా నుగుణంగా దివ్యాంగుల సమాజంలో వస్తున్న మార్పుల్ని మనం చూడవచ్చు. అంతేగాకుండా హైదరాబాద్ కు చెందిన గురజాడ శోభ పేరిందేవి, శివలెంక నాగఉదయలక్ష్మి, ప్రకాశం జిల్లాకు చెందిన పెండ్యాల గాయత్రి తదితరులు దివ్యాంగ సాహిత్యానికి సంబంధించిన కథల్ని రాస్తున్నారు. నవల ప్రక్రియలో మోపూరి పెంచల నర్సింహ్మం ''వెన్నల వర్షం'', యుద్ధనపూడి సులోచన 'ఆరాధన' వేదన శకుంతల 'ఆర్తి', శివలెంక నాగఉదయలక్ష్మి ''జీవన రేఖలు'' (అముద్రితం) తదితర నవలల్లో దివ్యాంగుల చుట్టూ తిరిగే పాత్రలే కాకుండా దివ్యాంగులే ప్రధాన పాత్రధారిగా నడిచే విధానాల్ని చూడవచ్చు. ఇవే కాకుండా సంగారెడ్డి జిల్లాకు చెందిన ప్రముఖ కవి, గాయకులు, స్ఫూర్తి (ఇంద్రారెడ్డి) గారు దివ్యాంగ జీవన విధానాలు, వారి హక్కులు, ఆత్మగౌరవంపై దాదాపుగా ఇప్పటికే 80 పైగా పాటలు రాసి ప్రచురించడం చేశారు. అదేవిధంగా వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో వెలువడ్డ దాదాపు పది పాటలు క్యాసెట్ రూపంలో లభ్యమవుతున్నాయి. దీనితో పాటుగా వరంగల్ జిల్లాకు చెందిన గడ్డం కేశమూర్తి ''వికలాంగుల జీవన విధానం'', రాజశేఖర్, జానకి సంపాదకీయంలో వచ్చినటువంటి ''వికలాంగుల విద్య జీవన విధానము' తదితర వ్యాస సంకలనాలు దివ్యాంగుల సమస్యల్ని తెలియజేస్తాయి. చివరిగా 1995 వికలాంగుల చట్టం ప్రకారం సమాజంలో అన్ని వర్గాల వారు ఏ విధంగానైతే మావన హక్కుల్ని స్వేచ్ఛను అనుభవిస్తున్నారో అట్లాగే దివ్యాంగులు కూడా వాటిని అనుభవించాలి. వారి అస్తిత్వాన్ని పరిపూర్ణంగా కాపాడుకోవాలి. దీని కోసం తెలుగు సాహిత్యంలో వివిధ అస్తిత్వాలు ఏ విధంగానైతే గుర్తించబడి వారి వారి ప్రయోజనాలను కాపాడుతున్నాయో అదేవిధంగా దివ్యాంగ సాహిత్యం కూడా తెలుగు సాహిత్యంలో గుర్తించబడి, వివిధ ప్రక్రియలలో వస్తున్నటువంటి దివ్యాంగ సాహిత్యాన్ని పూర్తిగా వెలుగులోకి తీసుకొని రావాలి. అప్పడే వారి ప్రయోజనాలను, అస్తిత్వాన్ని కాపాడినట్లవుతుంది.

నాగభైరవ పురస్కారానికై ఆహ్వానం

2016–2017లో వెలువరించిన కవితాసంపుటాల పోటీని నిర్వహిస్తున్నారు. రెండవ నాగభైరవ కోటేశ్వరరావు పేరిట ఇచ్చే ఈ పురస్కారానికి రూ.5వేలు నగదు, సత్కారం ఇస్తారు. ఫిబ్రవరి 2018 నాడు జరిగే ప్రత్యేక కార్యక్రమంలో పురస్కారం ఉంటుంది. కవితా సంపుటులు ఈ నెల 30 వరకు చిన్ని నారాయణరావు, 'శ్రీకేతనమ్' ఆదిత్యనగర్, చిల్డ్రన్స్ పార్క్ రోడ్, నెల్లూరు – 524003 (ఆం.ప్ర.) కు పంపించాలి. వివరాలకు 9440202942 సంప్రదించవచ్చు.

పానుగంటి కథల పోటీ

'కవి సంధ్య' యానాం వారు అంతర్జాతీయ కవితాదినోత్సవాన్ని పురస్కరించుకొని (మార్చి 21) పానుగంటి కవితల పోటీ నిర్వహిస్తున్నది. పోటీలో పాల్గొనే వారు రూ.200/– ప్రవేశ ఫీజు వివరాలను ఫిబ్రవరి 20వ తేదీ వరకు పంపించాలి. చిరునామా; దాట్ల దేవదానం రాజు, జక్రియానగర్, యానాం – 533464, బ్యాంకు వివరాలు ; కవి సంధ్య, అకౌంటు నెంబరు : 155711100002360, ఆంధ్రాబ్యాంకు, యానాం, IFSC కోడ్ : ANDB 0001557, వివరాలకు : 9440105987.

రేడియో కవి సమ్మేళనంలో ప్రసాదమూర్తి

ఆకాశవాణి అఖిల భారత స్థాయిలో నిర్వహించే కవి సమ్మేళనానికి తెలుగు భాష నుండి ప్రసాదమూర్తి కవిత 'పిచ్చినాన్న' ఎంపికైంది. దేశంలోని 22 భాషల్లో ఈ కవి సమ్మేళనం ఈ నెల 16న ఇండోర్‌లో జరగనుంది. ఈ కవితను ప్రముఖ కవయిత్రి శాంతాసుందరి హిందీలోకి అనువదించారు. ఈ కవితలన్నీ రాబోయే రిపబ్లిక్ దినోత్సవం రోజు ఆలిండియా రేడియో అన్ని ప్రాంతాల్లో ప్రసారమవుతాయి.

17న చాసో పురస్కారం

ప్రఖ్యాత రచయిత చాగంటి సోమయాజులు పేరిట ప్రతియేటా ఇచ్చే సాహిత్య పురస్కారం ఈ యేటికి ప్రముఖ రచయిత గౌరీహరిదాస్‌కు ఇస్తున్నారు. ఈ నెల 17న సాయంత్రం 6 గంటలకు విజయనగరంలోని గురజాడ గ్రంథాలయంలో ఈ కార్యక్రమం జరుగుతుందని చాగంటి తులసి తెలిపారు.

మన తెలంగాణ
5
హైదరాబాద్
సోమవారం
15 జనవరి, 2018
www.manatelangana.news

విజేత
సక్సెస్ ఫార్ములా



పుస్తకంతో విశ్వదర్శనం

పుస్తక ప్రియులకు శుభవార్త...ఎప్పడెప్పడా అని ఎదురుచూసే పుస్తకాల పండుగ వచ్చేస్తోంది.. దేశ విదేశాల నుంచి వేల సంఖ్యలో పుస్తకాలు ప్రదర్శనలో కొలువుదీరనున్నాయి. విభిన్న భావధారల సముచిత సమాహారం...విభిన్న ఆలోచనలకు...ధోరణులకు, వాదాలకు, చర్చలకు ఆలవాలం హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శనశాల. లుక్ కల్చర్ వచ్చిన తర్వాత బుక్ కల్చర్ పోయిదనుకునేవారికి సమాధానం ఈ పుస్తక ప్రదర్శన... పోటీ పరీక్షలకు సంబంధించిన కరెంట్ ఎఫైర్స్, జీకే, తెలుగు అకాడెమీ, పోటీ పరీక్షల పుస్తకాలు, తెలంగాణ చరిత్ర, జీవత చరిత్రలు, రాజకీయ విజ్ఞానం, భాషాసాహిత్యాలు, సామాజిక శాస్త్రం , అర్థ శాస్త్రం, జర్నలిజం, విజ్ఞానం, ఆరోగ్యం, విద్య, బాల సాహిత్యం, కథలు, నవలలు, పాటలు, సమకాలీన రాజకీయాలు, వ్యక్తిత్వ వికాసం, వ్యాకరణం, డిక్షనరీలు ఇలా ఒకటనికాదు అన్ని రకాల పుస్తకాలు కొలువుదీరే ప్రదేశమిది...ఈ నేపథ్యంలో హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షుడు, కవి, రచయిత, బీసీ కమిషన్ సభ్యులు జూలూరి గౌరీశంకర్‌తో మాటాముచ్చట...

పుస్తకాలను పండుగలా జరుపుతున్నట్లున్నారు?
అవును. చిన్నాపెద్దా తారతమ్యం లేకుండా అందరూ సందర్శించే ఈ ప్రదర్శనను పుస్తకాల పండుగలానే భావించాలి. ఇది పుస్తక మతం. దీంట్లో అందరూ రావచ్చు. విస్తృతమైనటువంటిది. పుస్తక ప్రదర్శనల ద్వారా లక్షలాది మంది దగ్గరకు పుస్తకం చేరుతుంది.

హైదరాబాద్ బుక్ ఫెయిర్ గురించి...
పుస్తకాలకు సంబంధించి దేశంలోనే హైదరాబాద్ బుక్ ఫెయిర్ రెండో స్థానంలో నిలిచింది. 35 సంవత్సరాల క్రితం బుక్‌ఫెయిర్ హైదరాబాద్ నగరంలోని సిటీ సెంట్రల్ లైబ్రరీలో ప్రారంభమైంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు 30 ప్రదర్శనలు జరిగాయి. ఢిల్లీ, కలకత్తా, జైపూర్ తర్వాత అతిపెద్ద పుస్తక ప్రదర్శన మనదే. ప్రతి ఏడాది డిసెంబర్‌లో నిర్వహిస్తున్నాం. ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న హైదరాబాద్ బుక్ ఫెయిర్ ఈ నెల 18 నుంచి 28 వరకు జరగనుంది. జ్ఞాన తెలంగాణ నిర్మాణానికి పునాదిగా నిర్వహించే ఈ ప్రదర్శనను ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించనున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి పుస్తక విక్రేతలు తరలిరానున్నారు. తెలంగాణ కళాభారతి (ఎన్‌టిఆర్ స్టేడియం)లో జరిగే 31వ పుస్తక ప్రదర్శన ఇది. గత ఏడాది పదిలక్షల మంది పుస్తక ప్రియులు ప్రదర్శనను సందర్శించారు. ప్రతి ఏడాది డిసెంబర్‌లో జరిగే పుస్తకప్రదర్శన ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా వాయిదా పడింది. సాంస్కృతికంగా, భాషాపరంగా తెలుగు మహాసభలు జరిగితే హైదరాబాద్ బుక్ ఫెయిర్ అనేది జ్ఞాన తెలంగాణ నిర్మాణానికి పునాదిగా జరగనుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్నటువంటి పేరెన్నికగల పుస్తకాలన్నింటికీ సంబంధించి కూడా పబ్లిషర్స్ పుస్తకాలను తీసుకొచ్చి ఇక్కడ పెడతారు. ప్రపంచవ్యాప్తంగా ఈ నెలలో రిలీజైన పుస్తకం కూడా ప్రదర్శనశాలలో దొరికే అవకాశం ఉంటుంది. అన్ని కోణాల నుంచి అన్ని రకాల పుస్తకాలు దొరుకుతాయి. పలు జాతీయ భాషలు, పలు రాష్ట్రాల మాతృ భాషలకు సంబంధించిన స్టాల్స్ ఉంటాయి.

టైమింగ్స్ ఎలా ఉంటాయి?
ప్రతి రోజూ మధ్యాహ్నం 1 గంట నుంచి రాత్రి 8.30 వరకు ప్రదర్శన నడుస్తోంది. ఈసారి రెండు వేదికలు పెడుతున్నాం. ఒక పెద్ద వేదిక, ఒక చిన్నవేదిక ఉంటాయి. పుస్తకావిష్కరణ కార్యక్రమాలన్నీ చిన్నవేదికపై జరుగుతాయి. సాయంత్రం పూట 5 నుంచి 8.30 వరకు జరగబోయే సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రముఖుల సందేశాలన్నీ పెద్ద వేదికపై నిర్వహించనున్నాం.

తెలంగాణ రాష్ట్ర అవతరణ తర్వాత బుక్‌ఫెయిర్ పరిస్థితుల్లో ఏమైనా మార్పులు వచ్చాయా?
రాష్ట్రం అవతరించిన తర్వాత బుక్‌ఫెయిర్‌కు మరింత అందం వచ్చింది. దేశవ్యాప్తంగా 350కి పైగా పబ్లిషర్స్ ఈ ప్రదర్శనలో పాల్గొంటారు. ప్రభుత్వం కూడా పుస్తక ప్రదర్శనకు మరింత చేయూత నిస్తుంది. నగరం నడిబొడ్డున ఉన్న తెలంగాణ కళాభారతి(ఎన్‌టిఆర్ స్టేడియం)ని ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. ఇది చాలా పెద్ద సాయం.

పుస్తకాలు చదివే అలవాటు బాగా తగ్గింది కదా?
పుస్తకాలు చదివే అలవాటు కొంత తగ్గినమాట నిజమే. బుక్ కల్చర్ కొంత తగ్గి లుక్ కల్చర్ పెరిగింది. పుస్తక ప్రదర్శనలు యువతలో కొత్త ఆలోచనలు రేకెత్తించడానికి ఉపయోగపడతాయి. ఎలక్ట్రానిక్ మీడియా నుంచి పుస్తకం వైపునకు దృష్టి మరల్చడానికి దోహదపడతాయి.

తెలంగాణ నిర్మాణంలో పుస్తకాల పాత్ర...
తెలంగాణ ఉద్యమ సమయంలో పుస్తకాలు అత్యంత కీలకపాత్ర పోషించాయి. ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ రచించిన "తెలంగాణలో ఏం జరుగుతుంది"అన్న పుస్తకం రాష్ట్రసాధన ఉద్యమానికి ఎంతో ఉపయోగపడింది. తెలంగాణ ఉద్యమానికి భావజాల ప్రచారానికి పుస్తకాలు ఎంతో దోహదపడ్డాయి. తెలంగాణ పునర్నిర్మాణంలో వీటి పాత్ర మరింత ఉంది. పునర్నిర్మాణం పటిష్టంగా జరగాలంటే అది జ్ఞాన తెలంగాణగా మారాలి. సాహిత్యం నుంచి శాస్త్ర సాంకేతిక రంగాల వరకు మన పునాది గట్టి పరచుకోవడానికి అన్ని శాస్త్రాలకు సంబంధించిన పుస్తకాలను యువత లోతుగా అధ్యయనం చేయాల్సి ఉంది.
తెలంగాణ రాష్ట్రం అవతరించిన తర్వాత తెలంగాణ సంస్కృతి ఆట పాట మాట ఇవన్నీ ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. తెలంగాణ సంస్కృతి కులీకుతుబ్‌షాల చరిత్ర, నిజాం రాజుల పాలన, తెలంగాణలో ఉన్న భిన్న సంస్కృతులు, గుళ్లు గోపురాలు ఇవన్నీ ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి. ముఖ్యంగా పోటీ పరీక్షలకు వెళ్లే అభ్యర్థులు ఈ పుస్తకాలు చదవాల్సి ఉంటుంది. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డా. నలిమెల భాస్కర్ రాసిన తెలంగాణ పదకోశం లాంటి వేలాది పుస్తకాలు ఈ ప్రదర్శనలో ఉంటాయి. తెలంగాణ చరిత్ర భిన్న కోణాల్లో వచ్చాయి. అవి లక్షల్లో అమ్ముడుపోతున్నాయి.

పుస్తక పఠనం ప్రాధాన్యం...
పుస్తక పఠనంతో వీసాలేకుండా విశ్వదర్శనం చేయొచ్చు. ప్రతి ఒక్కరి జీవితాల్లో పుస్తకానిది ఓ ప్రత్యేక స్థానం. అన్ని కులాలు, మతాల వారిని తన వద్దకు తెచ్చుకునేవి... భాషను సాహిత్యాన్ని బతికించేవి పుస్తకాలే. పుస్తకాన్ని మించిన మిత్రుడు లేడు..పుస్తక పఠనం విచక్షణాజ్ఞానాన్ని ఇనుమడింపజేస్తుంది. కుటుంబంపై గౌరవం, దేశంపై భక్తి , సమాజంపై నిబద్ధత ..మొత్తం ప్రపంచంపైన అవగాహన కల్పించేవి పుస్తకాలే. అందుకే ప్రతి ఒక్కరూ పుస్తకాలను చదవడం నిత్యకృత్యం చేసుకోవాలి. పుస్తక పఠనంతో ఆరోగ్యం, ఆయుష్షు పెరుగుతుందని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. పూర్వం శుభకార్యాలకు పుస్తకాలను బహుమతిగా ఇచ్చేవారు. మళ్లీ అదే సంప్రదాయం కొనసాగాలి.

పిల్లలను పుస్తకాల వైపు మళ్లించాలంటే ..?
ఎలక్ట్రానిక్ మీడియా, సామాజిక మాధ్యమాల వల్ల పిల్లల ఆలోచనలు ఎప్పుడూ వాటిచుట్టూనే తిరుగుతుంటాయి. చేతిలో సెల్‌ఫోన్ .. ఆలోచనలన్నీ వైఫై చుట్టూనే తిరుగుతుంటే.. సహజంగా వారిలో సృజనాత్మకత తగ్గుతుంది. పాఠశాల స్థాయి నుంచే పిల్లల ఆలోచనల్లో మార్పులు వచ్చే విధంగా వారిని తీర్చిదిద్దేవి పుస్తకాలే. అందుకు తరగతి గదే పునాది. అటు ఉపాధ్యాయులు, ఇటు తల్లిదండ్రులు పిల్లలచేత కథలు, నవలలు, కవితలు, ఆత్మకథలు చదివించాలి. మంచి సాహిత్యాన్ని వారి చేతికందించాలి. పిల్లలకు పుస్తకాలు చదివే అలవాటు వస్తే, అదే వారి జీవితాన్ని మార్చేస్తుంది.

పుస్తకాలు సమాజాన్ని మారుస్తాయా?
తప్పకుండా మారుస్తాయి. సమాజ మార్పునకు ప్రధాన పనిముట్టు పుస్తకమే. ఉదాహరణకు ప్రపంచంలో అత్యధిక సర్క్యులేషన్ ఉన్న అమ్మ నవలను కోట్లాది మంది పాఠకులు చదివారు. ఈ పుస్తకం ఎంతో మందికి అద్భుత ఆలోచనల్ని కలిగించింది. కమ్యూనిష్టులను తయారు చేసింది. తెలంగాణ ఉద్యమ నిర్మాణానికి, తెలంగాణ ఆవిర్భావానికి పుస్తకాలే కారణం.

వ్యక్తిగతంగా ఎలాంటి మార్పులను కలిగిస్తుంది పుస్తకం?
పుస్తకం చదివిన వారే ప్రశ్నించడం మొదలుపెడతారు. అప్పుడే సమస్యలు పరిష్కారం అవుతాయి. తర్వాతనే వ్యక్తితోపాటు సమాజం సన్మార్గంలో నడుస్తుంది. రష్యావిప్లవం, ఫ్రెంచి విప్లవం, ప్రపంచ మార్పునకు పుస్తకాలే దోహదం చేశాయి. అలాగే పారిశ్రామిక విప్లవానికి పుస్తకాలే పునాదులు.

వేదికపై పుస్తకావిష్కరణ జరుపుకోవాలంటే ...?
పుస్తకావిష్కరణకు సంబంధించి ఎవరెవరు పుస్తకాలు పెడతారు, ఏ సమయానికి ఇవ్వాలన్న విషయాలన్నీ రచయితలు ముందే మాకు దరఖాస్తు చేసుకుంటారు. ఆ ప్రకారంగా వారు కోరుకున్నటువంటి రోజున, కావాల్సినటువంటి షెడ్యూల్‌ను ఒకటి నిర్ణయిస్తాం. దాని ప్రకారం వారికి ఇస్తాం. నెలరోజుల క్రితమే దేశవ్యాప్తంగా పబ్లిషర్స్‌కు తెలియజేశాం. పుస్తకావిష్కరణకు చెందినవారు అప్లై చేసుకోవడం, శ్లాట్ కావాలని అనడం, ఆ శ్లాట్‌కి ఏరోజు, ఎప్పుడు కావాలో మాట్లాడుకోవడం అవన్నీ జరిగిపోయాయి. అందుకోసం వారు నామినల్ రెంట్ కట్టాల్సి ఉంటుంది.

ప్రత్యేకమైన స్టాల్స్ ఏమేం ఉంటాయి?
రచయితలు తమ రచనల్ని సొంతంగా ప్రదర్శించాలనుకుంటారు. అటువంటివారి కోసం ప్రత్యేకమైన స్టాల్స్ ఏర్పాటుచేశాం. వీరు కూడా నామినల్‌గా రెంట్ కడితే సరిపోతుంది. అదేవిధంగా అన్ని దినపత్రికలకు సంబంధించిన స్టాల్స్ కూడా ఈసారి పెడుతున్నాం. ఇప్పటివరకు 320 స్టాల్స్ వచ్చాయి. ఇంకా అడుగుతున్నారు. కానీ వీలుగాదు.

ప్రదర్శనకు వచ్చేవారికి ఏర్పాట్లు ...
ప్రదర్శనకు వచ్చే సందర్శకులకు మంచినీటి సౌకర్యం, మూత్రశాలలు ఏర్పాటు చేస్తున్నాం. అంతేకాకుండా వారు తిరిగేటప్పుడు కింద దుమ్ము రేగకుండా ఉండేందుకు నీళ్లు చల్లుతున్నాం.

ప్రభుత్వ సహకారం ఉందా?
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, సాంస్కృతిక వ్యవహారాల శాఖ, భాషా సాంస్కృతిక శాఖలు మాతో సహకరిస్తున్నాయి. దాంట్లో భాగంగానే తెలంగాణ కళాభారతి(ఎన్‌టిఆర్ గ్రౌండ్)ను ఉచితంగా ఇస్తున్నారు. ఇది మాకెంతో కలిసివచ్చింది. లేకుంటే రోజుకు లక్ష రూపాయల వరకు కిరాయి చెల్లించాల్సి ఉండేది. ఆర్థికంగా, హార్థికంగా అన్నిరకాలుగా సహకరిస్తున్నారు. కల్చరల్ ప్రోగ్రాంకు కూడా చేదోడువాదోడుగా ఉంటారు. రాష్ట్ర ప్రభుత్వం, హైదరాబాద్ బుక్‌ఫెయిర్ సంయుక్తంగా బుక్‌ఫెయిర్‌ను నిర్వహిస్తోంది.

నెల మారినట్లుంది కదా?
పిల్లల పరీక్షలకు ముందుగానే ప్రతి ఏడాది డిసెంబర్‌లో పుస్తక ప్రదర్శనను ఏర్పాటుచేస్తున్నాం. ఈ సారి మాత్రం ప్రపంచ తెలుగు మహాసభలను వాటి కుండే ప్రాధాన్యత వల్ల వాయిదా పడింది. గత సంవత్సరం బుక్‌ఫెయిర్‌ను పదిలక్షల మంది పుస్తక ప్రియులు సందర్శించారు. ఈ ఏడాది కూడా తప్పకుండా పది లక్షలు దాటతారని అంచనా.


సాంస్కృతిక కార్యక్రమాలకు పెద్దపీట వేస్తున్నట్లున్నారు?
కావల్సిన పుస్తకాల్ని చూడటం, కొనుక్కోవడంతో సరిపోదుగదా. సందర్శకులకు కొంత ఆటవిడుపు కావాలి. అందుకోసం సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తుంటాం. హైదరాబాద్ బుక్‌ఫెయిర్‌లో పుస్తకావిష్కరణ అంటే రచయితలు గౌరవంగా భావిస్తారు. ముఖ్యంగా రాష్ట్రం ఏర్పడ్డాక చాలా పుస్తకాలు వేదికపై ఆవిష్కరణకు నోచుకున్నాయి. విభిన్న ఆలోచనలకు, విభిన్న ధోరణులకు, విభిన్న వాదాలకు సంబంధించిన అంశాలపై కూడా గత ఏడాది సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాం. ఇక పుస్తక ప్రదర్శనశాలకు వచ్చినవారికి ఆటవిడుపుగా బయట తినుబండరాలు లభిస్తాయి. రకరకాల పచ్చళ్లు, పూతరేకుల్లాంటి పిండివంటలు ఇలాంటివన్నీ ఉంటాయి. పార్కింగ్ ప్లేస్ సెపరేట్‌గా ఉంటుంది.

పుస్తక ప్రదర్శనకు అయ్యే ఖర్చు...
పుస్తకాలకు సంబంధించి ప్రతీ స్టాల్ దగ్గరా మేం కొంత డబ్బు వసూలు చేస్తాం. ఒక స్టాల్ నిర్మించడానికి దాదాపుగా రూ.15, 20 వేలు ఖర్చవుతుంది. స్టాల్ తీసుకునే వారికి కనీస అవసరాలు, ఎలక్ట్రిసిటీ, వాటి నిర్వహణ ఖర్చుతో కూడుకొంది. అందుకే ఒక్కో బుక్‌స్టాల్ దగ్గర రూ. 9వేల వరకు తీసుకుంటాం. ఇంగ్లీషు బుక్ స్టాల్ అయితే రూ.25 నుంచి 35 వేల వరకు వసూలు చేస్తాం. స్టాల్స్‌ను లాటరీ పద్ధతి ద్వారా ఇస్తాం.

వేదికలకు సాహిత్యకారుల పెట్టడానికి కారణం?
రాష్ట్రం ఏర్పడ్డాక నిర్వహిస్తున్న పుస్తక ప్రదర్శన ప్రతిసారీ ప్రాంగణానికీ, వేదికలకు తెలంగాణ ఔన్నత్యానికి సంబంధించినటువంటి మహామహుల పేర్లను పెడుతున్నాం. ఇప్పటివరకు కాళోజీ ప్రాంగణం, జైశంకర్ ప్రాంగణం, సురవం ప్రతాపరెడ్డి ద్వారం, తొలి తెలుగు పాట రాసిన చందాల కేశవదాసు ప్రాంగణం, కవులు సుద్దాల హనుమంతు వేదిక, మహాశ్వేతాదేవి, గూడ అంజన్న వంటి వారి పేర్లు పెట్టాం.


ప్రదర్శనలు హైదరాబాద్‌కే పరిమితమా?
దేశ వ్యాప్తంగా ఢిల్లీ వరల్డ్ బుక్‌ఫెయిర్, కొచ్చిన్‌లో ఇంటర్నేషనల్ బుక్ ఫెయిర్, విజయవాడ, హైదరాబాద్‌లో జాతీయ పుస్తక ప్రదర్శనగా జరుపుకుంటారు. కానీ మేం హైదరాబాద్ పుస్తక ప్రదర్శనను ఈ మహానగరం నుంచి మట్టి పాదాల దగ్గరకు తీసుకెళ్లాం. అంటే మారుమూలనున్న గ్రామంలో కూడా పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశాం. ఒక వెయ్యి నుంచి రెండు వేల పుస్తకాలను గ్రామంలో పెట్టాం. ఖమ్మంజిల్లా రొట్టెమాకు రేవు అనే ఊరిలో యాకూబ్‌లాంటి కవి, రచయితల ప్రోత్సాహంతో ప్రదర్శనలు జరిగాయి. అక్కడ ప్రదర్శనకు చుట్టుపక్కల గ్రామాలవారు వచ్చారు. ఖమ్మం, వరంగల్లు, మహబూబ్‌నగర్, కొత్తగూడెం, కామారెడ్డి, కరీంనగర్‌జిల్లాల్లోనూ పుస్తక ప్రదర్శనలు ఏర్పాటుచేశాం. నగరంలో పదిలక్షలు వస్తుంటే అక్కడ లక్షమంది వస్తున్నారు. జిల్లా కేంద్రాలకి, మండల కేంద్రాలకి, మారుమూల గ్రామాలకీ ఈ పుస్తక ప్రదర్శనలను తీసుకుపోతున్నాం. పుస్తకానికి విసృతమైన ప్రచారం కల్పించడమే మా లక్ష్యం. పుష్పక విమానంలాంటి పుస్తక విమానాన్ని ఎక్కితే ప్రపంచాన్ని మొత్తం ఖర్చు లేకుండా చుట్టిరావచ్చు. ఏడాది మొత్తంలో ఒక్కోనెల ఒక్కోచోట జిల్లాలో ప్రదర్శనలు ఏర్పాటుచేస్తున్నాం.

ఎటువంటి పుస్తకాలు ఉంటాయి?
పంచతంత్రం, చందమామ, బాలల బొమ్మలు, తెనాలిరామలింగడు, భాగవతం, అరేబియన్‌నైట్స్, బంగారు నీతికథలు, అక్బర్ బీర్బల్, గ్రీకుపురాణంలాంటి బాలసాహిత్యానికి సంబంధించిన పుస్తకాలు లభిస్తాయి. భక్తి నుంచి అంతరిక్షంలో జరుగుతున్న శాస్త్రసాంకేతిక పుస్తకాల వరకు ఇక్కడ దొరుకుతాయి. కొత్త తరంలోకి పుస్తకాన్ని తీసుకెళ్లడానికి, విభిన్న భాషల్లో, విభిన్న అంశాల్లో వచ్చినటువంటి వాదాలు, వివిధ సంఘర్షణలు, జాతీయ పోరాటాల దగ్గర నుంచి ఆత్మగౌరవ పోరాటాల వరకు రాసిన పుస్తకాలన్నీ స్టాల్స్‌లో లభ్యమౌతాయి. మహిళలకు సంబంధించినవి అన్ని రకాల పుస్తకాలతోపాటు స్త్రీవాదం, దళితవాదం, బహుజనవాదం, మైనార్టీవాదాలు, మార్క్సిజం, లెనినిజం, మావో ఆలోచనావిధానానికి సంబంధించినవి ఇలా అన్నిరకాలు లభిస్తాయి. జ్యోతిషం, వాస్తు, భక్తి రక్తి ముక్తి ఇలా అన్నిరకాలుంటాయి.
వ్యక్తిత్వం రూపుదిద్దుకోవడానికి, సన్మార్గంలో నడవడానికి దోహదపడేది పుస్తకం. దేశాన్ని నిలబెట్టే ఆయుధం పుస్తకం. జ్ఞాన సముపార్జనకు పుస్తకాలే శరణ్యం. పుస్తకాలు చదవడాన్ని ఉద్యమంగా అలవర్చుకోవాలి. మహనీయులు కారులో ప్రయాణం చేసినా, చెరసాలలో ఉన్నా పుస్తకాలే చదివేవారు. పుస్తకాలకు కళ్లుంటాయి. అవి ప్రపంచాన్ని చూపిస్తాయి. ప్రగతిపథంవైపు నడిపిస్తాయి. మనల్ని విజ్ఞాన సింహాసనంపైకి ఎక్కిస్తాయి. ప్రపంచంలోని అనేక మంది వ్యక్తులు మంచి పుస్తకాలు చదివి మహోన్నతులయ్యారు. అధ్యయనం ఒక్కటే మనిషిని తీర్చిదిద్దుతుంది.



మల్లీశ్వరి వారణాసి

సోలార్ పరుగులు



డ్రాగన్ కంట్రీ చైనా తొలి సోలార్ పవర్ జాతీయ రహదారిని ప్రయోగాత్మకంగా పరీక్షించి విజయం సాధించింది. చైనాలోని షాండాగ్ ప్రావిన్స్ రాజధాని జినాన్ నగరంలో కిలోమీటరు పొడవైన సోలార్ జాతీయ రహదారిని పూర్తి స్థాయిలో రాకపోకలకు అనుమతించి పరీక్షించింది. ఫ్యూచర్ రవాణాలో ఎలక్ట్రిక్ వెహికల్స్ వైర్ లెస్ ఛార్జింగ్‌కు ఈ సోలార్ రహదారులు ఊతమివ్వనున్నాయి. సోలార్ పవర్ రహదారుల ద్వారా ఉత్పత్తయ్యే విద్యుత్‌తో ఎలక్ట్రిక్ కార్లను ఛార్జ్ చేసుకోవచ్చు. ఈ రోడ్డు మీద ఇప్పుడు పూర్తి స్థాయిలో రాకపోకలకు అనుమతిచ్చారు. కాంతి ప్రసరణ ద్వారా విద్యుత్ తయారయ్యే పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చిన ప్రపంచపు తొలి రోడ్డు ఇదే. దీనిని చైనాలోని జినాన్ ఎక్స్‌ప్రెస్‌వే మీద కిలోమీటరు మేర నిర్మించారు. ఈ రోడ్డు మీద పడిన కాంతి శక్తి విద్యుత్ శక్తి రూపంలోకి మారుతుంది. ఈ రోడ్డు మూడు సంవత్సరాల పాటు నిరంతరం విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తుంది. అంటే, మూడు లేయర్లలో ఉన్న ఈ రోడ్డు అడుగు భాగంలో ఇన్సులేటెడ్ లేయర్, మధ్యలో కాంతి ప్రసరణ(ఫోటో వోల్టాయిక్) ఫలకలు , పై భాగంలో పారదర్శకపు కాంక్రీట్ లేయర్ ఉంటుంది. 5,784 చదరపు అడుగుల మేర ఈ ప్యానళ్లను పరిచారు. వీటి మొత్తం సామర్థ్యం 800 కిలోవాట్లుగా ఉంది. సోలార్ ఫోటో వోల్టాయిక్ ఆధారంతో పవర్ ఉత్పత్తి చేసే ఈ మార్గాలను ఎక్కువగా ఫోటోవోల్టాయిక్ ఉపరితల రహదారులు ఉంటాయి. భవిష్యత్తులో విద్యుత్ ఉత్పత్తి చేయడానికి ఇదొక ప్రధాన వనరు కానుంది. ఈ రోడ్డు మీద ఉన్న పారదర్శక పదార్థం సూర్యరశ్మి చర్య జరిపి కాంతిని ఉత్పత్తి చేస్తుంది. ఇలా ఉత్పత్తి అయిన విద్యుత్తును జాతీయ రహదారుల వెంబడి ఉన్న లైట్లను, రహదారి గుర్తులు, నిఘా కెమెరాలు, సొరంగ మార్గాలు, టోల్ గేట్ కేంద్రాలలో ఉపయోగించుకోనున్నారు. రహదారి మీద ఫోటోవోల్టాయిక్ ప్యానళ్లను ఏర్పాటు చేసి విద్యుత్ ఉత్పత్తి చేసే ఇలాంటి ప్రాజెక్ట్ ద్వారా సోలార్ విద్యుత్తును ఉత్పత్తి చేయడానికి అవసరమయ్యే ప్రత్యేక అదనపు నిర్మాణాల అవసరం తగ్గిపోతుందని ఈ గ్రూప్ చైర్మెన్ జూ చున్‌ఫు పేర్కొన్నాడు.
ఫ్యూచర్‌లో ఎలక్ట్రిక్ వాహనాలకు వైర్ లెస్ ఛార్జింగ్ కల్పించడం, రోడ్ల మీద పేరుకుపోయే మంచును కరిగించడం ఇంటర్నెట్ సేవలను విస్తరించడంలో ఈ ప్యానళ్లు కీలకం కానున్నాయి. సోలార్ విద్యుత్ ఉత్పత్తిలో చైనా ఇప్పటికే ఆధిక్యంలో ఉంది. దీనికి తోడు పెట్రోల్ , డీజల్ కార్ల స్థానాన్ని ఎలక్ట్రిక్ కార్లు భర్తీ చేయనుండటంతో ఛార్జింగ్ అవసరాలకు కావాల్సిన విద్యుత్‌ను ఉత్పత్తి చేయడానికి కొత్త మార్గాలను చైనా అన్వేషిస్తోంది. అందులో భాగంగానే ఈ సోలార్ ఫోటో వోల్టాయిక్ పవర్ రహదారిని నిర్మించిందని చెప్పవచ్చు.

మన తెలంగాణ
6
హైదరాబాద్
సోమవారం
15, జనవరి 2018
www.manatelangana.news

కొనసాగుతున్న 'స్వీట్ హైదరాబాద్'



మన తెలంగాణ / హైదరాబాద్ : హైదరాబాద్‌లో స్వీట్ ఫెస్టివల్ ఉత్సాహంగా కొనసాగుతోంది. దాదాపు 1,000 రకాలకు పైగా మిఠాయిలు కొలువుదీరడం.. సంక్రాంతి సెలవులు కావడంతో భారీ సంఖ్యలో ప్రజలు పరేడ్ గ్రౌండ్స్‌కు తరలివస్తున్నారు. దీంతో ఇక్కడ పెద్ద ఎత్తున సందడి నెలకొంది. యువత తమకు నచ్చిన మిఠాయిల పక్కన నిలబడి సెల్ఫీలు దిగుతుండగా.. మహిళలు వివిధ రకాలను రుచి చూస్తూ వివరాలు తెలుసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు.కొన్ని స్టాళ్లలో అప్పటికప్పుడు వండి సందర్శకులకు రుచి చూపిస్తుండటం విశేషం. 25 రాష్ట్రాల నుంచి వచ్చిన తయారీదారులు తమ ప్రత్యేకమైన వంటకాలను సందర్శకులకు వివరిస్తున్నారు. విదేశీ వంటకాలనూ ప్రదర్శించారు. 78 రకాల లడ్డూలు, 38 రకాల హల్వా వంటకాలు ఆకట్టుకున్నాయి. తమ ఉత్పత్తులను ప్రజలకు చేరువ చేయడానికి ఈ ప్రదర్శన ఉపయోగ పడిందని తయారీదారులు పేర్కొన్నారు. ఈ ప్రదర్శన ఈ నెల 15 వరకు కొనసాగుతుంది.

పరోక్ష పద్ధతిలో సర్పంచ్ ఎన్నికల ఆలోచనను ఉపసంహరించుకోవాలి

- సిఎంకు కృష్ణయ్య విజ్ఞప్తి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్.కృష్ణయ్య తదితరులు

మన తెలంగాణ/ముషీరాబాద్ : పంచాయతీరాజ్ చట్టంలో సవరణలు తీసుకువచ్చి సర్పంచ్ ఎన్నికలు పరోక్షంగా నిర్వహించాలనే ఆలోచనను ఉపసంహరించుకోవాలని కోరుతూ సీఎం కేసిఆర్‌కు బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య ఆదివారం లేఖ రాసారు. దీనికి సంబంధించిన వివరాలను బిసి భవన్‌లో జరిగిన బిసి సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి గుజ్జ రమేష్ ఆధ్వర్యంలో నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. అనంతరం ఆర్.కృష్ణయ్య విలేకరులతో మాట్లాడారు. సర్పంచ్ ఎన్నికలను పరోక్ష పద్ధతిలో నిర్వహించాలనే ఆలోచనను ప్రభుత్వం భావిస్తే ఈ అంశంపై వెంటనే అఖిలపక్షాన్ని నిర్వహించి అన్ని రాజకీయ పార్టీలు, ప్రజల అభిప్రాయాలను తెలుసుకుని అప్పుడు నిర్ణయం తీసుకోవాలని సూచించినట్లు లేఖలో కోరామన్నారు. పరోక్ష ఎన్నికల నిర్ణయం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని, రాజ్యాంగంలోని 73, 74 సవరణ ప్రకారం 29 అధికారాలను గ్రామ పంచాయతీలకు ఇచ్చి గ్రామాలను అభివృద్ధి చేయడం పోయి అందుకు విరుద్ధంగా పని చేయడం అవుతుందని లేఖ ద్వారా వివరించినట్లు తెలిపారు. పరోక్ష ఎన్నికలు జరిపిగే వార్డు సభ్యులు కిడ్నాప్‌లకు గురవుతారని, వార్డు సభ్యులను కొనుగోలు చేసే సంస్కృతి పెరుగుతుందని, దీని వల్ల ధన బలం ఉన్న వారు భూస్వాములు, దొరలు సర్పంచ్‌లుగా గెలిచే అవకాశముందన్నారు. అంతే కాకుండా ఎస్సీ,ఎస్టీ, బిసి, మైనార్టీ వర్గాలు సర్పంచ్‌లు అయ్యే అవకాశాలు సన్నగిల్లుతాయని సీఎంకు లేఖలో సూచించామన్నారు. సర్పంచ్‌ను ప్రజలు కాకుండా వార్డు సభ్యులు ఎన్నుకుంటే అభివృద్ధి కుంటుపడుతుందని తెలిపారు. పరోక్ష పద్ధతిలో సర్పంచ్‌లను ఎన్నుకుంటే అవిశ్వాస తీర్మానం పెరుగుతుందని, దీంతో గ్రామంలో అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. గ్రామంలో లేని వారికి కోఆప్షన్ సభ్యులుగా ఎన్నుకోవడం అధికార పార్టీ వక్రమార్గాన ఆధిపత్యం చెలాయించే ప్రమాదముందన్నారు. ఈ సమావేశంలో బిసి సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ కృష్ణ, జాతీయ కార్యదర్శి గుజ్జ రమేష్, నాయకులు టిఆర్.చందర్, కృష్ణ, రామలింగం తదితరులు పాల్గొన్నారు.

జోరుగా జల్లికట్టు

ఎద్దులతో పోటీపడుతున్న యువకులు

మధురై : పొంగల్ సందర్భంగా సంప్రదాయబద్ధంగా జరుపుకొనే సాహసిక క్రీడ జల్లికట్టు తమిళనాడు వ్యాప్తంగా సంబరంగా జరుగుతోంది. మధురైలోని అవనియపురంలో జల్లికట్టు వేడుకలు అంబరాన్నంటుతున్నాయి. పెద్దఎత్తున యువకులు ఈ క్రీడలో పాల్గొంటూ తమ సాహసాన్ని చాటుకుంటున్నారు. ఫెన్స్‌లోకి వేగంగా దూసుకు వచ్చే ఎద్దులను నిలువరించేందుకు యువకులు పోటీ పట్టారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు తగిన చర్యలు తీసుకుంటున్నారు. ముందుగా రిజిస్టర్ చేసుకున్న వారిని మాత్రమే బరిలోకి అనుమతిస్తున్నారు. కాగా, ఈ క్రీడను జంతు హక్కుల పరిరక్షణ కార్యకర్తలు చాలా కాలంగా వ్యతిరేకిస్తున్నారు. జంతువులపై క్రూరత్వంగా వ్యవహరించడం సరికాదని, ఇందువల్ల విలువైన ప్రాణాలు కూడా అనంతవాయువుల్లో కలిసిపోతున్నాయని ఆందోళన చేయడంతో 2015లో జల్లికట్టు క్రీడపై నిషేధం విధించారు. అయితే ఈ నిషేధంపై తమిళనాడు వ్యాప్తంగా నిరసనలు, ఆందోళనలు పెల్లుబకడంతో జల్లికట్టు క్రీడకు మార్గం సుగమం చేస్తూ 2017 జనవరి 23న తమిళనాడు ప్రభుత్వం అసెంబ్లీలో సవరణ బిల్లును ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదించింది.

ఈ ఏడాది ఫెస్టివల్ సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని జల్లికట్టు క్రీడను పర్యవేక్షించేందుకు ఆరుగురు సభ్యులతో కూడిన కమిటీని యానిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియా ఏర్పాటు చేసింది. 20 మార్గదర్శకాలను సూచిస్తూ అందుకు లోబడి జల్లికట్టు నిర్వహించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి కమిటీ ఆదేశించింది. ఆ ప్రకారం పోటీలో పాల్గొనే ఎద్దులకు నికోటిన్, కొకైన్ పరీక్షలు నిర్వహించాలి. పోటీలో పాల్గొనేందుకు అవసరమైన సామర్థ్యం (ఫిట్‌నెస్) ఉందని నిర్ధారించాలి. జల్లికట్టు ఈవెంట్‌కు ఒకరోజు బీమా తప్పనిసరిగా చేయించాలి.

భర్త మరణాన్ని తట్టుకోలేక...

కోల్‌కతా: భర్త మరణాన్ని తట్టుకోలేని ఓ మహిళ నాలుగు రోజుల పాటు ఆ శవం ముందే జాగారం చేసింది. చుట్టుపక్కల వారికి అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేయగా ఈ హృదయ విదారక సంఘటన వెలుగులోకి వచ్చింది. హరిద్వార్ పోలీసుల కథనం ప్రకారం.. అమర్ కుమార్ సన్యాల్(82), హసి రాణి సన్యాల్(70) దంపతులు దక్షిణ కోల్‌కతా శివారు ప్రాంతంలో నివాసముంటున్నారు. నాలుగు రోజుల క్రితం అమర్ చనిపోయారు. భర్త మరణాన్ని తట్టుకోలేక హసి ఒక్కసారిగా షాక్‌కు లోనయ్యారు. ఈ క్రమంలో అతని శవాన్ని చూస్తూ అలాగే ఉండిపోయింది. నాలుగు రోజులుగా వారి ఇంటి ముందు దినపత్రికల కాపీలు అలాగే ఉండటంతో అనుమానం వచ్చిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.పోలీసులు తలుపు తెరిచి చూడగా అమర్ శవం మంచం మీద కనిపించింది. అతని భార్య కూడా అక్కడే నిలబడి ఉంది. ఆమెను పిలిచినా ఎటువంటి స్పందనా రాలేదు. తీవ్రమైన షాక్‌కు గురికావడం వల్ల ఆమె అలాగే ఉండిపోయిందని పోలీసులు తెలిపారు. చివరిసారిగా ఈ నెల ఎనిమిదో తేదీన వారిని చూశామని చుట్టుపక్కల వారు తెలిపారు.

నేటి నుంచి కొత్త చార్జీలు

(మొదటిపేజీ తరువాయి)

జి.వి.రమణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికుల సౌకర్యం కోసం సిటీ బస్ చార్జీలను హేతుబద్ధీకరించాలని సిటిజెన్ కౌన్సిల్ చేసిన విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఆర్డినరీ, పల్లె వెలుగు బస్సుల కనీస చార్జీని ప్రస్తుతం ఉన్న రూ.6, రూ.7 ల నుంచి రూ.5లకు తగ్గించగా, ఎక్స్‌ప్రెస్, డీలక్స్, మెట్రో డీలక్స్‌లలో కనీస చార్జీలను రూ. 8, రూ. 9 సవరించి రూ.10లకు సరిచేసింది. చార్జీల క్రమబద్ధీకరణలో భాగంగా రూ.13 నుంచి రూ. రూ.17 వరకు ఉన్న చార్జీలను రూ.15లకు సవరించారు. రూ.18 నుంచి రూ.22 వరకు ఉన్న చార్జీలను సవరిస్తూ రూ.20గా నిర్ణయించారు. రూ.23 నుంచి రూ.27 చార్జీలను రూ.25లు చేశారు. రూ.29 నుంచి రూ.31ఉన్న చార్జీలను రూ.30గా నిర్ణయించారు. ఇదిలా ఉండగా ఆర్‌టిసి కనీస ఛార్జీని రూ.5 లకు తగ్గించడం మంచిదే అయినప్పటికీ రెండు కంటే ఎక్కువ స్టాపుల దూరం వెళ్ళే ప్రయాణికులపై ప్రస్తుతం చెల్లిస్తున్న ఛార్జీలపై రూ.2ల భారం పడుతుందని కొంత మంది ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

కొత్తగూడెంలో ఘోర రోడ్డు ప్రమాదం

- ఇద్దరు మహిళలు సహా నలుగురి మృతి
- మరొకరి పరిస్థితి విషమం
- ఆగివున్న ఆటోను ఢీకొట్టిన పైపుల లారీ
- నుజ్జు నుజ్జయిన ఆటో
- ఎస్‌పి అంబర్ కిశోర్ ఝా సందర్శన





మన తెలంగాణ/టేకులపల్లి: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలంలో, ఇల్లందు కొత్తగూడెం రహదారిలో ఆదివారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మహిళలు సహా ముగ్గురు వ్యక్తులు ప్రమాద స్థలంలోనే దుర్మరణం చెందారు. మరో వ్యక్తి ఆసుపత్రికి తరలిస్తుండగా దారిలో మృతి చెందాడు. కాగా మరో వ్యక్తి తీవ్ర గాయాల పాలై చావు బతుకుల మధ్య ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆటో నుజ్జు నుజ్జు అయింది. ఆటో డ్రైవర్ తలకు గాయాలు కాగా ప్రాణాపాయం నుంచి బయట పడ్డాడు. మూత్ర విసర్జనకు వెళ్లిన తల్లి, కొడుకులు ఈ ప్రమాదం నుంచి బయట పడగా, తండ్రి మాళోతు మోతీలాల్(40) మృత్యువాత పడ్డాడు. ప్రమాద ఘటన తీవ్రంగా ఉండటంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ అంబర్ కిషోర్ ఝా సంఘటనా స్థలాన్ని సందర్శించారు. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం పంతులు నాయక్ తండాకు మాళోతు మోతీలాల్, భార్య లలిత, కొడుకు చరణ్ లతో కలిసి ఆటోలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ సమీపంలోని పెద్దతల్లి గుడి దగ్గర జరిగిన బంధువుల ఫంక్షన్‌కు హాజరయ్యారు. సాయంత్రం అదే ఆటోలో ఈ ముగ్గురు పాల్వంచ నుంచి కారేపల్లికి తిరుగు ప్రయాణమయ్యారు. ఇల్లందు కొత్తగూడెం రహదారిలో వీరి ప్రయాణం సాగుతోంది. ఈ క్రమంలో టేకమంలో మండలం బేతంపూడి తొమ్మిదోమైలుతండా గ్రామాల మధ్యకు రాగానే మూత్ర విసర్జన కోసం ఆటోను రోడ్డు పక్కన నిలిపారు. అయితే ఆటోలో ముగ్గురే ఉండటంతో కొత్తగూడెం క్రాస్ రోడ్డులో ప్రయాణీకులు ఇద్దరు మహిళలు, మరో వ్యక్తిని, మొత్తం ముగ్గురిని ఎక్కించుకున్నారు. మూత్ర విసర్జనకు మోతీలాల్ భార్య లలిత, కొడుకు చరణ్‌లు వెళ్లగా, మోతీలాల్ సహా మిగతా వారు ఆటోలోనే కూర్చొని ఉన్నారు. సరిగ్గా ఇదే సమయంలో ఇల్లందు వైపు నుంచి రాజీవ్ సాగర్‌కు చెందిన పెద్ద పెద్ద ఇనుప పైపులతో కొత్తగూడెం వైపు వెళ్తున్న లారీ, రోడ్డు పక్కన ఆగి ఉన్న ఆటోను బలంగా ఢీకొట్టింది. దాంతో ఆటో లారీ చక్రాల కిందకు పోయింది. ఆటో నుజ్జు నుజ్జు అయింది. ఆటోలో కూర్చొని ఉన్న ఇద్దరు మహిళలు, గార్ల మండలం సీతంపేట గ్రామానికి చెందిన మరో వ్యక్తికి తల, పొట్ట ఇతర భాగాలకు తీవ్ర గాయాలు కావడంతో ఆ ముగ్గురు అక్కడికక్కడే మరణించారు. మోతీలాల్ , ఆటో డ్రైవర్ జర్పుల వంశీలకు దెబ్బలు తగిలాయి. సంఘటనా స్థలానికి సిఐ దోమల రమేష్, బోడు ఎస్‌ఐ అరుకల అనిల్ తమ సిబ్బందితో ప్రమాద స్థలానికి హుటాహుటిన చేరుకున్నారు. గాయపడ్డ మోతీలాల్, వంశీలను 108 అంబులెన్స్‌లో కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా మార్గం మధ్యలోనే మోతీలాల్ మృతి చెందినట్లు అంబులెన్స్ పైలెట్ రామారావు తెలిపారు. డ్రైవర్ వంశీ చికిత్స పొందుతున్నాడు. మూత్ర విసర్జనకు వెళ్లిన తల్లి, కొడుకు లలిత, చరణ్‌లు మృత్యుపాశం నుంచి బయట పడ్డారు. దుర్మరణం పాలైన ముగ్గురి వివరాలు తెలియాల్సి ఉంది. ప్రమాద సంఘటన తీవ్రతను గమనించిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ అంబర్ కిషార్ ఝా హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. సంఘటనా వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. స్థానిక జెడ్పీటిసి లక్కినేని సురేందర్ తన జెసిబి యంత్రాన్ని తీసుకొచ్చి, రోడ్డుకు అడ్డంగా పడిన లారీని రోడ్డు పక్కకు తరలించారు.

జాబితాలో 96 కులాలు?

(మొదటిపేజీ తరువాయి)

కోసం వెయ్యి కోట్ల రూపాయలను ప్రభుత్వం కేటాయించినా ఇప్పటివరకు వాటిని ఖర్చుచేసిన దాఖలాలు లేవు. ఎంబిసి కులాలపై స్పష్టత రానందువల్లనే ఆ డబ్బును ఖర్చు చేయలేకపోయినట్లు అధికార పార్టీ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. ఎంబిసి జాబితాలో చేర్చనున్న కులాలపై దాదాపుగా ఒక స్పష్టత వచ్చినందువల్ల సిఎం కెసిఆర్ సమీక్ష అనంతరం సంక్షేమ, అభివృద్ధి కార్యకలాపాలు ఊపందుకుంటాయని వ్యాఖ్యానిస్తున్నారు. రానున్న బడ్జెట్‌లో సైతం ఇదే తరహాలో వెయ్యి కోట్ల రూపాయలను ఎంబిసిలకు, మరో నాలుగు వేల కోట్ల రూపాయలను ఒబిసిలకు కేటాయించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. నాయీ బ్రాహ్మణులు, రజకులు తదితరులకు ప్రత్యేకంగా సమాఖ్యలను ఏర్పాటు చేసిన ప్రభుత్వం కులవృత్తులకు అనుగుణంగా ప్రత్యేక సంక్షేమ కార్యక్రమాలను రానున్న బడ్జెట్‌లో పేర్కొనడానికి కసరత్తు ప్రారంభమైంది. సంచార జాతులకు సైతం ప్రత్యేక పథకాలు ఉంటాయని సమాచారం. ఎంబిసిల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని రానున్న బడ్జెట్‌లో వీరికి బ్యాంకుల ద్వారా సంవత్సరానికి లక్ష రూపాయల వరకు రుణ సదుపాయం కల్పించడంతో పాటు అందులో రూ. 80 వేల వరకు ప్రభుత్వమే సబ్సిడీ ఇవ్వాలని భావిస్తున్నట్లు తెలిసింది. బెనిఫిషియరీ కంట్రిబ్యూషన్ స్కీమ్ కింద వారి ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం ఈ దిశగా ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది.

ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్ నేతృత్వంలో ఏర్పడిన బిసి సంక్షేమ కమిటీ ఇటీవల ప్రభుత్వం వివిధ పథకాల రూపంలో చేస్తున్న ఖర్చు ఏ మేరకు లబ్ధిదారులకు ప్రయోజనం కలిగిందో సమీక్షించింది. రానున్న బడ్జెట్‌లో సైతం బిసిల సంక్షేమంపై ప్రభుత్వం ఏ విధంగా దృష్టి సారించాల్సి ఉంటుందో కూడా సూచించినట్లు తెలిసింది. ఈ నివేదికను ఇప్పటికే పరిశీలించిన సిఎం కెసిఆర్ త్వరలోనే బిసి సంక్షేమంపై ప్రగతి భవన్‌లో సమీక్ష నిర్వహించే అవకాశం ఉంది. బడ్జెట్ కసరత్తు ఇప్పటికే ప్రారంభమైనందున బిసిల సంక్షేమానికి ప్రభుత్వం ఇవ్వాల్సిన ప్రాధాన్యం, దానికనుగుణంగా చేయాల్సిన కేటాయింపులపైఈ సమావేశంలో సిఎం వివరించనున్నారు.

ఉప ప్రణాళిక అనుమానమే! : రాష్ట్ర జనాభాలో సుమారు 55% వెనకబడిన కులాలవారే ఉన్నందున రానున్న బడ్జెట్ సైతం వారి కేంద్రంగానే ఉండబోతుంది. ప్రత్యేకంగా బిసి ఉప ప్రణాళిక అవసరం ఉండకపోవచ్చని ఆర్థికశాఖ వర్గాల అభిప్రాయం. గతేడాది నుంచి ప్రణాళిక, ప్రణాళికేతర అనే విభాగాలను బడ్జెట్ నుంచి తొలగించినందున ఇక ఉప ప్రణాళిక అనే అంశమే ఉత్పన్నం కాదని వారి అభిప్రాయం. బిసి కేంద్రంగా బడ్జెట్‌లో కేటాయింపులు ఉంటున్నందువల్ల వారి సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేయనుంది. రాష్ట్ర మొత్తం జనాభాలో కేవలం 9.5% మాత్రమే అగ్రవర్ణాలు కాగా బిసిలు 54%, ఎస్సీలు 16%, ఎస్టీలు 9%, మైనారిటీలు 12% చొప్పున ఉన్నట్లు ప్రభుత్వం అంచనా వేసింది. దీని ఆధారంగా బడ్జెట్‌లో ప్రభుత్వం కేటాయింపులు చేయనుంది. విశ్వబ్రాహ్మణుల కోసం రూ. 250 కోట్లను ఖర్చు చేయనున్నట్లు ఇప్పటికే అసెంబ్లీ స్పీకర్ మధుసూధనాచారి పలు సందర్భాల్లో వివరించారు.

ఇక నాయీబ్రాహ్మణ, రజక కులాలకు సమాఖ్యలను నెలకొల్పిన ప్రభుత్వం వారి ఆర్థిక పరిస్థితులను మెరుగుపర్చేందుకు స్పష్టమైన నిధుల్ని కేటాయించింది. మరో వంక బిసిలు ఉపాధి అవకాశాలను చేజిక్కించుకునేందుగాను ప్రత్యేకంగా స్కిల్ డెవలప్‌మెంట్, శిక్షణా అవకాశాలు కల్పించడంతో పాటు ప్రత్యేకంగా నిధిని సమకూర్చింది. ప్రభుత్వం బిసిల సంక్షేమం కోసం అమలుచేస్తున్న ప్రీమెట్రిక్, పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు, సంక్షేమ హాస్టళ్ళు, ట్యూషన్ ఫీజుల రీఇంబర్స్‌మెంట్, కార్పొరేట్ కళాశాలల్లో ప్రవేశానికి ఇస్తున్న రాయితీలు, మహాత్మ జ్యోతిబాపూలె బిసి ఓవర్సీస్ విద్యా నిధి, కళ్యాణలక్ష్మి ... ఇలా పలు పథకాలకు సంబంధించిన అమలుపై గంగాధర్‌గౌడ్ కమిటీ సమీక్ష జరిపి సిఎంకు నివేదిక సమర్పించింది.

కీలక కేసులు రాజ్యాంగ పీఠానికి

(మొదటిపేజీ తరువాయి)

తాము బహిరంగ లేఖ రాశామని జస్టిస్ షా ధ్రువీకరించారు. లేఖలో పేర్కొన్న న్యాయమూర్తులు అంతా అంగీకరించారని ఆయన మీడియాకు తెలిపారు. ఈ సంక్షోభం పరిష్కారమయ్యేంత వరకు ముఖ్యమైన కేసుల జాబితాను ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ముందుంచాలన్న సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్(ఎస్‌పిబిఎ) అభిప్రాయాలతో రిటైర్డ్ న్యాయమూర్తుల అభిప్రాయాలకు పోలి ఉన్నాయని జస్టిస్ షా పేర్కొన్నారు. బహిరంగ లేఖకు మిగతా న్యాయమూర్తులు అంగీకరిస్తారో లేదోనని తాను మొదట భావించానని,ఇప్పుడు వారు సమ్మతించారని ఆయన తెలిపారు.

సుప్రీంకోర్టులోని వివిధ ధర్మాసనాలకు సున్నితమైన కేసుల కేటాయింపుకులకు సంబంధించి నలుగురు సీనియర్ దిగువ స్థాయి న్యాయమూర్తులు ముఖ్యమైన అంశాలను లేవనెత్తారని ఆ లేఖలో పేర్కొన్నారు. కేసుల కేటాయింపు తీరు సరైన విధంగా లేదని, ప్రత్యేకంగా ఎంపిక చేసిన ధర్మాసనాలకు కేటాస్తున్నారని న్యాయమూర్తులు ఆరోపించారన్నారు. జూనియర్ న్యాయమూర్తులు నాయకత్వంలోని ధర్మాసనాలకు మధ్యవర్తిత్వ పద్ధతిలో తరుచుగా కేసుల కేటాయింపు జరుగుతోందని తెలిపారన్నారు. ఈ దోరణి న్యాయపాలన, న్యాయశాస్త్ర నియమాలకు ప్రమాదకరమని న్యాయమూర్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారని లేఖలో పేర్కొన్నారు.

సుప్రీంకోర్టు న్యాయమూర్తుల అభిప్రాయాలతో తాము ఏకీభవిస్తున్నామని నలుగురు రిటైర్ న్యాయమూర్తులు పేర్కొన్నారు. కేసులను రోస్టర్ పద్ధతిలో తగిన ధర్మాసనానికి కేటాయింపునకు సంబంధించి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి అధికారం ఉన్నప్పటికీ, సున్నిత, ముఖ్యమైన కేసులను మధ్యవర్తిత్వ పద్ధతిలో జూనియర్ న్యాయమూర్తులు న్న ధర్మాసనాలకు కేటాయించాలని కాదన్నారు. సుప్రీంకోర్టులో వివిధ ధర్మాసనాలకు కేసుల పంపిణీ, కేటాయింపునకు సంబంధించి స్పష్టమైన నియమ, నిబంధనలు కచ్చితంగా రూపొందించాలని రిటైర్డ్ నాయమూర్తులు పేర్కొన్నారు. న్యాయ వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కలిగేందుకు కేసుల కేటాయింపు హేతుబద్ధంగా, సరైన పద్ధతిలో, పారదర్శకంగా జరగాలని పేర్కొన్నారు.

పెండింగ్ కేసులతో సహా సున్నిత, ముఖ్యమైన కేసులను ఐదుగురు సభ్యులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం మాత్రమే విచారణ చేపట్టాలని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలు తీసుకున్నప్పుడు మాత్రమే ఎలాంటి పక్షపాతం లేకుండా సుప్రీంకోర్టు పారదర్శకంగా పని చేస్తోందని ప్రజలకు విశ్వాసం పెరుగుందన్నారు. సున్నితమైన, ముఖ్యమైన కేసులకు సంబంధించి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రోస్టర్ పద్ధతిని దుర్వినియోగం చేయడం జరగదన్నారు. ఈ సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని తమలేఖలో రిటైర్డ్ న్యాయమూర్తులు అభ్యర్థించారు.

జస్టిస్ చలమేశ్వర్‌ను కలిసిన బార్ కౌన్సిల్ బృందం: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నలుగురు సీనియర్ న్యాయమూర్తుల మధ్య నెలకొన్న వివాద పరిష్కారానికి బార్ కౌన్సిల్ చర్యలు ప్రారంభించింది. దీనికోసం బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(బిసిఐ) చైర్మన్ మనన్ కుమార్ మిశ్రా నాయకత్వంలో ఏడుగురు సభ్యులతో కూడిన ఒక బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ బృందం జస్టిస్ చలమేశ్వర్‌ను ఆయన నివాసానికి వెళ్లి కలిసింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు తమ మధ్య నెలకొన్న సమస్యలను అంతర్గతగా, రాజ్యాంగ పరిధిలో పరిష్కరించుకోవాలని శనివారం బార్ కౌన్సిల్ సూచించిన విషయం తెలిసింది.

అయితే న్యాయమూర్తుల మధ్య ఏర్పడిన వివాదాన్ని ఫుల్ కోర్టు ద్వారా పరిష్కరించుకోవాలని బార్ అసోసియేషన్ పేర్కొంది. రెండ్రోజుల క్రితం సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తులు జస్టిస్ చలమేశ్వర్, జస్టిస్ రంజన్ గగోయ్, జస్టిస్ కోర్, జస్టిస్ జోషప్ కురియన్ అత్యున్నత న్యాయస్థానంలో కొంతకాలంగా జరుగుతున్న పరిణామాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ మీడియా ముందు కొచ్చిన విషయం తెలిసిందే.

మరింత ఆసరా!

(మొదటిపేజీ తరువాయి)

అమలవుతున్న 'ఆసరా' పింఛను ద్వారా సుమారు 38 లక్షల మంది లబ్ధి పొందుతున్నారు. ఇందులో సింహభాగం సుమారు 13.98 లక్షల మంది వితంతువులుకాగా, ఆ తర్వాత 13.38 లక్షల మంది వృద్ధులు, 4.79 లక్షల మంది దివ్యాంగులు, 4.07 లక్షల మంది బీడీ కార్మికులు, 1.21 లక్షల మంది ఒంటరి మహిళలు ఉన్నారు. లబ్ధిదారుల్లో ఎక్కువగా నిజామాబాద్ (2.61 లక్షల మంది), జగిత్యాల (2.11 లక్షలు), నల్లగొండ (1.92 లక్షలు), హైదరాబాద్ (1.91 లక్షలు) జిల్లాల్లో ఉంటే కనిష్ఠంగా కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 50 వేలు, జోగులాంబ గద్వాల జిల్లాలో 68 వేలు, ఆదిలాబాద్ జిల్లాలో 69 వేల చొప్పున లబ్ధిదారులు ఉన్నారు. గత ప్రభుత్వంలో పింఛన్ల కోసం ప్రభుత్వం రూ. 835 కోట్లను మాత్రమే కేటాయిస్తే టీఆర్‌ఎస్ ప్రభుత్వం మాత్రం నాలుగు రెట్ల కంటే ఎక్కువకు పెంచి బడ్జెట్‌లో రూ. 4000 కోట్లను కేటాయించిందని టిఆర్‌ఎస్ నాయకులు పలు సందర్భాల్లో వ్యాఖ్యానించారు. సంక్షేమ పథకాలు ప్రజలపై ప్రత్యక్ష ప్రభావం చూపుతున్నందున దీన్ని మరింతగా పెంచడం ద్వారా వారికి భరోసా కలుగుతుందని స్థానిక రాజకీయ నేతల అభిప్రాయం. రానున్నది ఎన్నికల దృష్ట్యా పింఛన్ల మొత్తాన్ని పెంచాలని ఎమ్మెల్యేల ద్వారా వచ్చిన అభిప్రాయం మేరకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించి రానున్న బడ్జెట్ నుంచే అమలులోకి తేవాలని భావిస్తోంది. కేంద్ర ప్రభుత్వం సైతం జాతీయ సామాజిక సహాయం పేరుతో వృద్ధులకు రూ. 200 (80 ఏళ్ళ లోపు), రూ. 500 (80 ఏళ్లు పైబడిన), రూ. 300 (వితంతువులకు) ఇస్తుండగా అధికమొత్తంలో వెయ్యి రూపాయలకు వరకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తోందని మంత్రులు గతంలో వ్యాఖ్యానించారు. పింఛనును రూ.500 చొప్పున పెంచినట్లయితే లబ్ధిదారులకు ప్రయోజనం కలుగుతుందో, ఏ విధంగా సంతృప్తి చెందుతారో ఒకవంక జిల్లా అధికారుల నుంచీ, మరోవైపు స్థానిక అధికారపార్టీ నేతల (ఎమ్మెల్యేలు) నుంచి ప్రభు త్వం అభిప్రాయాలను సేకరిస్తోంది. సానుకూల అభిప్రాయం వ్యక్తం కావడంతో పింఛనును పెంచడమే మంచిదని భావిస్తోంది. రానున్న బడ్జెట్‌లో ఈ మేరకు కేటాయింపులు ఉండే అవకాశం ఉంది.

మేడిపల్లి నిందితుల అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)



మేడిపల్లి పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాచకొండ జాయింట్ పోలీసు కమిషనర్ తరుణ్‌జోషి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్నాటక రాష్ట్ర బీదర్ జిల్లాలోని చించోలి గ్రామానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు రాజు కులాల్, జగదీప్ కులాల్ అలియాస్ జగ్గులు 10 ఏళ్ళ క్రితం నగరానికి వలసవచ్చి బోరబండ ప్రాంతంలో ఉంటున్నారు. 8 ఏళ్ళ క్రితం మేడిపల్లిలో స్థిరపడ్డారు. వీరు గత 8 ఏళ్ళ క్రితం నుండి చెంగిచెర్ల కమలాపురంలో భూమిని తీసుకుని షెడ్ వేసుకున్నారు. ఇందులో ఆయిల్, డీజిల్, పెట్రోల్ ట్యాంకర్ల నుండి దొంగచాటుగా తీసి ఇతరులకు విక్రయించడాలన్ని వ్యాపారంగా చేసుకున్నారు. పెట్రోల్ ట్యాంకర్ల యజమానులతో, డ్రైవర్లతో పరిచయాలు పెట్టుకుని వారి ద్వారా ఇతరులను ఆకట్టుకుంటూ నగరంలోని పెట్రోల్ బంక్‌లకు వచ్చే ట్యాంకర్లను తమ షెడ్‌కు రప్పించుకుని పెట్రోల్‌ను తీయడం, కల్తీ చేయడం చేసి అక్రమంగా విక్రయాలు చేయడం ద్వారా అధిక ఆదాయాన్ని సంపాదిస్తున్నారు. వీరికి సాంకేతికంగా సహకారాన్ని అందిస్తున్న ఖాదీర్, షర్ఫుద్దీన్, నయీంలతో పాటు మేడిపల్లి అగ్నిప్రమదానికి గురైన ట్యాంకర్ డ్రైవర్, ఇతర డ్రైవర్లు పరారీలో ఉన్నారు. ఇంధనం అక్రమ వ్యాపారంతో అన్నదమ్ములిద్దరు స్థిరాస్థిని భారీగా కూడపెట్టినట్టు జాయింట్ కమిషనర్ వెల్లడించారు. అయితే, ఈ నెల 12న జరిగిన అగ్ని ప్రమాదానికి కారణమైన నిందితులు ఇద్దరు రాజు, జగ్గులను అరెస్టు చేసినట్లు, వీరు అక్రమంగా పెట్రోల తీయడం, విక్రయించడం, ప్రజల ఆస్థులకు నష్టాలను కలిగించడం, అగ్నిప్రమాదాలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడం వంటి నేరాలకు వీరు పాల్పడినట్టు వారిపై కేసులు నమోదు చేశామని తరుణ్ జోషి తెలిపారు.

పోలీసుల పాత్రపై దర్యాప్తు: ఈ ప్రాంతంలో జరుగుతున్న అక్రమ పెట్రోల్ వ్యాపారంలో పోలీసుల పాత్రపై దర్యాప్తు చేస్తున్నామని, ప్రత్యక్షంగా, పరోక్షంగా గానీ, పోలీసుల పాత్ర ఉన్నట్టుగా తేలితే వారిపై విభాగపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని డిసిపి తరుణ్‌జోషి స్పష్టం చేశారు. గత 8 సంవత్సరాలుగా ఇక్కడ పెట్రోలును చోరీచేయడం, కల్తీచేయడం, అక్రమంగా విక్రయాలు జరపడం వంటివి నేరాలు జరుగుతున్నట్టు పోలీసుల విచారణలో వెల్లడైందని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో ఎవరున్నా వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేయడం ఖాయమని తెలిపారు. నిందితులుగా ఉన్న రాజు, జగదీశ్వర్‌లకు స్వంతంగా 12 ట్యాంకర్లు ఉన్నాయని, వాటిల్లో 10 ట్యాంకర్లను తాము సీజ్ చేసినట్టు వెల్లడించారు. పరారీలో ఉన్నవారిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తును ముమ్మరంగ చేసినట్టు వెల్లడించారు. సమావేశంలో మల్కాజిగిరి డిసిపి ఉమామహేశ్వరశర్మ, మల్కాజిగిరి ఎసిపి సందీప్, మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ జగన్నాథ్‌రెడ్డిలు పాల్గొన్నారు.

మన తెలంగాణ

7

హైదరాబాద్

సోమవారం

15, జనవరి 2018

www.manatelangana.news



బిజెపితోనే బంగారు తెలంగాణ : డా.లక్ష్మణ్

మన తెలంగాణ/నీలగిరి: తెలంగాణ వస్తే నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తాయని భావిస్తే కానీ రాష్ట్రం ఏర్పడ్డాక నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వం చలగాటం ఆడుతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కె. లక్ష్మణ్ అన్నారు. ఆదివారం జిల్లాల పర్యటనలో భాగంగా బిజెపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావే శంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాల్లో దళిత అధాలత్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. గుజరాత్, యుపి రాష్ట్రల్లో అధాలత్ ముందుకు పోయినట్లుగా తెలంగాణలో కూడా ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. ఎంపిటిసి బై ఎన్నికల్లో రెండు స్థానాలు గెలిచినట్లు చెప్పారు. టిఆర్ఎస్‌లో ఉన్న నాయకులు అసహనంతో ఉన్నారు. నాయిని, శ్రీనివాస్‌గౌడ్ మాటలే అందుకు నిదర్శనమన్నారు. కెసిఆర్ ఉద్యమకారులను అణిచివేస్తూ ఉద్యమంలో పాల్గొన్న వారిపై అక్రమ కేసులు పెట్టి జైలుకు తోలుతున్నారన్నారు. కెసిఆర్ బిసిలను ఓట్ల కోసం వాడుకొని గెలిచిన తరువాత వారిని పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. చట్ట సభల్లో బిసిలకు ప్రాధాన్యత పెరగడంలేదని అన్నారు. బీజేపీ మోర్చా జిల్లా కమిటీ క్యాలెండర్‌ను లక్ష్మణ్ చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది. అనంతరం బిసిల నిరుద్యోగ గర్జన ప్రచార యాత్రను ఆర్. కృష్ణయ్యతో కలిసి రథయాత్రను ప్రారంభించారు.

వృక్ష ప్రసాదం ప్రారంభం



మన తెలంగాణ/భీమదేవరపలి: ఉత్తర తెలంగాణలోనే ప్రసిద్ధిగాంచిన కొత్తకొండ శ్రీవీరభద్రస్వామి దేవాలయంలో ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్, ఎంఎల్‌ఎ సతీష్‌కుమార్ ఆదివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారి సన్నిధిలో ఎన్నడూ లేని విధంగా కన్నారం గ్రామానికి చెందిన జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి చేపట్టిన వృక్ష ప్రసాదం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా వృక్ష ప్రసాదం కార్యక్రమాన్ని చేపట్టిన సురేందర్ రెడ్డిని అభినందించారు. స్వామి వారికి ఇష్టమైన కోరమీసాలు, గుమ్మడి కాయలతో పాటు, త్రిబిల్వం స్వామి వారికి చాలా ఇష్టమని, లక్ష బిల్వార్చన చేస్తే ఎంతో ఫలితం ఉంటుందన్నారు. అనంతరం భక్తుల విరాళాలతో నిర్మించిన దుకాణా భవన సముదాయాన్ని ఎంఎల్‌ఎ ప్రారంభించారు. అంతకుముందు స్వామివారిని మాజీ ఎంపి పొన్నం ప్రభాకర్ దర్శించుకొని, వృక్షప్రసాదం స్వీకరించారు. ఆయన విలేకరుల తో మాట్లాడుతూ గతంలో ఉన్న విధంగానే గ్రామ సర్పంచ్ ఎన్నికలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం చేపట్టిన ఎకరాకు రూ.4వేల పెట్టుబడిని చెక్కుల ద్వారా కాకుండా నేరుగా రైతుల ఖాతాల్లోకి జమ చేయాలన్నారు. అభివృద్ధిలో ఉన్న ప్రతి దేవాలయానికి రూ.100 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాలని పొన్నం ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పసికందు లభ్యం



మన తెలంగాణ/ బిజినేపల్లి: నాగర్‌కర్నూల్ జిల్లా బిజినెపల్లి మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తా వద్దగల రాంరెడ్డి చికెన్ సెంటర్ సమీపంలో పసికందు లభ్యమైనట్లు స్థానిక ఎస్ఐ ప్రదీప్ కుమార్ తెలిపారు. పసికందు ను గమనించిన స్థానికులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో అక్కడికి చేరుకున్న ఎస్ఐ చిన్నారిని ఐసిడిఎస్ అధికారులకు అప్పగించామన్నారు.

స్వగ్రామానికి చేరిన మృతదేహం



మన తెలంగాణ/ చందుర్తి: రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం సనుగుల గ్రామానికి చెందిన మోకినపల్లి దేవరాజం (48) ఉపాధి కోసం ఎనిమిదేళ్లుగా బహ్రెయిన్ దేశానికి వెళ్తున్నాడు. గతేడాది ఇంటికి వచ్చి తిరిగి వెళ్లిన దేవరాజం జనవరి 7న పనిచేస్తుండగా గుండెపోటుతో హఠాన్మరణం చెందాడు. ఆదివారం దేవరాజం మృతదేహం స్వగ్రామానికి చేరుకోవడంతో కుటుంబికులు కన్నీరుమున్నీరయ్యారు. మృతుడికి భార్య నర్స వ్వ, ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నాడు.

ఎంఎల్‌ఎ రెడ్యానాయక్‌పై ఫిర్యాదు

మన తెలంగాణ/కురవి: అక్రమంగా ప్రభుత్వ పాఠశాల భవనం కూల్చి, భూములను కబ్జా చేసి ఇల్లు నిర్మించుకున్నారని ఎంఎల్‌ఎ రెడ్యానాయక్‌పై తెలంగాణ లంబాడీ తండాల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ధరంసోతు వెంకన్ననాయక్ శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిన్నగూడూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్యానాయక్ అక్రమ కబ్జాలపై అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, సమాచార హక్కు చట్టం ద్వారా ఆధారాలు పొంది పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. రెడ్యానాయక్ అవినీతిపై ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి, రాష్ట్ర రాజీవ్ విద్య మిషన్ హైదరాబాద్, మహబూబాబాద్ ఎస్‌పి, డిఎస్‌పి, సిఐకి ఫిర్యాదు చేయనున్నట్లు ప్రతుల్లో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదుపై త్వరలోనే విచారణ చేపడుతామని ఎస్ఐ అరుణ్‌కుమార్ చెప్పారు.

ఫ్లెక్సీల గొడవలో ఇద్దరికి గాయాలు

మన తెలంగాణ/గద్వాల న్యూటౌన్: పాత కోపాలను మనసులో పెట్టుకుని ఇరువర్గాలు ఘర్షణకు దిగిన సంఘటన ఆదివారం గద్వాల జిల్లాలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని 14వ వార్డుకు చెందిన చిన్న నర్సింహ, పెద్ద నర్సింహలపై పాత కోపాలను మనసులో పెట్టుకుని ఫ్లెక్సీల విషయంలో దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో ఇద్దరు గాయపడగా, వారిని చికిత్స నిమిత్తం గద్వాల జిల్లా ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ పోలీసులు తెలిపారు.

21న వరంగల్ డిక్లేరేషన్ సభ



మన తెలంగాణ/ నర్సంపేట: వరంగల్ డిక్లేరే షన్ ఏర్పాటు కోసం ఈ నెల 21న తలపెట్టిన బహి రంగ సభకు ప్రజలు, ప్ర జాస్వామిక వాదులు తర లి రావాలని ప్రజా ఫ్రంట్ నాయకులు కుమారస్వా మి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆదివారం రూరల్ జిల్లా నర్సంపేట డివిజన్‌లో గిర్నిబావి, నర్సంపేట, లక్నెపల్లి ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వ హించారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడారు. రాష్ట్ర ఏర్పాటు కోసం ప్రజలు పోరాటంలో పాలు పంచుకుని సామాజికంగా, ఆర్థికంగా ఎదుగుదలతో పాటు నిధులు, నియామకాలు, నీళ్లపై పోరాటాలు చేసి తెలంగాణ సాధించుకుంటే అవి ఎండమావిగానే మిగిలి పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. సామ్రాజ్యవాదం , సంపన్న వర్గాల దోపిడీ విధానంతో ఆదివాసీ, దళిత, పిడిత పేద రైతాంగం భూ నిర్వాసితులు అయిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సందర్భంలో తెలంగాణ ఉద్యమ లక్ష్యాలను మరోసారి ఎజెండా మీదకు బలంగా తీసుకువచ్చి వాటి సహకారం కోసం ఆలుపెరగని పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. వరంగల్ డిక్లరేషన్ కోసం 20ఏళ్లుగా ఎదురుచూస్తున్న సమయం ఆసన్నమైందని అం దుకోసం ప్రజలు ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజి గ్రౌండ్లో నిర్వహించే నిర్వహించే బహిరంగ సభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

'నిలువెత్తు' కష్టమే!

- మేడారంలో తెల్లబెల్లంపై నిషేధం
- అమ్మవార్లకు బంగారం కొరత
- ఇబ్బందులు పడుతున్న భక్తులు



మన తెలంగాణ/మంగపేట: గిరిజనుల ఆరాధ్య దైవమైన మేడారం సమ్మక్క, సారలమ్మ భక్తులకు కష్టమొచ్చింది. అమ్మవార్లకు ఇష్టమైన బంగారం (తెల్లబెల్లం) కొనుగోలు ఇబ్బందిగా మారింది. ఏజెన్సీ ప్రాంతాల్లో గుడుంబాను అరికట్టేందుకు ఎక్సైజ్, పోలీస్ శాఖ విధించిన నిషేధం జాతరలో ప్రభావం చూపనుంది. ఇదిలాఉంటే అమ్మవార్లకు ప్రీతి పాత్రమైన బంగారాన్ని నైవేద్యంగా సమర్పించుకునేందుకు భక్తులు పడరాని పాట్లు పడుతున్నారు. పూర్వం కాలం నుంచే పిల్లా పాపలను క్షేమంగా చూడాలంటూ తల్లులక నిలువెత్తు బంగారం సమర్పించడం అనవాయితీగా వస్తోంది. జాతర సమయంలో తల్లులు గద్దెలపై కొలువుదీరిన అనంతరం ఎంత ఇబ్బంది కలిగినా బంగారాన్ని నెత్తిన పెట్టుకుని, క్యూలైన్లలో గంటల కొద్దీ నిలబడి మొక్కులు సమర్పించుకుంటారు. ప్రస్తుతం ఈ ఆనవాయితీకి ప్రభుత్వం కొత్త కష్టాన్ని తెచ్చి పెట్టింది. ఏజెన్సీ గ్రామాల్లో గుడుంబాను అరికట్టేందుకు ప్రభుత్వం నిషేధాజ్ఞలు జారీ చేసింది. ఆదేశాలను బేఖాతరు చేస్తే వ్యాపారులపై పిడి యాక్ట్‌తో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించింది. గతంలో కొన్ని చోట్ల అధికారులు దాడులు నిర్వహించి బెల్లాన్ని పట్టుకున్నట్లు పలు పత్రికల్లో వస్తున్న సంగతి తెలిసిందే. దీంతో మంగపేట, ఏటూరునాగారం, కన్నాయిగూడెం, వాజేడు, వెంకటాపురం, తాడ్వాయి (మేడారం మినహా) గోవిందరావుపేట, వెంకటాపురం, ములుగు మండలాల్లో సైతం బెల్లాన్ని విక్రయించేందుకు వ్యాపారులు భయపడుతున్నారు. దీనిని ఆసరాగా చేసుకున్న పలువురు వ్యాపారులతో పాటు (గతంలో మేడారం బెల్లం టెండర్‌ను పొందిన) బెల్లం వ్యాపారులు కిలో బెల్లాన్ని రూ. 80నుంచి రూ. 100కు విక్రయిస్తున్నారు. వరంగల్ తదితర పట్టణాల్లో మాత్రం కిలో రూ. 50 నుంచి రూ. 60 అమ్ముతుండగా జాతరలో మాత్రం అధిక ధరలకు విక్రయిస్తూ భక్తులను నిలువు దోపిడీ చేస్తున్నారు. ఇదిలా ఉంటే జాతర సమయంలో బంగారాన్ని విక్రయించాలంటే కుటుంబ సమేతంగా వెళ్లిన భక్తులకు రద్దీలో కొనుగోలు చేయడం కంటే ఇంటి వద్ద నుంచే తీసుకెళ్లే ఆలోచనలో ఉన్నారు. ఏజెన్సీ మండలాల వ్యాపారులు సైతం బంగారాన్ని విక్రయించేందుకు అధికారులు అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

తులా పురుషదానం



పదహారు మహా దానములలో తులా పురుషదానం ఒకటి. సాధారణంగా దీనిని రాజన్యులు, ప్రభువులు మాత్రమే నిర్వహించి తమ బరువును తూకం వేసి దానికి సమానమైన బంగారాన్ని దానం చేస్తారు. ఈ దానం సామాన్యులకు అసాధ్యం. అందుకే దీనికి ప్రత్యామ్నాయంగా చక్కెర, బెల్లం ధాన్యములతో తులాభారపు మొక్కుబడులు నిర్వహిస్తారు. కానీ మేడారంలో తమ పిల్లాపాపాలను రక్షించాలని అమ్మవార్లను వేడుకుంటూ ప్రతి ఒక్కరూ బంగారాన్ని (బెల్లం) సమర్పిస్తారు. ఈ అనవాయితీ అనాదిగా వస్తోంది.

పండుగలకూ ఇబ్బందే..

ఇదిలా ఉంటే సంక్రాతి పండుగకు సైతం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని పిండి వంటలు చేసుకునేందుకు సైతం బెల్లం దొరక్క ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొంతకాలంగా గ్రామాల్లో వ్యాపారులు బెల్లాన్ని విక్రయించడం లేదని, దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్థానిక మండలాల్లో బెల్లాన్ని విక్రయించేలా చూడాలన్నారు.

వలసల నివారణలో ప్రభుత్వం విఫలం

- రుణమాఫీతో ఒరిగిందేమీ లేదు
- నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతలతోనే రైతులకు న్యాయం
- రైతు అధ్యయన యాత్రలో టిజెఎసి ఛైర్మన్ కోదండరాం



మన తెలంగాణ/కోస్గి (మద్దూరు): నారాయణ, పేట కొడంగల్ ఎత్తిపోతల పథకంతోనే కొడంగల్ నియోజకవర్గం రైతులకు న్యాయం చేకూరుతందని టిజెఎసి ఛైర్మన్ ప్రొ.కోదండరాం అన్నారు. ఆదివారం రైతు అధ్యయన యాత్రలో భాగంగా ఆయన మహబూబ్‌నగర్ జిల్లా మద్దూరు మండలం నిడిజింత గ్రామంలో పర్యటించారు. ఈ ప్రాంతంలో వలసలు ఇంకా కొనసాగుతున్నాయని, వలసలు నివారించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వం రైతులకు ఇచ్చిన నాలుగు విడతల రుణమాఫీ బ్యాంకు వడ్డీకే సరిపోయిందని వారికేమాత్రం లాభం చేకూరలేదన్నారు. పాలమూరు ప్రాజెక్టు రీడిజైనింగ్‌తో ఈ ప్రాంతం మరింత నష్టపోతుందని ప్రభుత్వం పట్టింపులకు పోకుండా జిఒ69పై రిటైర్డ్ ఇంజినీర్లతో సలహాలు, సూచనలు సేకరించి ఈ ప్రాంతానికి న్యాయం చేయాలన్నారు. బంగారు తెలంగాణ కోసం మరో ఉద్యమం అవసరమని నిరుద్యోగులు, రైతులు ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాల్సి ఉందన్నారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో ముఖాముఖిగా మాట్లాడారు. పంట పెట్టుబడి లాభాలపై రైతులను ఆరా తీయగా పండించిన పంటకు గిట్టుబాటు లేక అప్పులు పెరిగాయని రైతులు సమాధానమిచ్చారు. ఈ ప్రభుత్వంలో నిరుద్యోగులు పెరిగిపోయారని ఉద్యోగ కల్పనలో ప్రభుత్వం విఫలమైందని పేర్కొన్నారు. రైతులను, నిరుద్యోగులను విస్మరించిన ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. నీరు, నిరుద్యోగంపై సాగిన తెలంగాణ ఉద్యమం ఆశయాలు నీరుగారాయని వాటిని దక్కించుకోవడం కోసం రైతులు, యువకులు ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని సూచించారు. బంగారు తెలంగాణ సాధన కోసం ఫిబ్రవరి మెదటి వారంలో హైద్రాబాద్‌లో భారీ బహిరంగ సభ ఉంటుందని యువకులు, రైతులు, నిరుద్యోగులు అధిక సంఖ్యలో తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ జలసాధన సమితి సభ్యులు, రైతులు, యువకులు తదితరులున్నారు.

బిసిల హక్కుల కోసం ఉద్యమిద్దాం

- బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య

మన తెలంగాణ/మిర్యాలగూడ : వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బిసిలకు 50శాతం టికెట్లు కేటాయించాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆదివారం ఆర్ అండ్‌బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాజ్యాంగబద్ధమైన హక్కుల కోసం బిసిలు సంఘటితంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. పార్లమెంటులో బిసి బిల్లు పెట్టి జనాభాలో 56 శాతం ఉన్న బిసిలకు చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్లు కల్పించకపోతే తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. పేరుకే ప్రజాస్వామ్యం కానీ మెజార్టీ ప్రజలకు ఏ రంగంలోనూ సరైన ప్రాధాన్యత కల్పించకుండా పాలకులు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలకతీతంగా రాజ్యాధికార సా ధన కోసం ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని, వచ్చే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు ప్రధానంగా టిఆర్ఎస్, కాంగ్రెస్, టిడిపి, వైఎస్సార్ సిపి, బిజెపిలు 50 శాతం టికెట్లు కేటాయింపులు జరపాలన్నారు. ఈ దేశంలో పుట్టిన 2600 బిసి కులాల్లో 2550 బిసి కులాల వారు నేటికీ పార్ల మెం టులో అడుగుపెట్టలేదన్నారు. బిసిలకు ప్రభుత్వాలిచ్చేది భిక్ష కాదని, రాజ్యాంగ పర మైన హక్కు అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 70 ఏండ్లు గడుస్తున్నా బిసిలు ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. జాతీయ బిసి కమిషన్‌కు ప్రధాని మోడీ రాజ్యాంగ బద్ధమైన హోదా కల్పిస్తే ప్రతిపక్షాలు రాజ్య సభలో వ్యతిరేకించడం శోచనీయమన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ముఖ్యమంత్రులు అఖిలపక్షాలతో ప్రతినిధి బృందం వెళ్లి ప్రధానితో చర్చించి పార్ల మెం టులో బిసి బిల్లు పెట్టే విధంగా కృషి చేయాలన్నారు. పంచాయతీరాజ్ సంస్థలో బిసి రిజర్వేషన్లను 34 శాతం నుంచి 50 శాతానికి పెంచి రాజ్యాంగ బద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ మాదిరిగా బిసిలకు సామాజిక రక్షణ, భద్రత కల్పించడానికి బిసి యాక్ట్‌ను తీసుకరావాలన్నారు. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న 14 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలన్నారు. సమావేశంలో ఆలిండియా బిసి వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు గుజ్జ కృష్ణ, టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి బంటు వెంకటేశ్వర్లు, బిసి విద్యుత్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారం శ్రీనివాస్, టిఎన్‌జిఓ పట్టణాధ్యక్షులు సైదులు గంగపుత్ర, నాలా వెంకటేశ్వర్లు, బిసి ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు తిరుమలగిరి అశోక్, బిసి యువజన నాయకులు తిరుమలగిరి అంజి, పగిడి జీడయ్యయాదవ్, రామలింగం, గుడిపాటి కోటయ్య, మహే ష్, నాగభూషణం, దళిత సంఘాల ఐక్య వేదిక నాయకులు, వైద్యులు జాడి రాజు, తాళ్లపల్లి రవి, వస్కుల మట్టయ్య, ముండ్లగిరి కాంతయ్య పాల్గొన్నారు.



సన్న బియ్యం ధరలకు రెక్కలు

- ఏడాదిలో క్వింటాల్‌కు రూ.400 పెంపు
- బెంబేలెత్తుతున్న సామాన్యులు





మన తెలంగాణ/నల్లగొండ: నల్లగొండ జిల్లాలో సన్నబియ్యం ధరలకు రెక్కలొచ్చాయి. గడిచిన ఏడాదిలో క్వింటాల్‌కు రూ.400 నుంచి 500 వరకు పెరిగాయి. దీంతో సామాన్యులు బెంబేలెత్తుతున్నారు. గత రెండు నెలల్లోనే 150 నుంచి 200 వరకు ధర పెరిగింది. ప్రస్తుతం పాత సాంబమసూరి బియ్యం రూ.4600 నుంచి 4800ల వరకు ధర పలుకుతుంది. పెరిగిన ధరలతో బియ్యం కొనేందుకు జంకుతున్న మధ్యతరగతి ప్రజలు ఆ ధరలు చెల్లించలేక మూడుపూటలు తిండి తినలేని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. గత ఖరీఫ్‌లో నాగార్జునసాగర్ ఆయకట్టు కింద వరి సాగు అంతంత మాత్రంగానే సాగింది. సాగర్ కాల్వ నీరు విడుదల లేనందున బోరు, బావుల కిందనే కొంత మంది రైతులు వరి సాగు చేశారు. వర్షాభావ పరిస్థితులతో పంట దిగుబడి తీవ్రంగా తగ్గిపోయింది. నల్లగొండ జిల్లాలో బిపిటి బియ్యం 25 కిలోల సంచి ధర 1200 పలుకుతుంది. కిలో ధర రూ. 40 నుంచి రూ.45 విక్రయిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో పాత బిపిటి బియ్యం మొదటి రకం పేరుతో రూ.50 కిలో చొప్పున విక్రయిస్తున్నారు. కొత్త బియ్యం మొన్నటివరకు రూ.3500 ధర పలకగా, వాటి ధరలు రెండు మూడు నెలల్లోనే రూ.100 నుంచి 150 వరకు పెంచేయడంతో బియ్యం ధరలు చుక్కలనంటుతున్నాయి. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. జిల్లాలో బిపిటి ధాన్యం మిల్లుల్లో క్వింటాకు రూ. 1800కు వ్యాపారులు రైతుల వద్ద నుంచి కొనుగోలు చేస్తున్నారు. క్వింటా ధాన్యాన్ని మిల్లు దగ్గర పట్టిస్తే 65 కిలోల బియ్యం వస్తుండగా మిల్లు రవాణాతో కలిపితే మొత్తం రూ. 2000 ఖర్చు అవుతుంది. కిలో బియ్యాన్ని వ్యాపారులు 45 నుంచి 50కి విక్రయిస్తున్నారు. దీంతో సన్నబియ్యం (బిపిటి) కొనాలంటేనే సామాన్య, మధ్యతరగతి ప్రజలు బెంబేలెత్తుతున్నారు. జిల్లాలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు మినహా మిగిలిన ప్రాంతాల్లో అన్నదాతలకు మద్దతు ధర లభించలేదు. దీంతో రైతులు నష్టానికే ధాన్యం అమ్ముకున్నారు. అయితే వ్యాపారులు మాత్రం తక్కువ ధరకు ధాన్యాన్ని కొని బియ్యం ధరలను అమాతంగా పెంచుతున్నారు. మార్కెట్ యావత్తును తమ చెప్పుచేతుల్లో పెట్టుకొని బియ్యం వ్యాపారులు ధరలను ఆకాశానికి పెంచారు. రానున్న రోజుల్లో బియ్యం ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని సామాన్యులు ఆందోళన చెందుతున్నారు.

మంత్రి X ఎంఎల్‌ఎలు

- అంతర్యుద్ధంగా మారిన శ్రీరాంసాగర్ నీటి విడుదల వివాదం
- వారం రోజులుగా రోడ్డెక్కుతున్న అన్నదాతలు
- తలలు పట్టుకుంటున్న ఎంఎల్‌ఎలు

మన తెలంగాణ / పెద్దపల్లి: శ్రీరాంసాగర్ నీటి విడుదల వివాదం చినికి చినికి గాలివానలా మారింది. పెద్దపల్లి జిల్లా ఎమ్మెల్యేలకు, ఇంచార్జి మంత్రి ఈటెల రాజేందర్‌కు మధ్యన అంతర్గతంగా యుద్ధంగా తయారైంది. జిల్లాలో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ఆయకట్టు పరిధిలోని పంటలకు నీరందక పోవడంతో గత వారం రోజుల నుండి రైతులు రోడ్డెక్కి ఆందోళన బాట పట్టడంతో జిల్లాలోని శాసన సభ్యులపై ఒత్తిడి తెస్తున్నారు. గత నెలలో రాష్ట్ర నీటిపారుదల శాఖామంత్రి హరీష్‌రావు సమక్షంలో జరిగిన సమావేశంలో ఎస్ఆర్ఎస్‌పి ఆయకట్టు పరిధిలోని పంటలకు 8 రోజులు ఆన్ 7 రోజులు ఆఫ్ పద్దతిన నీటిని విడుదల చేసి చివరి ఆయకట్టు వరకు నీరు అందించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలో పెద్దపల్లి జిల్లాలో రబీలో లక్ష ఎకరాల్లో వరి పంట సాగుకు రైతులు నారు మళ్లు పోసుకొని 50 రోజులు దాటినా నీరందక సగం కూడా నాట్లు పూర్తి కాలేదు. జిల్లాలోని సుల్తానాబాద్, ఓదెల, దర్మారం ప్రాంతాలలో వేసిన వరి పంటలు ఎండి పోతున్నాయి. 45 రోజులు దాటినా నారును నాటితే దిగుబడి ఆశించిన మేర రాదని రైతులు దిగులు చెందుతున్నారు. రైతుల ఆందోళన తీవ్ర రూపం దాల్చి తమ మెడకు చుట్టుకునేలా ఉందని ఎమ్మెల్యేలు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం జరిగిన పెద్దపల్లి అభివృద్ధి సమీక్షా సమావేశంలో శ్రీరాంసాగర్ నీటి ప్రస్తావన తేగా, మంత్రి ఈటెల రాజేందర్ అడ్డుకొని నీటివిడుదలను అధికారులు చూస్తారని, ఇందులో ఎమ్మెల్యేల జోక్యం అక్కర్లేదని అనడంతో జిల్లా ఎమ్మెల్యేలు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. మంత్రి తమ ప్రాంత ప్రయోజనాల కోసం ఏకపక్షంగా వ్యవహరించి పెద్దపల్లి జిల్లా రైతాంగానికి అన్యాయం చేస్తున్నారని ఆందోళన చెందుతున్నారు.

అక్రమంగా నీటి తరలింపు..

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ లో 80 టీఎంసీల నీరు నిల్వ ఉన్నప్పుడు, కాడా బోర్డు సమావేశం ఏర్పాటు చేసి వరద కాలువ ద్వారా లోయర్ మానేర్ , మిడ్ మానేర్‌కు గాని ఇతర అవసరాలకు నీటిని తరలించాల్సి ఉంది. అయితే 55 టీఎంసీల నీరు ఉండగానే ఎలాంటి విధివిధానాలు పాటించకుండానే ఎస్పారెస్పి నీటిని వరద కాలువ ద్వారా లోయర్ మానేర్ డ్యాంకు 17 టీఎంసీలు, మిడ్ మానేర్ డ్యాంకు 15 టీంసీలు మొత్తం 32 టీఎంసీల నీటిని తరలించడంతో రబిలో ఆయకట్టు రైతులకు నీరందడం లేదు. గడిచిన సంవత్సరం జనవరి రెండవ వారంలో ఎస్ఆర్ఎస్‌పీ లో 67 టీఎంసీల నీరుండగా, ఈ సంవత్సరం 39 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుండి అక్రమంగా 32 టీఎంసీల నీరును తరలించడంతో నీటి నిల్వలు తగ్గి పెద్దపల్లి జిల్లాకు నీరందడంలేదు. అక్రమంగా నిబంధనలకు విరుద్ధంగా నీటిని తరలించి పెద్దపల్లి జిల్లా రైతాంగానికి అన్యాయం చేశారని రైతులు ఆరోపిస్తున్నారు.

మన తెలంగాణ
8
హైదరాబాద్
సోమవారం
15 జనవరి 2018
wraw.manatelangana.news

ఆయన నాకెప్పుడూ స్ఫూర్తినిస్తుంటారు

రాజమౌళి గొప్ప దర్శకుడిగా ఎదగడంలో... ఏ తెలుగు దర్శకుడు అందుకోని స్థాయికి చేరుకోవడంలో ఆయన తండ్రి విజయేంద్ర ప్రసాద్ కీలక పాత్ర పోషించారు. ఒకటి అరా మినహాయిస్తే రాజమౌళి సినిమాలకు ఆయనే కథకుడు. ఆయన గొప్ప కథలు రాశాడు కాబట్టే రాజమౌళి కూడా అంత గొప్పగా వాటిని తీర్చిదిద్దగలిగాడు. రైటింగ్ పార్ట్ వరకు రాజమౌళికి ఎలాంటి టెన్షన్ లేకుండా చూసుకునేది విజయేంద్ర ప్రసాదే. తాను ఓ సినిమాను ముందే విజువలైజ్ చేసుకోవడంలో, దాన్ని ఎంత బాగా తీయాలా అని తపించేలా చేయడంలో తన తండ్రి తనకెప్పుడూ స్ఫూర్తినిస్తుంటారని అన్నాడు ఈ స్టార్ డైరెక్టర్. కేవలం పాత్రల్ని చెప్పడం ద్వారానే ఆయన తనను కదిలిస్తారని రాజమౌళి తెలిపాడు. "మా నాన్న నాకెప్పుడూ కథలు చెప్పరు. ముందు నాకు పాత్రల్ని పరిచయం చేస్తారు. ఒక్కో పాత్ర గురించి చెబుతారు. దాని లక్షణాలేంటి... ఆ పాత్ర నేపథ్యమేంటని వివరిస్తారు. ముందు ఆ పాత్రను ఆకళింపు చేసుకునేలా చేస్తారు. అలాగే కొన్ని సంఘటనలను కూడా వివరిస్తారు. ఇక వాటి తోనే నా ప్రయాణం సాగుతుంది. ఆయన ఎంత గొప్పగా పాత్రల గురించి చెబితే అంతే గొప్పగా తెర మీద ప్రజెంట్ చేయాలని అనుకుంటా"అని రాజమౌళి చెప్పారు.




చిరంజీవితో నాగశౌర్య

25న ప్రీ రిలీజ్ వేడుక

ఊహలు గుసగుసలాడే, దిక్కులు చూడకు రామయ్య, లక్ష్మి రావే మా ఇంటికి, కళ్యాణ్ వైభోగం, జ్యో అచ్యుతానంద వంటి విభిన్న చిత్రాలతో మంచి విజయాలను అందుకొని టాలీవుడ్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరో నాగశౌర్య. ఈ యువ కథానాయకుడు నటించిన తాజా చిత్రం 'ఛలో'. ఐరా క్రియేషన్స్ బ్యానర్‌లో ప్రొడక్షన్ నం.1గా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని శంకర ప్రసాద్ ముల్పూరి సమర్పణలో ఉషా ముల్పూరి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం గ్రాండ్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను ఈనెల 25న నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా రానుండడం విశేషం. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ శరవేగంగా జరుగుతోంది. ఫిబ్రవరి 2న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా అత్యధిక థియేటర్లలో గ్రాండ్‌గా రిలీజ్ చేయనున్నారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాతలు మాట్లాడుతూ "ఇప్పటివరకు రిలీజ్ చేసిన ఛలో ఫస్ట్‌లుక్, టీజర్, పాటలకు అద్భుతమైన స్పందన వచ్చింది. ఈనెల 25న 'ఛలో' గ్రాండ్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను హైదరాబాద్‌లో ఇప్పటివరకు ఎవ్వరూ చేయని విధంగా ప్లాన్ చేశాం. ఈ వేడుకకు మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా రానున్నారు. ప్రస్తుతం సినిమా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. అన్ని వర్గాల ప్రేక్షకులు మెచ్చే ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 2న విడుదల చేస్తున్నాం. మహతి స్వర సాగర్ అందించిన పాటలు, సాయి శ్రీరామ్ సినిమాటోగ్రఫీ ఈ సినిమాకు ప్రధాన బలం. నాగశౌర్య ఫర్‌ఫార్మెన్స్ చాలా కొత్తగా, ఎనర్జిటిక్‌గా ఉంటుంది. హీరోయిన్ రష్మిక మండన్న, నాగశౌర్య మధ్య మంచి కెమిస్ట్రీ కుదిరింది" అని అన్నారు. నరేష్, పోసాని, రఘుబాబు, వెన్నెల కిషోర్, మైమ్ గోపి, ప్రవీణ్, సత్య, వైవా హర్ష తదితరులు నటించిన ఈ చిత్రానికి ఎడిటింగ్ః కోటగిరి వెంకటేశ్వరరావు, ఫైట్స్ః వెంకట్, ఆర్ట్ః రామ్ అరసవిల్లి, డ్యాన్స్ః రఘు, విజయ్.


నాని

కోరమీసాలు.. పదునైన చూపులు

నాని హీరోగా నటిస్తున్న చిత్రం 'కృష్ణార్జున యుద్ధం'. సినిమా టైటిల్ పోస్టర్ విడుదలైనప్పటి నుండి ఈ చిత్రంపై ప్రేక్షకుల అంచనాలు మరింతగా పెరిగాయి. ఈ చిత్రంలో నాని రెండు పాత్రలు చేస్తుండటం విశేషం. సంక్రాంతి పండుగ సందర్భంగా ఈ చిత్రంలో కృష్ణ పాత్రకు సంబంధించి నాని లుక్‌ను విడుదల చేశారు. కత్తులను తలపిస్తున్న కోరమీసాలు... పదునైన చూపులతో పక్కా మాస్ యాంగిల్‌లో ఉన్న నాని లుక్‌కు అద్భుతమైన స్పందన వస్తోంది. వెంకట్ బోయనపల్లి సమర్పణలో షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి, హరీష్ పెద్ది ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ రాజా చిత్రాల దర్శకుడు మేర్లపాక గాంధీ ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాడు. నానీని సరికొత్త స్టైల్‌లో దర్శకుడు చూపిస్తున్నాడని న్యూ లుక్‌ను చూస్తే అర్థమవుతోంది. ప్రస్తుతం సినిమా చివరి షెడ్యూల్ చిత్రీకరణ జరుగుతోంది. పోస్ట్‌ప్రొడక్షన్ సహా అన్ని కార్యక్రమాలను పూర్తిచేసి ఏప్రిల్ 12న ఈ చిత్రాన్ని ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేయనున్నారు. ఈ చిత్రానికి హిప్ హాప్ తమిళ సంగీతాన్ని అందిస్తుండగా కార్తీక్ ఘట్టమనేని సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. నాని ద్విపాత్రాభినయం చేస్తున్న ఈ చిత్రంలో అనుపమా పరమేశ్వరన్, రుక్సర్ మీర్ హీరోయిన్లుగా నటిస్తున్నారు.

డార్క్ కామెడీ బ్యాక్‌డ్రాప్‌లో...



'మిఠాయి' సినిమాను క్లాప్ కొట్టి ప్రారంభిస్తున్న విజయ్ దేవరకొండ. చిత్రంలో సందీప్‌రెడ్డి వంగా, క్రాంతిమాధవ్, ప్రశాంత్‌కుమార్, రాహుల్ రామకృష్ణ, కమల్ కామరాజు, ప్రియదర్శి, శ్వేత, గాయత్రి.

రెడ్ యాంట్స్ బ్యానర్‌పై డార్క్ కామెడీ నేపథ్యంలో రూపొందుతున్న కొత్త చిత్రం 'మిఠాయి'. ప్రశాంత్ కుమార్ దర్శక నిర్మాణంలో తెరకెక్కనున్న ఈ చిత్రం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైంది. విజయ్ దేవరకొండ, సందీప్‌రెడ్డి వంగా, క్రాంతిమాధవ్‌లు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. విజయ్ దేవరకొండ క్లాప్ కొట్టి ఈ చిత్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సందీప్ రెడ్డి వంగా మాట్లాడుతూ "ఈ చిత్ర దర్శక నిర్మాత ప్రశాంత్ నాకు చాలా క్లోజ్ ఫ్రెండ్. వివేక్ సాగర్ సంగీతమందిస్తుంటే రాహుల్ రామకృష్ణ, కమల్ కామరాజు, ప్రియదర్శి, శ్వేత, గాయత్రి కీలక పాత్రలు పోషిస్తున్నారు. తెలుగులో డార్క్ కామెడీ నేపథ్యంలో చాలా గ్యాప్ తర్వాత చేస్తున్న సినిమా ఇది"అని అన్నారు. విజయ్ దేవరకొండ మాట్లాడుతూ "డిఫరెంట్ కథతో తెరకెక్కే డార్క్ కామెడీ మూవీ ఇది. ప్రశాంత్ ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కిస్తాడన్న నమ్మకముంది"అని చెప్పారు. దర్శకుడు ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ "ఇప్పటి వరకు డార్క్ కామెడీ బ్యాక్‌డ్రాప్‌లో తక్కువ సినిమాలే వచ్చాయి. తప్పకుండా ఈ సినిమా అందరికీ నచ్చుతుంది"అని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాహుల్ రామకృష్ణ, వివేక్ సాగర్, శ్వేతా వర్మ, గాయత్రి గుప్తా, ప్రియదర్శి, భూషణ్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీః సాకేత్ సౌరభ్, ఎడిటింగ్ః వీణు భూషణ్, కొరియోగ్రఫీః అనీ.


నందమూరి కళ్యాణ్‌రామ్

మార్చిలో వస్తున్న 'ఎంఎల్‌ఏ'

నందమూరి కళ్యాణ్‌రామ్ కథానాయకుడిగా ఉపేంద్ర మాధవ్ దర్శకత్వంలో రూపొందుతున్న ఫుల్‌లెంగ్త్ ఎంటర్‌టైనర్ 'ఎంఎల్‌ఏ'. మంచి లక్షణాలు ఉన్న అబ్బాయ్ అనేది క్యాప్షన్. ఈ చిత్రంలో అందాలభామ కాజల్ హీరోయిన్‌గా నటిస్తోంది. టి.జి.విశ్వప్రసాద్ సమర్పణలో బ్లూ ప్లానెట్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఎల్‌ఎల్‌పి, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ఎల్‌ఎల్‌పి బ్యానర్‌ల సంయుక్త నిర్మాణంలో ఈ చిత్రం రూపొందుతోంది. ఈ చిత్రానికి మణిశర్మ సంగీతాన్ని అందిస్తున్నారు. టాకీ పార్ట్ మొత్తాన్ని పూర్తిచేసుకున్న ఈ చిత్రం వచ్చే నెల విదేశీ షెడ్యూల్‌లో పాటల చిత్రీకరణతో షూటింగ్ మొత్తాన్ని పూర్తి చేసుకుంటుంది. చిత్ర నిర్మాతలు మాట్లాడుతూ "ఆద్యంతం వినోదభరితంగా సాగే ఈ చిత్రం హీరో కళ్యాణ్‌రామ్ కెరీర్‌లో ఒక మంచి చిత్రం అవుతుందని నమ్ముతున్నాం. నూతన దర్శకుడు ఉపేంద్ర ఈ చిత్రాన్ని వినోదాత్మకంగా తెరకెక్కిస్తున్నారు. మార్చిలో వేసవి సెలవుల సందర్భంగా ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం. చిత్రం టీజర్‌కు విశేష స్పందన లభించింది"అని తెలిపారు. దర్శకుడు ఉపేంద్ర మాట్లాడుతూ "న్యూ లుక్‌లో ఎంతో స్టైలిష్‌గా కళ్యాణ్‌రామ్ ఈ సినిమాలో కనపడతారు. ఎంఎల్‌ఏ అనే టైటిల్‌కు, క్యాప్షన్‌కు పూర్తి జస్టిఫికేషన్ ఉంటుంది"అని చెప్పారు. రవికిషన్, పోసాని, జయప్రకాష్‌రెడ్డి, అజయ్, వెన్నెల కిషోర్, పృథ్వీ, శివాజీ రాజా, ప్రభాస్ శ్రీను, లాస్య, మనాలి రాథోడ్ ఈ చిత్రంలో ప్రధాన పాత్రధారులు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీః ప్రసాద్ మూరెళ్ల, ఎడిటింగ్ః తమ్మిరాజు, రచనా సహకారంః ప్రవీణ్ వర్మ.

మహానుభావులలో కేటుగాళ్లు!


సాయికృష్ణ, అనిషా

శ్రీ అన్నపూర్ణ క్రియేషన్స్ బ్యానర్‌పై తల్లాడా శ్రీనివాస్ నిర్మాతగా తల్లాడా సాయికృష్ణ దర్శకత్వం వహిస్తూ నటిస్తున్న చిత్రం 'ఎందరో మహానుభావులు ఇందులో కొందరు కేటుగాళ్లు'. సమకాలీన పరిస్థితుల నేపథ్యంలో ప్రేమ, రాజకీయం, హాస్యం వంటి అంశాలతో ఈ ప్రయోగాత్మక చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ప్రేక్షకులకు కొత్త అనుభూతినిచ్చే విధంగా ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. సాయికృష్ణ, అనిషా, షాలిని హీరోహీరోయిన్లుగా తనికెళ్ల భరణి, కిషోర్ దాస్, రామసత్యనారాయణ ప్రధాన తారాగణంగా నటించిన ఈ చిత్రం షూటింగ్ పూర్తిచేసుకుంది. గోవా, అమలాపురం, విశాఖపట్నం, అరకు, ఖమ్మం, వరంగల్, హైదరాబాద్ ప్రాంతాల్లో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు చివరి దశలో ఉన్నాయి. దర్శకుడు మారుతి ఈ చిత్రానికి వాయిస్ ఓవర్ అందించడం విశేషం. ఇక త్వరలో సెన్సార్ కార్యక్రమాలను పూర్తిచేసి సినిమాను విడుదలకు సిద్ధం చేస్తామని దర్శకుడు తల్లాడా సాయికృష్ణ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరాః శివా, సంగీతంః సిద్ధార్థ్, డ్యాన్స్ః భరత్, డైలాగ్స్ః కిరణ్ కోదూరి, ఎడిటింగ్ః క్రాంతి, ఫైట్స్ః శ్యామ్.


అమీజాక్సన్

అందాలొలకబోయడానికి వెనుకాడను

హాట్ బ్యూటీ అమీజాక్సన్ ప్రస్తుతం తెలుగు, తమిళ్, హిందీ సినిమాల్లో నటిస్తూ బహుభాషా నాయకిగా ఎదుగుతోంది. పలువురు స్టార్ హీరోలతో నటిస్తూ టాప్ హీరోయిన్‌గా రాణిస్తోంది. ఆమె తన నటన, గ్లామర్‌తో యూత్‌ను అలరిస్తోంది. ఈ సందర్భంగా అమీ మాట్లాడుతూ "సినిమాలో ఇప్పుడు గ్లామర్ ఓ భాగమైయింది. సన్నివేశానికి అనుగుణంగా అందాలొలకబోయడానికి ఏమాత్రం వెనుకాడను. ప్రేక్షకులకు వినోదాన్ని అందించడానికి ఇది అవసరమని భావిస్తాను. ఇక మల్టీస్టారర్ సినిమాల్లో నటించడానికి నాకేమాత్రం అభ్యంతరం లేదు. అయితే సినిమాలో నా పాత్ర బలంగా ఉండేవిధంగా ఉండాలని కోరుకుంటాను" అని అమీ తెలిపింది. సూపర్‌స్టార్ రజనీకాంత్ సరసన శంకర్ డైరెక్షన్‌లో 'రోబో 2' సినిమాలో నటించడం ఎలా ఉందన్న పశ్నకు ఆమె సమాధానమిస్తూ... "రజనీకాంత్‌తో కలిసి నటించడం మరచిపోలేని అనుభూతినిచ్చింది. స్టార్ డైరెక్టర్ శంకర్ డైరెక్షన్‌లో ఒక్క చిత్రంలో నటించే అవకాశం రావడాన్ని గొప్పగా భావించిన నేను రెండోసారి ఆయన డైరెక్షన్‌లో నటిస్తుండడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నాను"అని అంది.


తమన్నా

స్టైలిష్‌గా ఉంటాను

మిల్కీబ్యూటీ తమన్నా సినిమాల్లోనే కాదు బయట ప్రపంచంలోనే స్టైలిష్‌గా ఉండేందుకు ఇష్టపడుతుంది. పదిమందిలో ప్రత్యేకంగా కనిపించాలని తహతహలాడుతుంది. "సినిమాల్లో టాప్ హీరోయిన్‌గా ఎదగడం నా అదృష్టం. ఇక సినిమాల్లో ధరించే దుస్తుల విషయాన్ని చిత్ర దర్శకుడు, కాస్ట్యూమ్ డిజైనర్లు చూసుకుంటారు. అయితే బయటి ప్రపంచంలో ఉన్నప్పుడు నా దుస్తులు స్టైలిష్‌గా ఉండేలా చూసుకుంటాను. నా ఫ్రెండ్స్ సర్కిల్‌లో ఉన్న వారిని చూసి డ్రెస్ సెలెక్ట్ చేసుకుంటాను. ఇక మనం ధరించే దుస్తులు మనం ఎలాంటి భావాలు గల వారమన్నది తెలియజేస్తుందని నా అభిప్రాయం"అని తమన్నా పేర్కొంది. "ప్రపంచంలోనే నాకు నచ్చిన పెళ్లికూతురు ఎవరని అడిగితే యువరాణి దయానా అని చెబుతాను. ఆమె వివాహ వేడుక నాకెంతో ఆశ్చర్యాన్ని కలిగించింది. ఈ వేడుకలో దయానా ధరించిన దుస్తులు, నడక నన్ను అబ్బురపరిచాయి. చరిత్రలో ఆమె గొప్ప సుందరిగా నిలిచిపోయింది. ఇకపోతే నా పెళ్లిని ఆడంబరంగా జరుపుకోను. అలా జరిగే వివాహం నాకు నచ్చదు. కుటుంబ సభ్యులు, సన్నిహితులు, స్నేహితుల మధ్య నిరాడంబరంగా పెళ్లి చేసుకుంటాను. అందంగా, అర్థవంతంగానూ నా పెళ్లి వేడుక ఉంటుంది"అని ఈ బ్యూటీక్వీన్ తెలిపింది.

కొత్తదనానికే ప్రాధాన్యతనిస్తా

చారిత్రక చిత్రంలో నటించాలన్నది తన కోరిక అని అంటోంది అందాల తార సమంత. ఆ అవకాశం కోసం చాలా రోజులుగా ఎదురుచూస్తున్నానని చెబుతోంది. ఇప్పటివరకు గ్లామర్ పాత్రలు, ప్రేమకథా చిత్రాలతో ప్రేక్షకుల్ని అలరించింది ఈ భామ. కమర్షియల్ సినిమాలకు పరిమితమైన ఆమె ప్రస్తుతం వినూత్న కథా చిత్రాలతో విజయాల్ని దక్కించుకునే ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పుడిప్పుడే రొటీన్‌కు భిన్నంగా నటనకు ఆస్కారమున్న పాత్రలవైపు మొగ్గుచూపుతున్న ఆమె భవిష్యత్‌లో కొత్తదనానికే తన ప్రాధాన్యత అని అంటోంది. "ఇన్నేళ్ల నా సినీ ప్రయాణంలో ప్రతిభను పరిపూర్ణ స్థాయిలో ప్రదర్శించే అవకాశాలు రాలేదు. ఇకనుంచి నా అసలైన ప్రతిభను చూపెట్టడానికి ప్రయత్నిస్తా. ప్రతి సినిమాలో పాత్రపరంగా వైవిధ్యం ఉండేలా చూసుకుంటా.అభినయానికి ఆస్కారమున్న అర్థవంతమైన పాత్రల్లో నటించాలనుకుంటున్నా. పిరియాడిక్ సినిమాల్లో నటించాలనేది నా చిరకాల కోరిక. గతించిన కాలాన్ని కళ్లముందు ఆవిష్కరించే వెసులుబాటు ఈ తరహా కథాంశాల్లో ఉంటుంది. నా కెరీర్ ముగిసేలోపు చారిత్రక కథాంశంతో కూడిన ఒక్క సినిమానైనా చేయాలనుకుంటున్నాను" అని చెప్పింది సమంత.


సమంత

మన తెలంగాణ

9 హైదరాబాద్ సోమవారం 15, జనవరి 2018

www.manatelangana.news

మార్కెట్‌లోకి పెక్స్‌పో స్టెయిన్‌లెస్ స్టీల్ బాటిళ్లు



మన తెలంగాణ/ హైదరాబాద్ : ఆరోగ్యం, పర్యావరణహిత స్టెయిన్ లెస్ స్టీల్ బాటిళ్లను ఫ్లాసెరో ఇంటర్‌నేషనల్ సంస్థ పెక్స్‌పో పేరిట మార్కెట్లోకి విడుదల చేసింది. ప్రధానమంత్రి మేకిన్ ఇండియా స్ఫూర్తిగా ఈ బాటిళ్లను రూపొందించినట్లు ఫ్లాసెరో ఇంటర్‌నేషనల్ సిఈవో వేదాంత్ పాడియా ఒక ప్రకటనలో తెలిపారు. 500 మి.లీ, 750 మి.లీ, ఒక లీటర్ స్పెసిఫికేషన్‌ల్లో మూడు విభాగాల్లో స్పోర్ట్స్ , ఫ్రిజ్, థర్మోలా రకాల్లో మార్కెట్‌లోకి విడుదల చేసినట్లు తెలిపింది. వేడి గాను, లేదా చల్లగానూ విభిన్న విధాలా ఈ బాటిళ్లను వినియోగించుకోవచ్చని తెలిపారు.

నేటితో ముగియనున్న బిఎస్ఎన్ఎల్ సంక్రాంతి హ్యాపీ ఆఫర్

మన తెలంగాణ/ హైదరాబాద్ : సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని బిఎస్ఎన్ఎల్ తన ప్రిపెయిడ్ వినియోగదారులకు ప్రత్యేక ఆఫర్లను ప్రకటించింది. 'హ్యాపీ' ఆఫర్ పేరిట 50 శాతం అదనపు డాటాతో పాటు 43 శాతం అదనపు టాక్‌టైమ్‌ను అందించనుంది. అలాగే రోజుకు వంద ఎస్ఎంఎస్‌లను కూడా ఈ స్కీమ్ ద్వారా వినియోగదారులు ఉచితంగా పొందవచ్చని బిఎస్ఎన్ఎల్ వెల్లడించింది. ప్రత్యేక డాటా ఆఫర్లు కూడా ఈ సంక్రాంతి సందర్భంగా అందిస్తున్నామని వినియోగదారులు ఈ నెల 15 తేదీ లోగా బిఎస్ఎన్ఎల్ ఆఫర్లను అందుకోవచ్చని వెల్లడించింది. మరిన్ని వివరాలకు టోల్‌ఫ్రీ 1503, లేదా 18001801503ను సంప్రదించవచ్చని తెలంగాణ టెలికం సర్కిల్ సిజిఎం వి. సుందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	63.28
యూరో	76.12
బ్రిటిష్ పౌండ్	85.87
ఆస్ట్రేలియన్ డాలర్	49.75
కెనెడియన్ డాలర్	50.98
ఎమిరైట్ దిర్హామ్	17.23
స్విస్ ఫ్రాంక్	64.89
చైనీస్ యువాన్	9.75
మలేషియన్ రింగిట్	15.83
న్యూజిలాండ్ డాలర్	45.36
హాంగ్‌కాంగ్ డాలర్	8.09
జపనీస్ యెన్	0.56
కువైట్ దినార్	209.96
సౌతాఫ్రికన్ రాండ్	5.14

బులియన్






బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22క్యారట్	24క్యారట్	మార్పు(%)
చెన్నై	28690	30684.49	0.67%
ముంబై	29270	31304.81	0.52%
ఢిల్లీ	29000	31016.04	0.69%
కోల్‌కతా	29470	31518.72	1.41%
కేరళ	27750	29679.14	0.73%
బెంగళూరు	28050	30000.00	0.36%
హైదరాబాద్	28690	30684.49	0.77%
గల్ఫ్	1402.73	1500.25	0%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	బుధవారం	మంగళవారం	మార్పు (%)
చెన్నై	41900.00	42000.00	0.24
ముంబై	41900.00	42000.00	0.24
ఢిల్లీ	41900.00	42000.00	0.24
కోల్‌కతా	41900.00	42000.00	0.24
హైదరాబాద్	41900.00	42000.00	0.24



కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	402	విశాఖపట్నం	402
వరంగల్	404	చిత్తూరు	398
విజయవాడ	404	చెన్నై	405
గోదావరి	404	బెంగళూరు	405

బ్యాంకింగ్ కార్యకలాపాల్లో ఇబ్బందులకు స్వస్తి చెబుదాం

మీరు క్రెడిట్ కార్డు వాడుతున్నా, చెక్కు పుస్తకం లేదా పొదుపు ఖాతా ఉన్నా వాటి వాడుకకు సంబంధించి రుసుములను తెలుసుకోవడం ముఖ్యం. ఎటిఎం కనీస లావాదేవీల తర్వాత రుసుములను వసూలు చేస్తున్నారు. ఈ పరిమితిని బ్యాంకులు ప్రజలకు తెలియజేయాలి. బ్యాంకులు కనీస ప్రచారంపై అశ్రద్ధ వహిస్తుండటంతో కొంత మందికి రుసుముల రూపంలో ఎక్కువ ఖర్చు పెట్టాల్సివస్తుంది. చార్జీలు మినహాయించిన తర్వాత తెలుసుకున్నా ప్రయోజనం ఉండదు. ఈ నేపథ్యంలో బ్యాంకులు అందించే సేవలను ఎలా వాడుకుంటే మనకు ప్రయోజనమో తెలుసుకుందాం.



ఎటిఎం లావాదేవీలు




చాలా బ్యాంకులు సొంత ఎటిఎమ్‌ల్లో కార్డు వాడకాన్ని ఐదు సార్లు, ఇత్ర బ్యాంకు ఎటిఎంల్లో వాడకాన్ని మూడు సార్లు పరిమితం చేశాయి. దీని తర్వాత వాడితే రుసుములు విధిస్తారు. ఇక్కడ మూడు లావాదేవీల్లో వైట్ లేబుల్ ఎటిఎం(ఇండిక్యాష్ వంటివి) లావాదేవీలు సైతం నిర్వహించుకోవచ్చు.

పొదుపు ఖాతా

ఒక పొదుపు ఖాతాను రెండేళ్ల పాటు అసలు వాడకపోతే ఇన్‌ఆపరేటివ్ అకౌంట్‌గా పరిగణిస్తారు. ఒకటి కంటే ఎక్కువ ఖాతాలను వాడుతుంటే అన్నింటిలో అప్పుడప్పుడు లావాదేవీలు జరిపేలా చూసుకుంటే మంచిది.

చెక్కు వ్యాలిడిటీ



చెక్కు, డిడి, బ్యాంకర్స్ చెక్కుల వ్యాలిడిటీని 6 నెలల నుంచి 3 నెలలకు తగ్గించారు. ఒకసారి చెక్కు జారీ చేస్తే దానిని మూడు నెలల్లోపు డ్రా చేసేలా ఉండేలా ఇవ్వండి. చెక్కు బౌన్స్ అయితే కేసులు ఉంటాయన్న విషయాన్ని మరిచిపోవద్దు.

మెసేజ్, మెయిల్ అలర్టులు

కార్డు ద్వారా జరిపే లావాదేవీల వివరాలను బ్యాంకులు ఎప్పటికప్పుడు మొబైల్‌కు, మెయిల్‌కు అలర్టుల రూపంలో పంపాలి. ఇవి ఎప్పటికప్పుడు మీకు అందుతున్నాయా లేదా చూసుకోండి. అలర్టులు రాకపోతే బ్యాంకు కస్టమర్‌కేర్‌ను సంప్రదించండి. ఇన్‌స్టంట్ అలర్ట్ సదుపాయం కోసం బ్యాంకులు కొద్ది మొత్తంలో రుసుములు వసూలు చేస్తాయి. ప్రభుత్వ బ్యాంకులతో పోలిస్తే ప్రైవేటు బ్యాంకులు కాస్త అధికంగా ఈ రుసుములను విధిస్తుంటాయి.

ఎటిఎం – డెబిట్ కార్డు



ఎటిఎం లావాదేవీలకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలుంటే వెంటనే బ్యాంకులకు తెలియపరచాలి. ఇందుకు వారం రోజులను గడువుగా చెపుతున్నారు. ఎటిఎం లావాదేవీల్లో బ్యాంకు వైపు నుంచి పొరపాటు ఉంటే అందుకు రోజుకు రూ. 100 నష్టపరిహారాన్ని బ్యాంకు చెల్లించాల్సి ఉంటుంది. అయితే కార్డు జారీ చేసిన బ్యాంకులో ఫిర్యాదు చేసినప్పుడు మాత్రమే ఇది వర్తిస్తుంది.

ఆధార్ అనుసంధానం



కెవైసి విధానాన్ని సులభతరం చేసేందుకు బ్యాంకులు ఆధార్‌పై ఆధారపడటాన్ని చూస్తున్నాం. మీకు ఆధార్ ఉంటే బ్యాంకు ఖాతాతో అనుసంధానం చేస్తే కెవైసి ధ్రువీకరణకు ఇదొక్కటే చాలు. ప్రస్తుతం ఈ కెవైసిని సైతం అధికారిక ధ్రువీకరణ పత్రంగా అంగీకరిస్తున్న తరుణంలో ఆధార్‌ను విస్తృతంగా వాడుకోవచ్చు. ఒకసారి ఈకేవైసీ పూర్తయితే చాలా ఆర్థిక సాధనాల్లో పెట్టుబడులకు అది ఉపయోగపడుతుంది. బ్యాంకు ఖాతాకు, ఆధార్ అనుసంధానం చేయకపోతే ఖాతాను కొద్ది రోజు లు తాత్కాలికంగా నిలిపివేస్తారన్నది మరిచిపోవద్దు.

పాస్‌బుక్

పొదుపు ఖాతాదార్లందరికీ బ్యాంకులు పాస్‌బుక్ జారీచేయాల్సి ఉంది. పాస్‌బుక్ ఇవ్వకపోతే ఫిర్యాదు చేసి తెచ్చుకోవచ్చు. దీని ద్వారా చాలా ప్రయోజనాలను పొందవచ్చు. ఇప్పుడు ప్రైవేటు బ్యాంకులన్నీ పాస్ బుక్ అవసరం లేకుండా ఆన్‌లైన్లో మినీస్టేట్ మెంట్, డిటైల్ స్టేట్మెంట్ పొందేందుకు అవకాశం కల్పిస్తున్నాయి. ఇంకా మీకు వివరాలు కావాలంటే మీరు ఎటిఎం యంత్రాల్లో స్టేట్ మెంట్లను తీసుకోవచ్చు.

ముందస్తు ముగింపు (ఫోర్‌క్లోజర్) రుసుము

గృహ రుణం ఫ్లోటింగ్ వడ్డీ రూపంలో తీసుకుని, ఆ రుణాన్ని ముందస్తుగా ముగించాలనుకుంటే దానికి ఎటువంటి ముందస్తు చెల్లింపు రుసుములు లేదా పెనాల్టీలు వసూలు చేయొద్దు.

ఫిక్స్‌డ్ వడ్డీ రేటుపై తీసుకున్న గృహ రుణాలకు ఈ రుసుములు ఉంటాయి. గృహ రుణం దరఖాస్తు చేసేటప్పుడే బ్యాంకును అడిగి తెలుసుకోండి.

సిమెంట్‌కు భారీగా డిమాండ్

● తెలుగు రాష్ట్రాల్లో పుంజుకుంటున్న నిర్మాణ ప్రాజెక్టులు ● మూడేళ్ల వరకు డిమాండ్ ఇలాగే ఉండొచ్చంటున్న ఉత్పత్తి దారులు

మన తెలంగాణ / హైదరాబాద్ : తెలుగు రాష్ట్రాల్లో నిర్మాణ ప్రాజెక్టులతో సిమెంట్‌కు భారీగా డిమాండ్ ఏర్పడింది. సాగునీటి ప్రాజెక్టులు, కొత్త జిల్లాలతో నూతనంగా కలెక్టరేట్లు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలు అనివార్యం అవుతున్నాయి. ఈ క్రమంలో సిమెంట్ వినియోగం గణనీయంగా పెరుగుతోంది. ఉమ్మడి రాష్ట్రం నుండి విడిపోయిన ఆంధ్రప్రదేశ్‌లోనూ నూతన రాజధాని నగర నిర్మాణం, అసెంబ్లీ, సచివాలయం, సాగునీటి పారుదల ప్రాజెక్టులు వంటి వాటి కారణంగా సిమెంట్ వినియోగం రికార్డు స్థాయికి చేరుకుంటోంది. గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం సిమెంట్ పరిశ్రమ 10 శాతం వరకు వృద్ధి సాధించినట్లు తెలుస్తోంది. రానున్న రెండు మూడేళ్లూ ఇదే విధంగా సిమెంట్ అవసరాలు తెలుగు రాష్ట్రాలకు అవసరం ఉండడంతో మొత్తంగా 18 శాతం వరకు సిమెంట్ పరిశ్రమ వృద్ధి సాధించే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. దేశంలో ఉత్పత్తి అవుతున్న మొత్తం సిమెంటులో 50 శాతం వరకు తెలుగు రాష్ట్రాల్లో జరుగుతోంది. ఏటా ఆంధ్రప్రదేశ్‌లో 60 మిలియన్ టన్నులు, తెలంగాణలో 30 మిలియన్ టన్నుల వరకు ఉత్పత్తి అవుతున్నట్లు అంచనా. సాధారణ పరిస్థితుల్లో తెలంగాణలో ఈ మొత్తం ఉత్పత్తిలో 15.18 మిలియన్ టన్నుల వరకు మాత్రమే వినియోగమవుతోంది. మిగతా సిమెంట్ అంతా మహారాష్ట్ర, తమిళనాడు,



కర్నాటక, మధ్యప్రదేశ్‌లకు ఎగుమతి అవుతోందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి.

ప్రభావం చూపిన డిమానిటైజేషన్ !

గడచిన ఏడాది కాలంగా సిమెంట్ పరిశ్రమ పెద్ద నోట్ల రద్దు ప్రభావం కారణంగా ఒడుదుడుకులను ఎదుర్కొంది. 2015– 16 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2016– 17లో సిమెంట్ వినియోగం గణనీయంగా పడిపోయిందని సిమెంట్ పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ఈ కారణంగా భవన నిర్మాణరంగంపై తీవ్ర ప్రభావాన్నే చూపాయి. వర్షాకాలం, శీతాకాలంతో పోలిస్తే వేసవి కాలంలో భవన నిర్మాణాలు ఎక్కువగా జరుగుతుంటాయి. వీటికి తోడు ప్రభుత్వ పరంగానూ వివిధ కార్యాలయాల నిర్మాణాలు కూడా ఇదే సీజన్‌లో జరుగుతుంటాయి. ఎప్పటిలాగానే సిమెంట్‌కు డిమాండ్ కొనసాగుతుందని ఆశించిన సిమెంట్ తయారీ సంస్థలపై నోట్ల రద్దు, దాని వెన్నంటి రియల్ ఎస్టేట్‌లో స్తబ్దత ప్రభావం గణనీయంగా పడింది. కొత్త నోట్లు మార్కెట్‌లోకి డిమాండ్ మేరకు రాక పోవడం కూడా సిమెంట్ కొనుగోళ్లపై నీలినీడలను కమ్మింది. ప్రభుత్వ పథకాలైన మిషన్ భగీరథ, డబుల్ బెడ్ రూం ఇళ్ల పథకాలపైనా సిమెంట్ ఇండస్ట్రీ చాలా ఆశలు పెట్టుకుంది. తాగు, సాగునీటి పథకాలు, రోడ్లు తదితర మౌలిక సదుపాయాల కల్పన లాంటి అంశాలన్నీ సిమెంట్ అవసరాల చుట్టూనే తిరుగుతాయని భావించిన సిమెంట్ పరిశ్రమ అందుకు తగ్గట్లుగానే వినియోగంపై భారీ అంచనాలు వేసుకుంది.

ఇక ముందున్నవి మంచి రోజులే : ఎస్. శ్రీకాంత్ రెడ్డి , సాగర్ సిమెంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్

డీమానిటైజేషన్ నుండి కొలుకున్న పరిశ్రమకు ముందున్నవి మంచి రోజులేనని సాగర్ సిమెంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. సిమెంట్‌కు ఎప్పటికీ డిమాండ్ తగ్గదని, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎప్పటికప్పుడు అవసరం అవుతూనే ఉంటుందని, అందుకు అనుగుణంగానే సిమెంట్ అవసరాలు ఉంటాయన్నారు.

అమెజాన్‌లో తాత్కాలిక నియామకాలు

న్యూఢిల్లీ: ఆరువేల ఐదు వందల మంది తాత్కాలిక ఉద్యోగులను నియమించుకొంటామని అమెజాన్ సంస్థ పేర్కొంది. ఈ నెల 20 నుండి 24వ, తేది వరకు అమెజాన్ గ్రేట్ ఇండియన్ సేల్స్ ను నిర్వహిస్తోంది. దీంతో ఈ తాత్కాలిక ఉద్యోగాలకు అవకాశం ఇస్తున్నట్లు తెలిపింది. ఫుల్‌ఫిల్మెంట్ సెంటర్లు, డెలివరీ స్టేషన్లు, సార్టేషన్ సెంటర్లలో ఈ నియామకాలు ఉంటాయి. సీజనల్ నియామకాల్లో భాగంగా సీజనల్ పొజిషన్స్ కోసం 6500 మందిని విధుల్లోకి తీసుకుంటున్నామని అమెజాన్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ అఖిల్ సక్సేనా చెప్పారు. సేల్ పీరియడ్‌లో కస్టమర్ల నుంచి అధిక డిమాండ్‌ను అధిగమించేందుకు 1000 మంది అసోసియేట్స్‌ను నియమిస్తామని చెప్పారు వినియోగదారులకు మెరుగైన డెలివరీ సేవలు అందించడానికి ఈ నియమకాలు చేపడుతున్నట్లు తెలిపారు.

గ్యాస్ సబ్సిడీ సొమ్ము ఖాతాలో పడటం లేదా?

హైదరాబాద్ : రవి ఎప్పటిలాగే గ్యాస్ బుక్ చేశాడు.. గ్యాస్ సిలిండర్ వచ్చింది. కానీ రావాల్సిన సబ్సిడీ మాత్రం ఇంకా బ్యాంకు ఖాతాలో పడలేదు.. అప్పటికే పది రోజులు గడిచింది. తనకు ఎప్పుడు రాయితీ పడే బ్యాంకు ఖాతా తనిఖీ చేసుకున్నా ఫలితం లేదు... డీలర్‌ను సంప్రదిస్తే మీ బ్యాంకు ఖాతాలో జమ అయ్యిందని చెబుతున్నాడు. ఈ సమస్య ఒక్క రవిదే కాదు చాలా మంది ఈ తరహాలోనే ఇబ్బంది పడుతున్నారు..

అయితే, ఈ సమస్య పరిష్కారానికి మొబైల్ ఉపయోగిస్తే సరి.అది ఎలాగో చూద్దాం. ముందుగా, గ్యాస్ యాజమాన్య సంస్థలను సంప్రదించాలి. మీ మొబైల్‌లో*99*99# నొక్కితే ఏ బ్యాంకు ఖాతాకు వెళుతుందో తెలుస్తుంది. అదేవిధంగా, అన్ని గ్యాస్ సంస్థల ఫిర్యాదులకు టోల్ ఫ్రీ నం.18002333555 లేదా హెచ్‌పీ 24 గంటల కాంటాక్ట్ నెంబర్ 96660 23456 లేదా భారత్ గ్యాస్ 24 గంటల కాంటాక్ట్ నంబర్ 9440156789లను సంప్రదించాలి.

చివరిసారిగా ఆధార్ ఇచ్చిన చోటే జమవుతుంది.. ఎప్పుడూ పడే గ్యాస్ రాయితీ ఈ నెల పడలేదు అనగానే మొదట వేరే బ్యాంకు ఖాతాకు కొత్తగా ఆధార్ నంబర్ జత చేశారేమో చూసుకోవాలి. నిత్యం వాడే ఖాతా కాకుండా ఏదైనా బ్యాంకు రుణం కోసం కొత్తగా తెరిచిన ఖాతాకు ఆధార్ అనుసంధానం చేస్తున్నారు. ఆ సమాచారం నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ఇండియా (ఎన్పీసీఐ) కు వెళ్తుంది. ఆటోమేటిగ్గా రాయితీ పడే ఖాతా మారిపోతుంది.. ఆ విషయం తెలియక ఎప్పుడూ పడే ఖాతాలోనే చూసుకుంటాం.. దాంతో సమస్య వస్తోంది.



అది ఏ ఖాతాలో పడుతుందో మీ మొబైల్ ద్వారానే తెలుసుకోవచ్చు.. మొబైల్‌లో*99*99# నొక్కి డయల్ చేయాలి.. వెంటనే మీ ఆధార్ నంబరు అడుగుతుంది.. దాన్ని ఎంటర్ చేసి కన్ఫమ్ చేయడానికి 1 నొక్కాలి.. అంతే మీ ఆధార్ నంబరు చూపిస్తూ అది ఏ బ్యాంకుకు అనుసంధానమైందో.. చివరి సారి ఎప్పుడు రాయితీ పడిందో చెబుతుంది..

మనం వాడేది భారత, హెచ్‌పీ, ఇండియన్ గ్యాస్‌లలో ఏదైనా సరే సమస్య వస్తే మూడింటికి కామన్‌గా ఉన్న 18002333555 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయొచ్చు. గ్యాస్ సమస్య అనగానే ముందు ఇంట్లోని గృహిణికే ఇబ్బంది.. వారు కాల్‌సెంటర్ అనగానే ఆంగ్లంలోనో.. హిందీలోనో మాట్లాడుతారని కంగారు పడుతుంటారు.. కాని దీంట్లో ఇంగ్లిష్, హిందీతోపాటు ప్రధానమైన భారతీయ భాషలైన తెలుగు, కన్నడం, తమిళం, మళయాళంలో మాట్లాడే ప్రతనిధులు ఉంటారు. ఈ నంబరుకు చేసి తెలుగు కోసం 3 నొక్కి ఎంపిక చేసుకోవాలి.. ఆ తరవాత ఏ గ్యాస్ సంస్థ అనేది నంబరు ద్వారా ఇవ్వాలి.. ఇండియన్ గ్యాస్ కోసం 1 నొక్కాలి, హిందుస్థాన్ పెట్రోలియం (హెచ్‌పీ) కోసం 2, భారత గ్యాస్ కోసం 3 నొక్కాలి.. ఇప్పుడు రాయితీ సమస్య అయితే 1, ఇతర సమస్యల కోసమైతే 2 నొక్కి వేచి ఉండాలి.. సంబంధిత గ్యాస్ సంస్థ ప్రతినిధి మీతో మాట్లాడుతారు.. మన సమస్య చెప్పి ఫిర్యాదు నంబరు (ఎస్ఆర్ నంబరు) తీసుకోవాలి. ఆ నంబరు మన మొబైల్‌కు ఎస్ఎంఎస్ రూపంలో వస్తుంది.

రాయితీ సమస్యలకు ఫిర్యాదు చేయొచ్చు, గ్యాస్ తూకం తగ్గినా.. సీల్ లేకుండా వచ్చి ఇచ్చినా.. బుక్ చేసినా నిర్ణీత సమయంలో డెలివరీ చేయకపోయినా.. గ్యాస్ డీలరు మోసం చేసినా.. వీటితోపాటు గ్యాస్‌కు సంబంధించిన ఏ సమస్య వచ్చినా ఈ కాల్ సెంటర్‌ను సంప్రదించవచ్చు.

కొత్తగా రాయితీ పడే బ్యాంకు ఖాతాలో కాకుండా గతంలో పడే అకౌంట్‌లోనే పడాలనుకుంటే.. ఆ బ్యాంకుకు వెళ్లి ఒక ఆధార్ జీరాక్స్ ఇచ్చి తన ఖాతాకి అనుసంధానం చేయాలని అడగాలి.. ఒకవేళ ఇప్పటికే జతచేసి ఉందని బ్యాంకు అధికారులు చెబితే, రాయితీ వేరే ఖాతాకు వెళ్లిన విషయం చెప్పి ఎన్‌పీసీఐ సర్వర్‌కు అనుసంధానం చేయాలని తెలియజేయాలి.


ఎన్‌పీసీఐ నుంచి రాయితీ మన ఖాతాకు పంపినా లావాదేవీ ఒక్కోసారి ఫెయిలైతే.. వెంటనే సంబంధిత బ్యాంకును సంప్రదించాలి. అప్పుడు లావాదేవీకి సంబంధించిన సమస్యను సరిచేస్తారు.. అవసరం అనుకుంటే మళ్లీ ఆధార్ నంబరు తీసుకుని అప్‌డేట్ చేస్తారు..

స్వయం ఉపాధి కూడా గౌరవించదగిన వృత్తే : రాష్ట్రపతి

ముంబయి: యువత ఉద్యోగాలు లేవంటూ బాధపడకుండా స్వయం ఉపాధిని ఎంచుకోవాలని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అన్నారు. మహారాష్ట్రలోని థానే జిల్లాలో ఒక సేవాసంస్థ ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వయం ఉపాధి కూడా గౌరవప్రదమైనదని అన్నారు. నిరుద్యోగ యువత అవకాశాలు అందిపుచ్చుకోవాలని తెలిపారు. ప్రాజెక్ట్ స్వయం ఉపాధి పేరుతో నవతర భారతీయ యువత స్వతహాగా ఉపాధి కల్పించుకునేలా ప్రభుత్వాలు, ఎన్‌జీవోలు వారిని ప్రోత్సహించాలన్నారు. దేశంలో అమలులో ఉన్న ముద్రా యోజన, స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా పథకాలు యువతకు ఎన్నో రకాలుగా స్వయం ఉపాధిని కల్పిస్తున్నాయన్నారు. మహిళలు కూడా స్వయం ఉపాధి విషయంలో ముందంజలో ఉండటం అభినందనీయం అన్నారు. ప్రధాన మంత్రి జన్‌ధన్ యోజనలో 50శాతం మహిళా ఖాతాదారులే ఉన్నారని ఈ సందర్భంగా తెలిపారు. ఇది నిజంగా ఆహ్వానించదగిన విషయం. మహిళలు సాధికారత సాధిస్తున్నారనటానికి ఇదే నిదర్శనమని కొనియాడారు



ఐరాసలో భారత ప్రతినిధి ట్విటర్ హ్యాక్



న్యూఢిల్లీ: ఐక్యరాజ్య సమితిలో భారత శాశ్వత ప్రతినిధి సయీద్ అక్బరుద్దీన్ ట్విటర్ ఖాతా ఆదివారం ఉదయం హ్యాకింగ్‌కు గురైంది. ఆయన ట్విటర్ ఖాతాలో పాకిస్థాన్ జెండాను, ఆ దేశ అధ్యక్షుడు మమ్నూన్ హుస్సేన్ ఫొటోను పోస్టు చేశారు. దీంతో పాటు అక్బరుద్దీన్ ట్విటర్ ఖాతాకు ఉండే వెరిఫైడ్ బ్లూ కలర్ టిక్ మార్క్ కూడా హ్యాకింగ్ సమయంలో అదృశ్యమైంది. ఆయన చేసిన పలు ట్వీట్లను కూడా హ్యాకర్లు తొలగించారు. ఆయన ట్విటర్ ఖాతా హ్యాకింగ్ గురైన విషయాన్ని పలువురు నెటిజన్లు ట్వీట్లు చేయడంతో విషయం బయటకు వచ్చింది. దీనిపై స్పందించిన ట్విటర్ ఇండియా వెంటనే ఆయన ట్విటర్ ఖాతాను పునరుద్ధరించింది. ఈ విషయాన్ని అక్బరుద్దీన్ ధ్రువీకరించారు. మళ్లీ తన ట్విటర్ ఖాతా తిరిగి వచ్చిందని ఆయన ట్వీట్ చేశారు. పాకిస్థాన్ ఉగ్రవాదులు ఇటీవల కాలంలో భారత్ ప్రభుత్వ అధికారులను లక్ష్యంగా చేసుకొని సైబర్ అటాక్‌కు పాల్పడుతున్నారు. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ విడుదల చేసిన నివేదిక ప్రకారం 2016లో 199 ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్లు హ్యాకింగ్‌కు గురయ్యాయి.

బెయిల్‌కు ఆధార్ తప్పనిసరి

రాయ్‌పూర్: చత్తీస్‌గఢ్ హైకోర్టు సంలచన తీర్పు ఇచ్చింది. ఇకపై బెయిల్ కోసం ఆధార్ వివరాలు సమర్పించాల్సిందేనని తేల్చి చెప్పింది. ష్యూరిటీ పేపర్లతోపాటు ఆధార్ కార్డును కూడా సమర్పిస్తేనే బెయిల్‌ను పరిశీలిస్తామని తేల్చి చెప్పింది. ఈ మేరకు అన్ని ట్రయల్ కోర్టులకు ఆదేశాలు జారీ చేసింది. నిందితుడి బెయిల్ పేపర్లతోపాటు తప్పనిసరిగా ఆధార్ కార్డు కాపీని కూడా పరిశీలిస్తేనే బెయిలు అభ్యర్థనను పరిశీలించాలని ఆదేశించింది

ఘోర ప్రమాదం, ఆరుగురు మృతి

తమిళనాడు: కృష్ణగిరి దగ్గర హైవేపై ఆదివారం ఘోర రోడ్డుప్రమాదం సంభవించింది. బస్సుకారు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆరుగురు ప్రాణాలుకోల్పోయారు. మరో 20మందికి తీవ్రగాయాలయ్యాయి. గాయపడ్డవారిని ఆస్పత్రికి తరలించారు. కారులో ఉన్న ఐదుగురితోపాటు బస్సు డ్రైవర్ మృతి చెందాడు. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

కశ్మీరు యువతకు నైపుణ్య శిక్షణ

బారాముల్లా: కశ్మీరు యువతను సాధికారులను చేసేందుకు భారత సైన్యం కృషి చేస్తోంది. జమ్మూకశ్మీరులోని బారాముల్లా జిల్లాలో నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. విద్యావంతులైన నిరుద్యోగ యువతకు అత్యాధునిక, అత్యుత్తమ శిక్షణ ఇస్తోంది. ప్రభుత్వప్రైవేటు భాగస్వామ్యంలో ఈ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఫుడ్ ప్రాసెసింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగాల్లో రెండు వారాలపాటు శిక్షణ ఇస్తారు. ఆహార పదార్థాలను నిల్వ చేయడం, జ్యూస్ తయారీ వంటి వాటిని నేర్పుతారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో ఉపాధి అవకాశాలు గల కోర్సులను కూడా యువతకు నేర్పుతారు. జాతీయ నైపుణ్యాభివృద్ధి పథకంలో భాగంగా ఈ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

మత్స్య సంపదను గుర్తించే వ్యవస్థ

పనాజీ : సముద్రజలాల్లో మత్స్య సంపద ఎక్కువగా ఉండే ప్రాంతాలను ముందుగానే గుర్తించే వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నామని కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సిఎస్ఐఆర్) నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ (ఎన్ఐవో) డైరెక్టర్ సుశీల్ కుమార్ తెలిపారు. ఇందుకోసం ఉపగ్రహ ఛాయాచిత్రాలతోపాటు నీటి అడుగున పరికరాలను అమర్చి పరిశోధన చేస్తున్నామన్నారు. హైదరాబాద్‌లోని భారత జాతీయ సముద్ర సమాచార సేవల కేంద్రం(ఇన్‌కాయిస్) అందించే సమాచారంపైనే ఇప్పటి వరకు మత్స్యకారులు ఆధారపడుతున్నారని, ఇది కొన్ని ప్రాంతాల్లోనే సాయపడుతోంది చెప్పారు. సముద్ర నీటిలో ఒక నెల కంటే ముందుగానే మత్స్య సంపద రాకను అంచనా వేయడంతో పాటు ఏ ప్రాంతంలో ఎలాంటి మత్స్య సంపద ఉంటుందో తెలియజెప్పే విధానాన్ని రూపొందిస్తున్నామన్నారు. దీంతో ప్రభుత్వం మత్స్యకారులకు సాయపడే విధానాన్ని రూపొందించే వీలంటుంది.


తెలుగమ్మాయికి అరుదైన అవకాశం



న్యూఢిల్లీ : తెలుగమ్మాయికి అరుదైన అవకాశం లభించింది. షిప్ ఫర్ వరల్ యూత్ లీడర్స్ కార్యక్రమానికి హైదరాబాద్‌కు చెందిన శ్రీతేజ అనే యువతి ఎంపికైంది. జపాన్ ఏటా నిర్వహించే ఈ కార్యక్రమానికి భారత్ నుంచి హాజరయ్యే 10 మంది బృందానికి శ్రీతేజ నేతృత్వం వహించనున్నారు. పార్లమెంట్ రీసెర్చ్ ఫెలోషిప్ విద్యార్థినిగా ఉన్న శ్రీ తేజను కేంద్ర యువజన వ్యవహారాలు, క్రడా మంత్రిత్వశాఖ ఎంపికచేసింది. యువతీ యువకుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించనున్న ఈ కార్యక్రమానికి 11 దేశాల నుంచి 240 మంది ప్రతినిధులు హాజరుకానున్నారు. దీనిద్వారా రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో ప్రతినిధులకు అవగాహన కల్పించనున్నారు.

నేను స్కూటర్ నడపను : పారికర్

పనాజీ: తాను జీవితంలో ఇంకెప్పుడూ స్కూటర్ నడపనని అంటున్నారు గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారికర్. దగ్గర్లోని మార్కెట్లకు వెళ్లడానికి కూడా పారికర్ స్కూ టర్‌పై వెళుతుంటాడని గతంలో పలు మీడి యా వర్గాలు పేర్కొన్నాయి. దీని గురించి శనివారం కానకోనా ప్రాంతంలో నిర్వ హించిన ఓ కార్యక్రమంలో పారికర్ మా ట్లాడారు. 'ఇప్పటికీ స్కూటర్‌పై మీరు ప్రయాణిస్తుంటారా అని చాలా మంది ప్రజలు నన్ను అడుగుతుంటారు. కానీ ఇకపై నేను స్కూటర్ నడపను. నా మనసంతా చేయాల్సిన ముఖ్యమైన పనులపైనే ఉంటుం ది. స్కూటర్ నడుపుతూ పని గురించి ఆలోచిస్తే ప్రమాదాలు జరుగుతా యి. అందుకే స్కూటర్ నడపడమే కాదు వెనక కూడా కూర్చోను.' అని తెలిపారు. గోవాలో ప్రమాదాలను నివారించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని ఆయన పేర్కొన్నారు.



ఇజ్రాయెల్ ప్రధానికి ఆత్మీయ స్వాగతం

- స్వయంగా విమానాశ్రయానికి వెళ్లిన నరేంద్రమోడీ

న్యూఢిల్లీ: ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు భారత్ చేరుకున్నారు. ఆయనకు స్వాగతం పలికేందుకు ఆదివారం మధ్యాహ్నం ప్రధాని నరేంద్రమోడీ ప్రొటోకాల్‌ను పక్కన పెట్టి మరీ ఢిల్లీ విమానాశ్రయానికి వెళ్లారు. భారత్ చేరుకున్న నెతన్యాహును మోడీ ఆత్మీయ ఆలింగనం చేసుకొని స్వాగతం పలికారు. నెతన్యాహు వెంట ముంబయి పేలుళ్ల నుంచి సురక్షితంగా బయట పడిన 11ఏళ్ల బాలుడు మోషే కూడా భారత్ వచ్చాడు. నెతన్యాహుతో కలిసి మోడీ తీన్ మూర్తి చౌక్‌కు వెళ్తారు. అక్కడ జరిగే కార్యక్రమంలో ఇరు దేశాధినేతలు పాల్గొంటారు. ఈ సందర్భంగా తీన్ మూర్తి చౌక్ పేరును తీన్ మూర్తి హైఫీ చౌక్‌గా మార్చనున్నారు. నెతన్యాహు పర్యటన సందర్భంగా మోడీ ఆదివారం రాత్రి ఆయనకు ప్రత్యేక విందు కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తారు. ఈ పర్యటనలో భాగంగా నెతన్యాహు తన స్నేహితుడు ప్రధాని మోడీకి సంచార గాల్ మొబైల్ జీపును ప్రత్యేక బహుమతిగా ఇవ్వనున్నారు. గత ఏడాది మోడీ ఇజ్రాయెల్ పర్యటనకు వెళ్లినపుడు మధ్యధరా సముద్ర తీరం వెంబడి ఈ జీపులో ఇద్దరు ప్రధానులు కాస్త దూరం ప్రయాణించారు. ఇప్పుడు అదే వాహనాన్ని ఈ పర్యటనలో నెతన్యాహు మోడీకి బహుకరించనున్నారు. ఈ వాహనం ఖరీదు దాదాపు రూ.70లక్షలు. ఈ వాహనం రోజుకు 20వేల లీటర్ల సముద్రపు నీటిని మంచినీటిగా మార్చగలదు.

ప్రొటోకాల్‌ను పక్కన పెట్టారు..

ప్రధానమంత్రి నరేంద్రమోడీ మరోసారి ప్రొటోకాల్‌ను పక్కన పెట్టారు. భారత్ పర్యటనకు వస్తున్న ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహుకు స్వాగతం పలికేందుకు మోదీ స్వయంగా విమానాశ్రయానికి వెళ్లారు. ఆదివారం మధ్యాహ్నం నెతన్యాహు ఆయన సతీమణి సారా భారత్‌లో ఆరు రోజుల పాటు పర్యటిస్తారు. ప్రొటోకాల్‌ను పక్కన పెట్టి దేశాధినేతలను రిసీవ్ చేసుకోవడానికి మోదీ వెళ్లడం ఇదేమీ తొలిసారి కాదు. సెప్టెంబరు నెలలో గుజరాత్ పర్యటనకు వచ్చిన జపాన్ ప్రధానమంత్రి షింజో అబేకి స్వాగతం పలికేందుకు కూడా మోదీ ప్రొటోకాల్‌ను పక్కన పెట్టారు. ఆయనే స్వయంగా విమానాశ్రయానికి వెళ్లి వాళ్లను ఆహ్వానించారు. భారత్‌కు వచ్చిన నెతన్యాహుతో కలిసి మోడీ ఢిల్లీలోని తీన్ మూర్తి చౌక్‌లో జరగనున్న కార్యక్రమానికి హాజరు కానున్నారు. అనంతరం ఆయన భారత విదేశాంగశాఖ మంత్రి సుష్మా స్వరాజ్‌ను కలవనున్నారు. సోమవారం రాష్ట్రపతి భవన్‌కు వెళ్లి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌తో నెతన్యాహు భేటీ అవుతారు. తర్వాత నెతన్యాహు దంపతులు ఆగ్రా వెళ్లి తాజ్ మహల్‌ను సందర్శిస్తారు. పర్యటనలో భాగంగా నెతన్యాహు ముంబయి, గుజరాత్ ప్రాంతాల్లోనూ పర్యటిస్తారు.



ఇరుదేశాల సంబంధాలను కొత్త పుంతలు తొక్కిస్తాం

- ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ

న్యూఢిల్లీ: భారత్, ఇజ్రాయెల్ మధ్య సంబంధాలను కొత్త పుంతలు తొక్కిస్తామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ ఉన్నారు. ఇండియాలో ఆరు రోజుల అధికార పర్యటనకు విచ్చేశారు. నెతన్యాహు ప్రధాని మోడీ ఇచ్చిన ఆత్మీయ స్వాగతంపై ఓ ట్వీట్‌లో సంతోషం వ్యక్తం చేశారు. 'స్వయంగా విచ్చేసి నాకు స్వాగతం పలికిన ఆప్త మిత్రుడు మోడీకి ధన్యవాదాలు. ఎయిర్‌పోర్ట్‌లో దిగగానే ఆయన ఇచ్చిన స్వాగతం నన్ను ఆశ్చర్యంలో ముంచెత్తింది. ఉభయ దేశాల మధ్య సంబంధాలను ఇద్దరం కలిసి సరికొత్త ఎత్తులకు తీసికెళ్తాం' అని ఆ ట్వీట్‌లో నెతన్యాహు పేర్కొన్నారు. మోదీ సైతం నెతన్యాహు భారత్‌లో పర్యటించడం చరిత్రాత్మకమని, ఇరు దేశాల మధ్య ఉన్న సంబంధాలు ఆయన రాకతో మరింత పరిపుష్టమవుతాయని ఆశిస్తున్నానని ట్వీట్ చేశారు.

మరికొన్ని హగ్స్ చూడబోతున్నాం: కాంగ్రెస్

నెతన్యాహును మోడీ గాఢ లింగనం చేసుకోవడంపై కాంగ్రెస్ తన అఫీషియల్ ట్విట్టర్లో 'హగ్ డిప్లొమసీ' అంటూ ఓ వీడియోను పోస్ట్ చేసింది. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు భారత్ రాకతో పిఎం మోడీ నుంచి మరిన్ని హగ్‌లు చూడబోతున్నాం అంటూ ట్వీట్ చేసింది. దీనిపై బిజెపి మండిపడింది. ఒక విదేశీ ప్రముఖుడు దేశంలోకి అడుగుపెట్టిన వేళ ప్రధానిపై వ్యంగ్య వ్యాఖ్యలు చేయడం సరికాదంది.



శబరిమలలో మకరజ్యోతి దర్శనమిచ్చింది. ఈ జ్యోతిని దర్శించుకున్న భక్తజనం పులకించిపోయారు. మకరజ్యోతి దర్శనానికి లక్షల సంఖ్యలో భక్తులు శబరిమలకు పోటెత్తారు. రద్దీ దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. మకరజ్యోతి దర్శనం సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అయ్యప్ప నామస్మరణలతో శబరిగిరులు మార్మోగాయి.

– శబరిమల

విదేశాలకు వెళ్తే రెండో తరగతి పౌరులా?

- కేంద్రంపై రాహుల్ ఆగ్రహం



న్యూఢిల్లీ: బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మరోసారి విరుచుకుపడ్డారు. ఇకపై పాస్‌పోర్టుల చివరి పేజీలో చిరునామా వివరాలు తెలియజేయకుండా ఖాళీగా వదిలివేయాలని విదేశాంగ మంత్రిత్వశాఖ తీసుకున్న నిర్ణయం అమల్లోకి వస్తే పాస్‌పోర్టులు అడ్రస్‌ప్రూఫ్‌లుగా పనికి రావన్న వార్తలపై రాహుల్ తీవ్ర స్థాయిలో స్పందించారు. అధికార పార్టీ ఇలాంటి నిర్ణయం తీసుకోవడం ప్రజల పట్ల చూపుతున్న వివక్షతకు అద్దం పడుతోందని విమర్శించారు. అదే విధంగా భారత్ నుంచి విదేశాలకు వలస వెళ్లే వారిని రెండవ తరగతి పౌరులుగా చూస్తుందని రాహుల్ మండిపడ్డారు. విదేశాలకు వెళ్లే వారి పట్ల కేంద్రం ఈ విధంగా వ్యహరించడం పూర్తిగా ఆమోదయోగ్యం కాదన్నారు. ఈ మేరకు రాహుల్ ఆదివారం ట్వీట్ చేశారు. ఇదిలా ఉండగా, ఇక మీదట పాస్‌పోర్టులో చివరి పేజీలో కార్డు హోల్డర్ తండ్రిపేరును గానీ, సంరక్షకుడి పేరును గానీ, తల్లి లేదా భార్య పేరు, ఇంటి చిరునామాను ముద్రించ కూడదని భారత విదేశంగ శాఖ నిర్ణయం తీసుకుంది.

సిపిఐ(ఎం) ఎంఎల్‌ఎ రామచంద్రన్ కన్నుమూత



తిరువనంతపురం: సిపిఐ(ఎం) నాయకు డు, చెంగన్నూర్ ఎంఎల్‌ఏ కెకె రామచంద్రన్ (65) కన్నుమూశారు. కాలేయ వ్యాధికి చికిత్స పొందుతున్న ఆయన ఆదివారం తెల్లవారుజామున చెన్నైలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో మృతి చెందినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. 2016లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో చెంగన్నూర్ నియోజకవర్గ వర్గం నుంచి బరిలోకి దిగి గెలుపొంది శాసనసభ్యుడిగా ఎన్నికయ్యారు. ఆ ఎన్నికల్లో తన ప్రత్యర్థి అయిన కాంగ్రెస్ సిట్టింగ్ సభ్యుడు పిసి విష్ణునాథ్‌పై విజయం సాధించారు. 2001లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఇదే నియోజకవర్గం నుంచి పోటీ శోభనా జార్జ్‌పై గెలుపొందారు. అదే విధంగా న్యాయవాది అయిన రామచంద్రన్ చెంగన్నూర్ బార్ కౌన్సిల్ అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. ఇదిలా ఉండగా, రామచంద్రన్ మృతదేహాన్ని సాయంత్రం కేరళ రాజధాని తిరువనంతపురానికి తరలించారు. సోమవారం ఆయన అంత్యక్రియలను నిర్వహించనున్నారు. కేరళ సిఎం పినరయ్ విజయన్, స్పీకర్ పి. శ్రీరామకృష్ణ, సిపిఐ నేత కన్నం రాజేంద్రన్ తదితరులు రామచంద్రన్ మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతి

జైపూర్ : రాజస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆదివారం భరత్‌పూర్ జిల్లాలో ఓ వాహనం టయర్ పేలి బోల్తా పడింది. ఈ ఘటనలో ముగ్గురు మహిళలు సహా ఐదుగురు దుర్మరణం పాలయ్యారు. మరో ఐదుగురికి గాయాలైనట్లు పోలీసు అధికారులు వెల్లడించారు. బాధితులు కరౌలి హిండౌన్ పట్టణం నుంచి భరత్‌పూర్‌కు వెళ్తుండగా ఈ ప్రమాదం వాటిల్లినట్లు వారు పేర్కొన్నారు. క్షతగాత్రులను స్థానిక ఆసుపత్రికి తరలించామన్నారు. అందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు వివరించారు.

లాలూ కోసం 'దహీ చుర్రా'

రాంచీ: దాణా కుంభకోణం కేసులో బిర్సాముండా జైలులో శిక్ష అనుభవిస్తున్న బిహార్ మాజీ ముఖ్యమంత్రి, ఆర్‌జెడి అధినేత లాలూప్రసాద్ యాదవ్‌కు ఇష్టమైన 'దహీ చుర్రా'ను ఆయన మద్దతుదారులు తీసుకొచ్చారు. మకర సంక్రాంతి సందర్భంగా ప్రత్యేకంగా తయారుచేసే ఈ మిఠాయి ఆయనకెంతో ఇష్టమైనది. దీంతో తమ అధినేతకు ప్రీతిపాత్రమైన ఈ దహీ చుర్రాను కార్యకర్తలు జాగ్రత్తగా ప్యాక్ చేసి జైలుకు తీసుకొచ్చారు. దాణా కుంభకోణం కేసులో లాలూకు మూడున్నరేళ్ల జైలు శిక్ష పడిన విషయం తెలిసిందే. అయితే, విచారణ సందర్భంగా లాలూను కలిసేందుకు కేవలం ముగ్గురే రావాలంటూ ఈ నెల 10న సిబిఐ న్యాయమూర్తి ఆదేశించడంతో దాన్ని పునరాలోచించాలని లాలూ కోరారు. అదే సమయంలో 'సంక్రాంతి పండుగ వస్తోంది. మా ఇంట్లో దహీ చుర్రా (స్వీట్)తో అట్టహాసంగా పండుగ చేసుకుంటాం. కాని మీరు కేవలం ముగ్గురే వచ్చేందుకు అవకాశం కల్పించారు. ఒక్కసారి పునరాలోచించండి. ఆ అధికారం మీకు ఉంది' అని లాలూ కోరారు. దీనికి న్యాయమూర్తి శివపాల్ సింగ్ స్పందిస్తూ.. 'ఆ దహీ చుర్రా నీకు అందేలా చూస్తాలే. కాని ముగ్గురి కంటే ఎక్కువమంది సందర్శకులను మాత్రం లోపలికి అనుమతించేది లేదు' అని స్పష్టంచేసిన సంగతి తెలిసిందే.

సుప్రీంలో ఎనిమిది అంశాలపై విచారణ

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి నలుగురు సీనియర్ న్యాయమూర్తులకు మధ్య సంఘర్షణ నెలకొన్న తరుణంలో రాజ్యాంగ ధర్మాసనం జనవరి 17న ఎనిమిది అంశాలపై విచారణ నిర్వహించనుంది. ఈమేరకు సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో సమాచారముంచిన అత్యున్నత న్యాయస్థానం కార్యనిర్వాహక వర్గం ఆ ధర్మాసనంలో సభ్యులుగా ఎవరుంటారన్నది మాత్రం పొందుపర్చలేదు. ఆధార్ చెల్లుబాటుపై 2017 జనవరిలో దాఖలైన వ్యాజ్యంతోపాటు స్వలింగసంపర్కులపై 2013లో ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యం, శబరిమల అయ్యప్ప ఆలయంలోకి 10 నుంచి 50ఏళ్లలోపు మహిళల నిషేధాన్ని సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యాలను రాజ్యాంగ ధర్మాసనం విచారించనుంది. వీటితోపాటు వివాహం ద్వారా మరో మహిళతో సంబంధం కలిగిన పురుషులకు మాత్రమే శిక్ష విధించాలని చెప్పే చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యంసహా క్రిమినల్ నేరాల్లో విచారణ ఎదుర్కొంటున్న ప్రజాప్రతినిధి ఎలాంటి పరిస్థితిలో పదవికి అనర్హుడవుతాడన్న అంశంపై కూడా సుప్రీంకోర్టు విచారణ చేపట్టనుంది. వీటితో పాటు మరికొన్ని అంశాలపై విచారణ నిర్వహించనుండగా సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

విమాన ఛార్జీలను మించిన బస్సు ఛార్జీలు



- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు

హైదరాబాద్: పండుగ వచ్చిందంటే రవాణా రంగానికి 'పండుగే'.. ప్రైవేటు ట్రావెల్స్ వాళ్లే కాదు ప్రభుత్వ రంగ సంస్థలు కూడా స్పెషల్స్ పేరుతో ప్రయాణికుల జేబులు గుల్ల చేస్తున్నాయి. సంక్రాంతి పండుగ నాడయినా సొంత వారితో గడుపుదామని స్వస్థలాలకు తరలివచ్చే ప్రయాణికులు స్పెషల్ ఛార్జీల పేరిట నిలువు దోపిడీకి గురవుతున్నారు. ఇక ప్రయివేట్ ట్రావెల్స్ యాజమాన్యాలు బస్సు ఛార్జీలను అమాంతం పెంచేసి ఎయిర్ బస్సుల ఛార్జీలను మించేలా చేస్తున్నారు. అటు ఆర్టీసీ కూడా ప్రైవేట్ ట్రావెల్స్‌కు ఏమాత్రం తీసిపోకుండా తన వంతు తాను భారీగానే దోచుకుంటోంది. రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయంలో ఏమాత్రం జోక్యం చేసుకోకపోవడంతో ప్రయాణికులు నిలువు దోపిడీకి గురవుతున్నారు. విధి లేని పరిస్థితుల్లో భారమైనా అత్యధిక ధరలకు టికెట్లు కొని ఉసూరు మోహాలతో ప్రయాణాలు చేస్తున్నారు. బస్సు ఛార్జీలా...లేక...ఎయిర్ బస్సు ఛార్జీలా... హైదరాబాద్ నుంచి విజయనగరం వెళ్లాలంటే 3 వేల రూపాయలు...వైజాగ్ వెళ్లాలన్నా అంతే...ఇక రాజమండ్రికి రూ.2వేలు భీమవరానికి రూ.1600... ఏలూరుకు రూ. 2వేలు వసూలు చేస్తున్నారు. ఈ రేట్లు హఠాత్తుగా చూస్తే ఏమనిపిస్తోంది... ఊళ్ల పేర్లు లేకపోతే ఎవరైనా ఇవి ఖచ్చితంగా ఫ్లయిట్ ఛార్జీలే అనుకునేలా ఉన్నాయి... పట్టనట్లు ప్రభుత్వాలు...అనుమానాలు... పండగ వేళ ప్రయివేట్ ఆపరేటర్లతో పాటు ఆర్టీసీ సంస్థల స్పెషల్ బాదుడుకు అడ్డుకట్ట వేయాల్సిన తెలుగు సర్కార్లు పట్టనట్లు ఉండటమే ప్రయాణికులకు బాధ కలిగిస్తోంది. బస్సు ఛార్జీల ధరలు ఇంతలా పెంచినా వాటి నియంత్రణపై ప్రభుత్వాలు దృష్టి పెట్టకపోవడం అనుమానాలకు తావిస్తోంది. కనీసం ఇప్పటివరకు రవాణా అధికారులతో ఒక్క సమావేశం కూడా నిర్వహించలేదు. బస్సుల దోపిడీపై దృష్టి సారించలేదు. స్పెషల్ రైళ్లలో...స్పెషల్ బాదుడు సంక్రాంతి పండుగ సందర్భంగా రైల్వే శాఖ ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసింది. అయితే గమ నించాల్సిన విషయం ఏమిటంటే...సాధారణ రైళ్ల కంటే ఈ రైళ్లలో ఛార్జీలు అధికంగా ఉంటాయి. విమాన ప్రయాణికులకు కూడా...పం డుగ ఛార్జీల సెగ... అయితే బస్సులు, రైళ్లే కాదు, విమానాల ఛార్జీలు కూడా విపరీతంగా పెంచేయడమే ఈసారి విపరీత పరిణామం. పండగ సీజన్‌ను క్యాష్ చేసుకునేందుకు ఎయి ర్‌లైన్స్ సంస్థలు టికెట్ల రేట్లను ఏకంగా 4 రెట్లు పెంచేశాయి. అన్ని విమాన ఛార్జీ రేట్లు ఇంచుమించు ఇ లాగే ఆకాశాన్ని అంటుతున్నాయి. మామూలు రోజుల్లో హైదరాబాద్, వైజాగ్, రాజమండ్రికి వెళ్లే ఫ్లైట్స్ 3వేల నుంచి 3వేల 500 ఉంటే ఇప్పుడు కనీసం 15వేల నుంచి 17వేలకు పెంచేశారు. అలాగే హైదరాబాద నుంచి విజయవాడ, తిరుపతి ఛార్జీలు మామూలు రోజుల్లో 2వేల 500 నుంచి 3 వేలు ఉంటే ప్రస్తుతం 10 వేల నుంచి 12 వేలు చేసేశారు. ఈ దారుణ దోపిడీ పట్ల ప్రయాణికులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు.

తవ్వేకొద్దీ వెలుగులోకి అక్రమ ఆస్తుల చిట్టా!

- శశికళ కుటుంబ సభ్యుల పన్నుల ఎగవేత
- రూ.5 వేల కోట్లుగా అంచనా

చెన్నై: శశికళ కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని ఆదాయపు పన్నుశాఖ అధికారులు ఏకకాలంలో భారీ స్థాయిలో సోదాలు నిర్వహించి నెలలు గడుస్తున్నా దాని తాలూకు ప్రకంపనలు మాత్రం సద్దుమణగలేదు. చేతికి దొరికిన ఆధారాల మేరకు దర్యాప్తు జరుపుతున్న ఆదాయపు పన్ను అధికారులకు తవ్వేకొద్దీ అక్రమ ఆస్తుల చిట్టా వెలుగులోకి వస్తూనే ఉంది. దీని ద్వారా పన్ను ఎగవేత రూ.5 వేల కోట్లకు చేరుకోవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఇది ఐటీ అధికారులనే దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. అన్నాడీఎంకే అధినేత్రి, దివంగత ముఖ్యమంత్రి జయలలిత నెచ్చెలి శశికళ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని గత ఏడాది నంబరు 9న ఏకకాలంలో పలుచోట్ల ఐటీ సోదాలు జరిగిన విషయం తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా 215 ప్రాంతాల్లో ఈ సోదాలు జరగ్గా అందులో చెన్నైలోనే 115 ప్రాంతాలు ఉన్నాయి. 13వ తేదీ వరకు అయిదు రోజులు జరిగిన ఈ సోదాల్లో రూ.1,450 కోట్ల మేర పన్ను ఎగవేసినట్లు ప్రాథమికంగా గుర్తించారు. తర్వాత జయలలిత నివాసమైన చెన్నై పోయెస్ గార్డెన్‌లోని వేద నిలయంలో సోదాలు జరిపి కంప్యూటరు హార్డ్ డిస్కులు, ఆస్తుల పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. 20పైగా డొల్ల కంపెనీలు ఏర్పాటుచేసి వాటిద్వారా రూ.కోట్లలో నగదు బదలాయింపులు జరిగిన ఆధారాలను కూడా ఐటీ అధికారులు అప్పట్లో స్వాధీనం చేసుకున్నారు. వీటి ఆధారంగా ప్రస్తుతం ముమ్మరంగా దర్యాప్తు జరుపుతున్నారు. రెండు నెలలుగా ఈ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. వాటి ఆధారంగానే వివేక్, కృష్ణప్రియ, షకీల, పూంగుండ్రన్ తదితర పలువురిని ఐటీ అధికారులు విచారిస్తున్నారు. జయలలిత నివాసంలో స్వాధీనం చేసుకున్న పత్రాల ద్వారా పలు కీలక సమాచారం లభించినట్లు వినికిడి. శశికళ, ఇళవరసి, బంధువు కలియపెరుమాళ్ పేరిట చాలా ఆస్తులు ఉన్నట్లు గుర్తించారు. ఇప్పటివరకు పన్ను ఎగవేత రూ.4,600 కోట్ల వరకు ఉన్నట్లు తేల్చారు. అలాగే లెక్కల్లోకి రాని అనేక ఆస్తులు, ఇతర పెట్టుబడులు కూడా వెలుగులోకి వచ్చాయి. తవ్వే కొద్దీ అక్రమాస్తులు, పన్ను ఎగవేత వెలుగులోకి వస్తుండటం ఐటి దర్యాప్తు అధికారులను సైతం నివ్వెరపరుస్తోంది.



రన్‌వే నుంచి సముద్రం వైపునకు దూసుకెళ్లిన విమానం

అంకారా: ఏకంగా 162 మంది ప్రయాణికులతో వెళ్తున్న విమానం రన్‌వే నుంచి జారి పక్కనే ఉన్న సముద్రం వైపు దూసుకెళ్లింది. ఈ ఘటన టర్కీ రాజధాని అంకారాలో చోటుచేసుకుంది. టర్కీలోని ట్రాబ్జాన్ ఎయిర్‌పోర్ట్ నుంచి బయలుదేరిన బోయింగ్ 737800 విమానం రన్‌వేపై మంచు ఎక్కువగా ఉండడంతో అదుపు తప్పి పక్కకు జారిపోయింది. దాంతో రన్‌వేకు సమీపంలోని నల్ల సముద్రం వైపు దూసుకెళ్లింది. అదృష్టం బాగుండి విమానం పూర్తిగా సముద్రంలోకి జారిపోకుండా కొండ అంచున మట్టిలో ఇరుక్కుపోవడంతో పెను ప్రమాదం తప్పింది. వెంటనే గమనించిన ఎయిర్‌పోర్ట్ అధికారులు ముందుగా విమానంలోని మహిళల్ని, పిల్లల్ని జాగ్రత్తగా బయటికి తరలించారు. ఆ తరువాత విమానాన్ని బయటికి తీసి మరమ్మతులు చేశారు. విమానం సముద్రంలోకి పడిపోతున్నప్పుడు తీసిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు.

ప్ర'యోగ'మేదీ..?

• ప్రాక్టికల్స్ చేయకుండానే పరీక్షలకు • ఫిబ్రవరి 1 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

మనతెలంగాణ/హైదరాబాద్ : ప్రైవేట్, ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు ప్రాక్టికల్స్ చేయకుండానే ప్రాక్టికల్ పరీక్షలకు హాజరయ్యే పరిస్థితి నెలకొంది. రాష్ట్ర వ్యాప్తంగా ఫిబ్రవరి 1 నుంచి 21 వరకు ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు జరుగనున్నాయి. రాష్ట్రంలోని జూనియర్ కళాశాలల్లో ఎక్కువగా థియరీపైనే దృష్టి సారించి, ప్రాక్టికల్స్‌ను విస్మరించారన్న విమర్శలు ఉన్నాయి. కొన్ని కాలేజీల్లో అవసరమైన సామాగ్రి లేకపోవడం, మరికొన్నింటిలో నేర్పించే సిబ్బంది లేకపోవడంతో విద్యార్థులు ప్రాక్టికల్స్‌కు దూరం కావాల్సిన పరిస్థితి నెలకొనింది. ''ఇంటర్ విద్యార్థులకు పిప్పెట్, బ్యూరెట్ అంటే ఏంటో తెలియడం లేదు'' అని ఇటీవల జరిగిన ఓ బహిరంగ సమావేశంలో సాక్షాత్తు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి అన్నారంటే కళాశాలల్లో ప్రాక్టికల్స్ నిర్వహణ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.


విద్యార్థుల్లో కొరవడుతున్న శాస్త్రీయ పరిజ్ఞానం : కొత్త ఆవిష్కరణలకు విద్యార్థి దశలోనే పునాదులు పడాల్సి ఉంటుంది. అందుకోసం ఇంటర్‌లో సైన్స్ గ్రూపులు చదివే విద్యార్థులకు ప్రయోగాత్మక విద్యను బోధిస్తారు. ప్రైవేట్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సరిపడా అధ్యాపకులు, ప్రయోగశాలలు లేకపోవడం విద్యార్థులకు శాపంగా మారుతుంది. కొన్ని కళాశాలల ప్రయోగశాలల్లో పరికరాలు, రసాయనాలు ఉన్నా యాజమాన్యాల నిర్లక్ష్యం వల్ల విద్యార్థులకు ప్రయోగాలు నిర్వహించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. మరికొన్నింటిలో ప్రయోగశాలలు కేవలం అలంకారప్రాయంగా ఉంటున్నాయి.



ప్రాక్టికల్స్ మార్కులే కీలకం : ర్యాంకుల పరుగుపందెంలో ప్రాక్టికల్స్ మార్కులు కీలకం. ఇంటర్ ప్రాక్టికల్స్‌లో ఎంపిసి విద్యార్థులకు 60 మార్కులు, బైపిసి వారికి 120 మార్కులు ఉన్నాయి. ఒక్క మార్కు తేడాతోనే ర్యాంకులు తారుమరవుతుంటాయి. దాంతో ర్యాంకుల పోటీలో ప్రతి మార్కూ కీలకమవుతోంది. ఇంటర్ మార్కులకు ఎంసెట్‌లో వెయిటేజి ఉండటంతోపాటు ఇంటర్‌లో 75 శాతం మార్కులు వస్తేనే జెఇఇకి అర్హత ఉండటంతో నామమాత్రంగా పరీక్షలు నిర్వహించి అధిక మార్కులు వేసుకునేలా కార్పొరేట్ యాజమాన్యాలు ఏర్పాట్లు చేసుకుంటున్నాయి.

జంబ్లింగ్‌పై వెనుకడుగెందుకు..? : జంబ్లింగ్ విధానంలో ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణ ఏటా వాయిదా పడుతూ వస్తోంది. ఈ విధానంపై ఏటా ఆఖరి నిమిషం వరకు టెన్షన్ పెట్టి... చివరి నిమిషంలో ఈ ఏడాది జంబ్లింగ్ విధానం లేదని ఇంటర్ బోర్డ్ ప్రకటిస్తుంటుంది. సుమారు దశాబ్దకాలానికిపైగా ఇదే తంతు కొనసాగుతోంది. కార్పొరేట్ కళాశాలల ఒత్తిడికి తలొగ్గి ఏదో ఒక సాకుతో బోర్డ్ ఏటా వాయిదా వేస్తోందన్న ఆరోపణలున్నాయి. ప్రాక్టికల్స్‌లో ఫుల్ మార్కులు వేయించొచ్చులే అన్న ధీమా ఈ కళాశాలలు నామమాత్రంగానే ప్రయోగాలు నిర్వహిస్తున్నారు. కళాశాలల్లో మాస్ కాపీయింగ్ నిర్వహించి తమ విద్యార్థులకు ఫుల్ మార్కులు వేసుకుంటున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.సొంత కళాశాలలో కాకుండా జంబ్లింగ్ విధానంలో ఇతర కాళాశాలల్లోకి వెళ్లే తమ విద్యార్థులకు ఇష్టారాజ్యంగా మార్కులు వేసుకునే అవకాశం ఉండదు. ఈ నేపథ్యంలో జంబ్లింగ్ విధానం అమలైతే తమ విద్యార్థులకు ప్రాక్టికల్స్‌లో మార్కులు తగ్గే అవకాశం ఉంటుందని భావిస్తున్న కార్పొరేట్ యాజమాన్యాలు జంబ్లింగ్‌కు అడ్డు పడుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రావత్ వ్యాఖ్యలు రెచ్చగొడుతున్నాయి



పాకిస్థాన్: భారత ఆర్మీ చీఫ్ బిపిన్ రావత్ వ్యాఖ్యలపై పాకిస్థాన్ స్పందించింది. రావత్ అన్న మాటలు అణు యుద్ధానికి దారితీసేలా ఉన్నాయని హెచ్చరించింది. శుక్రవారం ఆర్మీ చీఫ్ బిపిన్ రావత్ పాక్ గురించి మాట్లాడుతూ.. అణ్వాయుధాలు ఉన్నాయని పాకిస్థాన్ బుకాయిస్తోందని, పాకిస్థానీయులను ఎదుర్కొనడానికి తమకు ఒక అవకాశమిస్తే వారికి సరైన సమాధానమిస్తామని విమర్శించారు. దీనికి పాక్ విదేశాంగ మంత్రి ఖ్వాజా మహమ్మద్ అసీఫ్ స్పందిస్తూ 'భారత్ మా శక్తిని పరీక్షించాలనుకుంటోంది. ప్రయత్నించి చూడండి. మా సత్తా ఏంటో మీకే తెలుస్తుంది. తూర్పు ప్రాంతాల నుంచి వచ్చే బెదిరింపులను ఎదుర్కోవడానికి మా వద్ద అణ్వాయుధాలు ఉన్నాయి. రావత్ వ్యాఖ్యలు అణు యుద్ధానికి దారి తీసేలా ఉన్నాయి' అన్నారు. మరోపక్క పాకిస్థాన్‌కు మరో షాక్ ఇచ్చేందుకు భారత్ సిద్ధమవుతోంది. భారత్‌కు చెందిన అణు క్షిపణి అగ్ని5ను పరీక్షించేందుకు సన్నహాలను ముమ్మరం చేసింది. అన్నీ అనుకూలంగా ఉంటే ఈ నెల 18, 19 తేదీల్లో అగ్ని క్షపణిని పరీక్షించవచ్చని నిపుణులు భావిస్తున్నారు.

పోర్చుగల్‌లో భారీ అగ్ని ప్రమాదం

ఎనిమిది మంది మృతి, 50 మందికి గాయాలు

లిస్బన్ : ఉత్తర పోర్చుగల్‌లో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. శనివారం అర్ధరాత్రి ఉత్తర పోర్చుగల్‌లోని ఓ స్థానిక కమ్యూనిటీ కేంద్రంలో మంటలు వ్యాపించాయి.ఈ ఘటనలో ఎనిమిది మంది మృత్యువాత పడ్డారు. మరో 50మంది క్షతగాత్రులయ్యారని పోలీసులు తెలిపారు. దాదాపు 70 మంది ఆ భవనంలో భోజనం చేస్తుండగా అగ్నిప్రమాదం వాటిల్లిందని పౌర రక్షణ ముఖ్య అధికారి పౌలో సౌంటూస్ మీడియాకు వెల్లడించారు. తీవ్రంగా గాయాలైన వారికి హెలికాప్టర్ ద్వారా ఆసుపత్రికి తరలించామన్నారు. పోర్చుగల్‌లోన ప్రసిద్ధి చెందిన ఆట 'సుకా' టోర్నమెంట్ జరుగుతుండగా బాధితులంతా ఆట ఆడేందుకు అక్కడికి వెళ్లారని తొండెల మేయర్ జోష్ ఆంటోనియా ఆ ఆదేశి అధికారిక టెలివిజన్‌లో వివరించారు.వారంతా ఒక సామూహికంగా భోజనం చేస్తుండగా కట్టెల పొయ్యి నుంచి పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయన్నారు. మంటలు ఒక్కసారిగా ఇరువైపులా వ్యాపించడంతో ప్రమాద తీవ్రత పెరిగిందన్నారు. సమాచారం అందుకున్న వెంటనే ఘటనాస్థలికి చేరుకొని గంట వ్యవధిలోనే మంటలను అదుపు తెచ్చినట్లు తొండెల అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

ఇల్లు కాలిపోతుంటే సెల్ఫీ తీసుకున్నారు



బీజింగ్: మనం నివసించే ఇల్లు మంటల్లో కాలిపోతుంటే ఏం చేస్తాం? అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడమో లేకపోతే మనమే నీళ్లు పోసి మం టలు ఆర్పడమో చేస్తాం. కానీ పై ఫొటో లో కన్పిస్తున్న దంపతులు మాత్రం కాలిపోతున్న తమ ఇంటి ముందు సెల్ఫీ తీసుకున్నారు. దక్షిణ చైనాలోని గుయిలిన్ ప్రాంతంలో చోటుచేసుకుంది ఈ ఘటన . శనివారం చెంగ్ అనే వ్యక్తి ఇంట్లో ఉన్నట్లుండి మంటలు వ్యాపించాయి. ఆ సమయంలో చెంగ్ బాత్రూమ్‌లో ఉండడంతో పొగలు గమనించి వెంటనే మంటలు ఆర్పేందుకు యత్నించాడు. వారికి పక్కింటి వారు కూడా సాయం చేశారు. అప్పటికే ఇల్లు సగం తగలబడిపోయింది. దాంతో చెంగ్ తన భార్యతో కలిసి కాలిపోయిన తన ఇంటి ముందు సెల్ఫీ తీసుకున్నాడు. మసిగా మారిన తన ఇంటిని వీడియో తీసి సోషల్‌మీడియాలో పోస్ట్ చేయడంతో వైరల్‌గా మారింది. వీడియో పోస్ట్ చేసిన కొద్ది సేపటికే పది మిలియన్ వ్యూస్ వచ్చాయి. కొందరు నెటిజన్లు వీరిని ఫన్నీ కపుల్ అంటూ కామెంట్స్ పెడుతుంటే మరికొందరు బీమా డబ్బుల కోసం కావాలనే ఇంటికి నిప్పు పెట్టి నాటకం ఆడారని ఆరోపిస్తున్నారు.

సంక్రాంతి సంబురాల్లో మంత్రి సిద్ధా

ప్రకాశం: జిల్లా వ్యాప్తంగా సంక్రాంతి సంబురాలు అంబరాన్నంటాయి. చిన్నపెద్ద తేడా లేకుండా అందరూ భోగి మంటల వెలుగులో సందడి చేశారు. ఒంగోలులోని లాయరుపేటలోని సాయిబాబా గుడి వద్ద లాయన్స్ క్లబ్ ఆఫ్ సిటిజెన్స్ ఆధ్వర్యంలో భోగి సంబరాలు నిర్వహించారు. ఈ సంబురాల్లో మంత్రి సిద్ధా రాఘవరావు కుటుంబసభ్యులతో కలిసి పాల్గొన్నారు. భోగి మంటల్ని వెలిగించి సంక్రాంతి సంబురాల్ని మంత్రి ప్రారంభించారు. సంప్రదాయ వేషాధారణతో కోలాటం ఆడి భోగి పండుగను సరదాగా జరుపుకున్నారు.

శ్రీబాలసాయి బాబా జన్మదిన వేడుకలు

కర్నూలు: నగరంలోని శ్రీ నిలయంలో భగవాన్ శ్రీబాలసాయి బాబా జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో కేంద్ర మంత్రి ఉపేంద్ర కుశాల్, రాజ్యసభ సభ్యుడు టిజి వెంకటేష్, ఎమ్మెల్సీ కేఈ ప్రభాకర్, ఎమ్మెల్యేలు ఎస్వీ మోహన్ రెడ్డి, మణిగాంధీ తదితరులు పాల్గొన్నారు. అలాగే దేశ, విదేశాలకు చెందిన భక్తులు కూడా పాల్గొన్నారు. కాగా జన్మదిన వేడుకల సందర్భంగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. అంతేగాకుండా మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. అలాగే దివ్యాంగులకు మూడు చక్రాల సైకిళ్లు అందజేశారు.

1.25లక్షల ఆవు పిడకలతో భోగి మంట

అమరావతి: సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటే విధంగా విజయవాడ కృష్ణలంకలో ఏపిఆర్‌ఎం పాఠశాలలో సేంద్రియ పదార్థం అయిన ఆవు పేడతో చేసిన సుమారు లక్షా పాతిక వేల పిడకలతో భోగి మంటలను వేశారు. ఆవు పిడకలతో సనాతన సంప్రదాయాలను గుర్తుకు తెచ్చే విధంగా భోగి మంటల కార్యక్రమాన్ని అమరావతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ దేవాదాయశాఖ మంత్రి మాణిక్యాలరావు ముఖ్యఅతిధిగా విచ్చేశారు. ఆయన చేతుల మీదుగా ఆవు నేతితో భోగిమంటలను వెలిగించారు. ఆవు వల్ల ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని, ఆవుతో ఆరోగ్యకరమైన సేంద్రియ వ్యవసాయం చేస్తే, అటు భూమి ఇటు ప్రజానీకం ఆరోగ్యంగా ఉంటారని మంత్రి మాణిక్యాలరావు చెప్పారు. ఆవు పిడకలతో వేసే భోగి మంటల వల్ల ప్రకృతిలోని వాతావరణ కాలుష్యం తొలగిపోతుందని, ప్రజలకు ఆరోగ్యం సమకూరుతుందని చెప్పారు. ఈ సందర్భంగా ఇక్కడి మైదానంలో హరిదాసులు, గంగిరెద్దుల సందడి నెలకొంది. మంత్రి మాణిక్యాలరావు చేతుల మీదుగా హరిదాసులను, గంగిరెద్దుల వారిని సత్కరించారు. చిన్నా పెద్ద అనే తేడా లేకుండా అందరూ ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ముఖ్యంగా యువత భోగి మంటల దృశ్యాలతో సెల్ఫీలు దిగారు. ఈ కార్యక్రమం తమకు ఎంతో స్ఫూర్తిని ఇచ్చిందని యువత చెప్పారు.





చర్చిని డైనమైట్‌తో పేల్చేసిన చైనా

హాంకాంగ్ : దేశంలోని ప్రముఖ ఎవలంజికల్ చర్చిను చైనా ప్రభుత్వం డైనమైట్ బాంబుతో నేలకూల్చింది. దీంతో పలు క్రిస్టియన్ సంఘాలు చైనా ప్రభుత్వంపై విరుచుకుపడ్డాయి. మత స్వేచ్ఛ, మానవ హక్కులపై చైనా ప్రభుత్వానికి ఏ మాత్రం గౌరవం లేదని అన్నాయి. షాంగ్జీ ప్రావిన్సులో గల ది గోల్డెన్ ల్యాంప్‌స్టాండ్ చర్చి అత్యంత పురాతనమైనది. అధ్యాత్మిక జీవనాన్ని నియంత్రించేందుకు చైనా కంకణం కట్టుకుంది. ఇందులో భాగంగానే కొద్దిరోజులుగా చర్చిలను నేలకూల్చుతోంది. అయితే, చర్చిల వరుస కూల్చివేతల వెనుక చైనా ప్రభుత్వ భయాందోళనలు ఉన్నట్లు తెలుస్తోంది. పాశ్చాత్య దేశాల సంస్కృతికి చెందిన క్రైస్తవ మత వ్యాప్తి దేశంలో జరిగితే భవిష్యత్‌లో కమ్యూనిస్టు పార్టీ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఆందోళన చెందుతున్నట్లు సమాచారం. ఈ కారణాన్ని పైకి చూపకుండా అధ్యాత్మికతపై నియంత్రణ పేరుతో క్రైస్తవ మతాన్ని కూకటివేళ్లతో పెకలించేందుకు చైనా ప్రభుత్వం యత్నిస్తోంది.

మహిళను రెండుసార్లు ఢీకొన్న కారు

బీజింగ్: చైనాలో షాకింగ్ ప్రమాదం ఒకటి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఓ మహిళ రోడ్డు దాటుతుండగా వెనుక నుంచి వచ్చిన కారు కొన్ని సెకెన్ల వ్యవధిలోనే ఆమెపైకి రెండుసార్లు దూసుకెళ్లడం అందరినీ షాకింగ్‌కు గురిచేసింది. చైనాలోని లియాన్‌యంగాంగ్‌లో డిసెంబర్ 27న జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. నాన్ అనే మహిళ రోడ్డు దాటుతుండగా ఆమెను ఓ కారు ఢీకొట్టింది. దీంతో డ్రైవర్ కారు నుంచి కిందకు దిగి మరికొందరి సహాయంతో వాహనాన్ని పైకి లేపి ఆమెను కాపాడారు. ఇది జరిగిన రెప్పపాటులోనే మళ్లీ అదే కారు నాన్‌పైకి దూసుకెళ్లిపోయింది. డ్రైవర్ హ్యాండ్ బ్రేక్ వేయకపోవడంతో కారు మరోసారి ఆమెపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో బాధితురాలికి తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను ఆస్పత్రిలో చేర్పించగా ప్రాణాపాయం ఏమీ లేదని వైద్యులు తెలిపారు. అత్యంత రద్దీగా ఉండే రహదారిలో జరిగిన ఈ ప్రమాదానికి చెందిన వీడియో ప్రస్తుతం సామాజికమాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

పెరూలో భూకంపం.. సునామీ హెచ్చరిక జారీ

లిమా : పెరూలో ఆదివారం భూకంపం సంభవించింది. భూకంప లేఖినిపై 7.3 తీవ్రతతో ప్రకంపనలు నమోదైనట్లు అమెరికా జియోలాజికల్ సర్వే అధికారులు ధ్రువీకరించారు. పుక్వియో నగరానికి 124 కి.మీ దూరంలో ఈ భూకంపం సంభవించింది. ఒక్కసారిగా భూమి కంపించడంతో ఇళ్లలోని ప్రజలు భయభ్రాంతులకు గురై బయటకు పరుగులు తీశారు. ఈ ప్రమాదంలో ఇప్పటి వరకు ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగలేదు. భూకంపం వచ్చిన 300 కి.మీ పరిధి వరకు మాత్రమే సునామీ హెచ్చరికలు జారీ చేసినట్లు అధికారులుతెలిపారు. ప్రకంపనలు వచ్చిన ప్రదేశానికి సమీపంలో దాదాపు 10 మిలియన్ల మంది ప్రజలు నివసిస్తున్నారు.

యాసంగికి మారనున్న 'పెట్టుబడి' మార్గదర్శకాలు!



మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం వచ్చే మే నెల నుంచి అమలు చేయనున్న సీజన్‌కు ఎకరాకు రూ. 4 వేలు వ్యవసాయ పెట్టుబడి మద్ధతు పథకాన్ని వానకాలంలో మొత్తం సాగు విస్తీర్ణానికి అమలు చేయనున్నారు. పెట్టుబడి సొమ్ము మొదటిసారిగా ఇవ్వడం, పెట్టుబడి లేక సాగుకు దూరమైన రైతులందరూ ఏదో ఒక పంటను సాగు చేయాలనే ఉద్దేశంలో భాగంగా ఎకరాకు రూ.4 వేల చొప్పున మొత్తం1.42 కోట్ల ఎకరాలకు రూ. 5678 కోట్లు చెక్కుల రూపంలో రైతులకు అందివ్వనున్నారు. గడిచిన వానకాలం సీజన్‌లో 96.32 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. ఇందులో సగం విస్తీర్ణం పత్తి పంటదే. ప్రభుత్వం పెట్టుబడి సొమ్ము ఇస్తున్నందున కొంత సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. అందులో భాగంగానే వానకాలంలో వ్యవసాయానికి యోగ్యమైన సాగు భూమి ఎంత ఉంటే అంత విస్తీర్ణానికి పెట్టుబడి పథకాన్ని వర్తింపజేయనున్నారు. ఇక యాసంగి విషయానికొస్తే పరిమితులు విధించే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. వానకాలంలో దాదాపు కోటి ఎకరాలు సాగైతే యాసంగిలో సాధారణ సాగు అం చనానే 31.55 లక్షలు కావడమే కారణం.యాసంగిలో కేవలం బోర్లు, ప్రాజెక్టుల్లో నీటి ఆధారితంగా పంటలు సాగు చేస్తారు. అలాగే యాసంగి సాగుకు ముందు కురిసిన వర్షాలను బట్టి సాగు విస్తీర్ణం పెరుగుదల, తగ్గుదల ఉంటుంది. ఈ క్రమంలో వానకాలంలో ఇచ్చిన విస్తీర్ణానికే యాసంగిలో ఇచ్చే అవకాశం ఉండదని, మార్గదర్శకాలు వేరుగా ఉంటాయని ప్రభుత్వ వర్గాలు వెల్లడిస్తున్నాయి. తద్వారా ప్రభుత్వంపై ఆర్థిక భారం కూడా తొలగుతుందని చెబుతున్నారు.అయితే సిఎం కె. చంద్రశేఖర్‌రావు ప్రకటన ప్రకా రం యాసంగికి కూడా ముందస్తుగానే అక్టోబర్ నెలలోనే ఇవ్వాల్సి ఉంటుంది. అప్పటికీ ఇంకా సాగు చేసే పంటలపై స్పష్టత రాదు. ఏ రకంగా సాగు విస్తీర్ణాన్ని పరిగణనలోకి తీసుకుంటారనేది ఇంకా నిర్ణయించలేదు.మే నెలలో విజయవంతంగా చెక్కుల పంపిణీ పూర్తయిన తరువాత యాసంగిపై దృష్టి సారిస్తామని వ్యవసాయ శాఖ ఉన్నతాధికారిఒకరు 'మన తెలంగాణ'కు చెప్పారు.

శ్రీవారి సేవలో నారా, నందమూరి కుటుంబాలు



తిరుమల: తిరుమల శ్రీవారిని నారా, నందమూరి కుటుంబ సభ్యులు కలిసి దర్శించుకున్నారు. స్వగ్రామం నారావారిపల్లెలో సంక్రాంతి పండుగను జరుపుకుంటున్న ముఖ్యమంత్రి...ఈ ఉదయం సతీమణి భువనేశ్వరితో పాటు తనయుడు లోకేష్, కోడలు బ్రాహ్మణి, మనవడు దేవాన్ష్, హిందూపురం ఎమ్మెల్యే, సినీ హీరో నందమూరి బాలకృష్ణ కుటుంబం, సినీ నటుడు నారా రోహిత్ కలిసి స్వామివారి సేవలో పాల్గొన్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపానికి చేరుకున్న ముఖ్యమంత్రికి ఆలయ పండితులు వేదాశీర్వచనం పలికి శేషవస్త్రంతో సత్కరించారు. తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, జేఈవో శ్రీనివాసరాజు కలసి తీర్థ ప్రసాదాలతో పాటు... శ్రీవారి చిత్ర పటాన్ని, నూతన సంవత్సరం క్యాలెండర్, డైరీలను అందజేశారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. అలయం వద్ద బాలకృష్ణ అభిమానులు జైసింహా అంటూ నినాదాలు చేశారు.

ఒక విజన్‌తో హెరిటేజ్‌ను బాబు ప్రారంభించారు: భువనేశ్వరి

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒక విజన్‌తో 25 ఏళ్ల క్రితం హెరిటేజ్ కంపెనీని ప్రారంభించారని ఆ సంస్థ వైస్ ఛైర్మన్, ఎండీ నారా భువనేశ్వరి అన్నారు. ప్రారంభంలో ఎన్నో ఒడుదుడుకులు ఎదుర్కోవలసి వచ్చిందని అన్నారు. కష్ట సమయాల్లో కంపెనీకి అండగా ఉన్న హెరిటేజ్ కుటుంబ సభ్యులందరికీ ఆమె అభినందనలు తెలిపారు. చిత్తూరు జిల్లా చంద్రగిరిలోని గోకుల్ ఫ్లాంట్‌కి జాతీయ స్థాయిలో ఎనర్జీ కంజర్వేషన్ అవార్డులు రావడం ఆనందంగా ఉందని భువనేశ్వరి అన్నారు. 40 మంది ఉద్యోగులు, 50 మంది కార్మికులతో 1.5లక్షల లీటర్ల పాలతో హెరిటేజ్ సంస్థ ప్రారంభమైందని తెలిపారు. హెరిటేజ్‌లో మహిళలకు ఉపాధి అవకాశాలు ఎక్కువని ఆమె చెప్పారు. కష్టపడి సిన్సియర్‌గా పనిచేస్తే కంపెనీలకు అవార్డులు రావడం కష్టంకాదని భువనేశ్వరి అన్నారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, మనుమడు దేవాన్ష్, మంత్రి లోకేష్ దంపతులు హాజరయ్యారు.

షిర్ ఫర్ వరల్డ్ యూత్ లీడర్స్



మన తెలంగాణ/న్యూఢిల్లీ: ప్రపంచ సమైఖ్యత, శాంతి లక్ష్యంతో ప్రతి ఏటా జపాన్ దేశం... విదేశీ యువతీయువకులతో స్నేహపూర్వక యాత్రను చేపడుతోంది. షిర్ ఫర్ వరల్డ్ యూత్ లీడర్స్ పేరుతో నిర్వహించే ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి ఈ ఏడాది భారత్ తరపున పదిమంది యువతీయువకులు ఎంపికయ్యారు. అయితే ఈ బృందానికి మన తెలుగు తేజం, యువన్యాయవాది శ్రీతేజ కామర్సు నాయకత్వం వహించనుంది. ప్రపంచ దేశాల్లో యువ నాయకత్వ లక్షణాలను పెంపొందించడం, యువతకు ఇతర దేశాల్లోని రాజకీయ, సామాజిక, సాంస్కృతిక అంశాలపై అవగాహన కల్పించేలా ఈ కార్యక్రమాన్ని జపాన్ దేశం నిర్వహిస్తోంది. 11 దేశాలకు చెందిన 240 మంది యువతీయువకులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. జనవరి 16న బయలుదేరి వెళ్లనున్న శ్రీతేజ బృందం.. 45 రోజుల పాటు నాలుగు దేశాల్లో పర్యటించనున్నారు. టోక్యో నుంచి సిగంపూర్ మీదుగా ఫిబ్రవరి 11న 240 మంది సభ్యుల బృందం కొచ్చి చేరుకుంటుంది. అక్కడ కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్ సహా ప్రధానమంత్రి కార్యాలయ అధికారులతో యాత్ర విశేషాలు సహా, పలు అంశాలపై చర్చిస్తారు. దిల్లీ విశ్వవిద్యాలయంలో మాస్టర్ ఆఫ్ లా చేసిన శ్రీతేజ న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తునే.. లోక్ సభ రీసెర్చ్ ఫెలోషిప్ చేస్తున్నారు. తనలోని ఆలోచనలకు ఈ యాత్ర సరైనదని భావించిన శ్రీతేజ.. కేంద్ర యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖలో గతేడాది జులైలో దరఖాస్తు చేసింది. అక్టోబర్ లో ఎంపిక కావడమే కాకుండా ఆ శాఖ మంత్రి రాజ్యవర్ధన్ సింగ్ తో ముఖాముఖిలో ప్రతిభ కనబరిచి భారత తరపున వెళ్లే బృందానికి నాయకురాలిగా నిలిచింది. దేశం తరపున ఈ కార్యక్రమలో పాల్గొంటున్న 30వ బృందానికి శ్రీతేజ నేతృత్వ వహించనుంది. ఈ సందర్భంగా శ్రీతేజ మాట్లాడుతూ.... మనదేశ యువత ప్రాధాన్యతలు ప్రపంచ దేశాల ప్రతినిధులకు వివరిస్తామని చెబుతోంది. మనదేశానికి చెందిన యోగ, నృత్యాలు, సంగీత ప్రాధాన్యతను ప్రతినిధులకు తెలియజేస్తామని తెలిపింది. తమ యాత్ర ద్వారా ప్రపంచ దేశాల ఐకమత్యం, శాంతికి కృషిచేస్తామని వివరించింది. ఆయా దేశాలలో హోం స్టే ద్వారా అక్కడి సామాజిక పరిస్థితులను అధ్యయనం చేస్తామని వెల్లడించింది. అక్కడ తెలుసుకున్న విషయాలను ఇక్కడి యువతతో పంచుకుంటామని తెలిపింది. ఈ పర్యటన మొత్తం సముద్ర మార్గం లో నౌక ప్రయాణంలో ఉంటుందని శ్రీతేజ వివరించింది.



సంక్రాంతి వేళ నెల్లూరులో విషాదం

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి

నెల్లూరు(విఆర్‌సి సెంటర్): సంక్రాంతి పండుగ వేళ నెల్లూరులో విషాదం చోటుచేసుకుంది. నగరంలోని ఎన్టీఆర్ నగర్ సమీపంలో జాతీయరహదారిపై ఆదివారం ఉదయం జరిగిన రోడ్డుప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే మృతిచెందారు. ఆగివున్న లారీని ఇన్నోవా కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. తోటపల్లి గూడూరు మండలం వెంకన్నపాలెంకు చెందిన ఆరుగురు గ్రామస్థులు ఇన్నోవా కారులో నాగపట్నానికి బయలుదేరారు. ఎన్టీఆర్‌నగర్ దగ్గరికి వచ్చేసరికి వీరి కారు ఆగి వున్న లారీని ఢీకొట్టింది. ప్రమాదంలో గాయపడిన ముగ్గురు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నెల్లూరులోని ఆస్పత్రికి తరలించారు. మంచు దట్టంగా అలుముకోవడం వల్ల దారి కనిపించక ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.

కోస్తా జిల్లాల్లో జోరుగా కోడిపందేలు



అమరావతి : సంక్రాంతి అంటేనే కోడిపందేల కోలాహలం. పండుగ మూడురోజులు మూడు పుంజులు, ఆరు పందేలు అన్న చందంగా కోడిపందేలు జరగడం మామూలే. కోస్తా జిల్లాల్లో ఆ సందడి మరింత రంజుగా ఉంటుంది. ఉభయగోదావరి, కృష్ణా జిల్లాల్లో కోడిపందేలు జోరుగా సాగుతున్నాయి. హైకోర్టు ఆదేశాలు, పోలీసుల హెచ్చరికలను పట్టించుకోకుండా పందెంరాయుళ్లు భారీగా పందేలు నిర్వహిస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన పందెం రాయుళ్లు భారీగా బెట్టింగ్ కదుతున్నారు. కొన్నిచోట్ల రూ.వేలల్లో, మరికొన్ని చోట్ల రూ.లక్షల్లో బెట్టింగ్ సాగుతోంది. భారీ టెంట్లు, అదిరిపోయే ఏర్పాట్లతో కోళ్ల పందేల స్థలాలు తిరునాళ్లను తలపిస్తున్నారు.

మన తెలంగాణ
12
హైదరాబాద్
సోమవారం
15, జనవరి 2018
www.manatelangana.news

పిబిఎల్ విజేత హైదరాబాద్



మన తెలంగాణ/ హైదరాబాద్: ప్రతిష్ఠాత్మకమైన ప్రీమియర్ బ్యాడ్మింట్ లీగ్ (పిబిఎల్) టైటిల్‌ను హైదరాబాద్ హంటర్స్ కైవసం చేసుకుంది. ఆదివారం ఇక్కడి గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో హోరాహోరీగా సాగిన ఫైనల్లో హైదరాబాద్ హంటర్స్ 4–3 తేడాతో బెంగళూరు బ్లాస్టర్స్‌ను ఓడించి తన ఖాతాలో తొలి టైటిల్‌ను జమ చేసుకుంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో సాత్విక్‌సాయి రాజ్–పియా బెర్నాడెట్ జంట అద్భుత విజయంతో హైదరాబాద్‌కు టైటిల్స్ సాధించి పెట్టారు. కీలకమైన మిక్స్‌డ్ డబుల్స్‌లో సాత్విక్ జంట 15–11, 15–12తో కిమ్ సా రంగ్ (కొరియా), సిక్కి రెడ్డి (భారత్) జంటను ఓడించింది. ఈ విజయంతో హైదరాబాద్ 4–3తో ట్రోఫీని సొంతం చేసుకుంది. హైదరాబాద్ ప్రీమియర్ లీగ్‌లో టైటిల్ సాధించడం ఇదే తొలిసారి కావడం విశేషం. కాగా, ఈ ఫైనల్ మ్యాచ్‌కు కరోలినా మారిన్ (హైదరాబాద్), ప్రపంచ నంబర్ వన్ విక్టర్ అక్సెల్సన్ (బెంగళూరు) ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

కోహ్లీ.. ఒంటరి పోరాటం

- టాప్ ఆర్డర్ విఫలం, రాణించిన విజయ్
- భారత్ 183/5, సౌతాఫ్రికా 335 ఆలౌట్, రెండో టెస్టు





సెంచూరియన్: దక్షిణాఫ్రికాతో జరుగుతున్న రెండో టెస్టులో భారత్ ఎదురీదుతోంది. దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 335 పరుగులకు ఆలౌటైంది. తర్వాత మొదటి ఇన్నింగ్స్ చేపట్టిన భారత్ ఆదివారం రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఐదు వికెట్ల నష్టానికి 183 పరుగులు చేసింది. కెప్టెన్ విరాట్ కోహ్లి 85(బ్యాటింగ్) ఒంటరి పోరాటం చేస్తున్నాడు. సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్ స్కోరును అందుకోవాలంటే భారత్ మరో 152 పరుగులు చేయాలి. ఇప్పటికే అగ్రశ్రేణి బ్యాట్స్‌మెన్ అందరు పెవిలియన్ చేరడంతో భారత్ ఆశలన్నీ కెప్టెన్ కోహ్లిపైనే నిలిచాయి. సౌతాఫ్రికాను తక్కువ స్కోరుకే పరిమితం చేశామన్నా ఆనందం భారత్‌కు ఎక్కువ సేపు నిలువలేదు. ఓపెనర్ లోకేష్ రాహుల్ పది పరుగులు మాత్రమే చేసి మోర్కెల్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. అప్పటికి జట్టు స్కోరు 28 పరుగులే. తర్వాత బంతికే చటేశ్వర్ పుజారా గోల్డెన్ డకౌటయ్యాడు. అంతకుముందు రెండో టెస్టులో కూడా అతను తొలి బంతికే పెవిలియన్ చేరాడు. కాగా, ఈ మ్యాచ్‌లో కూడా ఆడిన తొలి బంతికే రనౌట్‌గా వెనుదిరిగాడు. లేని పరుగు కోసం ప్రయత్నించి చేజేతులా వికెట్‌ను పారేసుకున్నాడు.

ఆదుకున్న కోహ్లి, విజయ్...

ఈ దశలో ఇన్నింగ్స్‌ను కుదుట పరిచే బాధ్యతను కెప్టెన్ విరాట్ కోహ్లి తనపై వేసుకున్నాడు. అతనికి ఓపెనర్ మురళీ విజయ్ అండగా నిలిచాడు. ఇద్దరు కలిసి ప్రత్యర్థి బౌలర్లను దీటుగా ఎదుర్కొన్నారు. భారీ షాట్ల జోలికి వెళ్లకుండా సమన్వయంతో బ్యాటింగ్ చేశారు. కోహ్లి కాస్తా దూకుడుగా ఆడగా, విజయ్ ఆత్మరక్షణతో బ్యాటింగ్ చేశాడు. ఈ జోడిని ఔట్ చేసేందుకు ప్రత్యర్థి కెప్టెన్ తరచు బౌలర్లను మార్చినా ఫలితం లేకుండా పోయింది. ఇదే క్రమంలో మూడో వికెట్‌కు 50 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. కాగా, 128 బంతుల్లో ఆరు ఫోర్లతో 46 పరుగులు చేసి ఔటయ్యాడు. తర్వాత వచ్చిన రోహిత్ శర్మ నిరాశ పరిచాడు. కేవలం పది పరుగులు మాత్రమే చేసి రబడా బౌలింగ్‌లో వికెట్ల ముందు దొరికి పోయాడు. మరోవైపు వికెట్ కీపర్ పార్థివ్ పటేల్ కూడా ఎక్కువ సేపు క్రీజులో నిలువలేక పోయాడు. 3 ఫోర్లతో 19 పరుగులు చేసి లుంగి సాని బౌలింగ్‌లో ఔటయ్యాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా కెప్టెన్ కోహ్లి పోరాటం కొనసాగించాడు. ఆట ముగిసే సమయానికి 150 బంతుల్లో 8 ఫోర్లతో 85 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. అతనికి హార్దిక్ పాండ్య 11(బ్యాటింగ్) అండగా నిలిచాడు. అంతకుముందు 269/6 ఓవర్‌నైట్ స్కోరు బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా 335 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ డుప్లెసిస్ 63 పరుగులు చేశాడు. మిగతవారు విఫలం కావడంతో లంచ్‌కు ముందే దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ ముగిసింది. భారత బౌలర్లలో అశ్విన్ నాలుగు, ఇషాంత్ మూడు వికెట్లు పడగొట్టారు.

స్కోరుబోర్డు:

దక్షిణాఫ్రికా మొదటి ఇన్నింగ్స్: డీన్ ఎల్గర్ (సి) విజయ్ (బి) అశ్విన్ 31, ఐడెన్ మార్క్రామ్ (సి) పార్థివ్ (బి) అశ్విన్ 94, హాషిం ఆమ్లా రనౌట్ 82, డివిలియర్స్ (బి) ఇషాంత్ శర్మ 20, డుప్లెసిస్ (బి) ఇషాంత్ శర్మ 63. డికాక్ (సి) కోహ్లి (బి) అశ్విన్ 0, ఫిలాండర్ రనౌట్ 0, కేశవ్ మహారాజ్ (సి) పార్థివ్ పటేల్ (బి) మహ్మద్ షమి 18, రబడా (సి) హార్దిక్ (బి) ఇషాంత్ 11, మోర్నె మోర్కెల్ (సి) విజయ్ (బి) అశ్విన్ 6, లుంగిసాని నిగిడి నాటౌట్ 1, ఎక్స్‌ట్రాలు 9, మొత్తం 113.5 ఓవర్లలో 335 ఆలౌట్.
బౌలింగ్: జస్‌ప్రిత్ బుమ్రా 22–6–60–0, మహ్మద్ షమి 15–2–58–1, ఇషాంత్ శర్మ 22–4–46–3, హార్దిక్ పాండ్య 16–4–50–0, రవిచంద్రన్ అశ్విన్ 38.5–10–113–4.

భారత్ మొదటి ఇన్నింగ్స్: మురళీ విజయ్ (సి) డికాక్ (బి) మహారాజ్ 48, లోకేష్ రాహుల్ (సి) అండ్ (బి) మోర్నె మోర్కెల్ 10, చటేశ్వర్ పుజారా రనౌట్ 0, విరాట్ కోహ్లి (బ్యాటింగ్) 85, రోహిత్ శర్మ ఎల్బీ (బి) రబడా 10, పార్థివ్ పటేల్ (సి) డికాక్ (బి) నిగిడి 19, హార్దిక్ పాండ్య (బ్యాటింగ్) 11, ఎక్స్‌ట్రాలు 2, మొత్తం 61 ఓవర్లలో 183/5.
బౌలింగ్: కేశవ్ మహారాజ్ 16–1–53–1, మోర్నె మోర్కెల్ 15–3–47–1, ఫిలాండర్ 9–3–23–0, రబడా 12–0–33–1, లుంగిసాని నిగిడి 9–2–26–1.

రిషబ్ పంత్ రికార్డు శతకం



న్యూఢిల్లీ: ఢిల్లీ యువ సంచలనం రిషబ్ పంత్ ట్వంటీ–20లో అరుదైన రికార్డును నెలకొల్పాడు. సయ్యద్ ముస్తాక్ అలీ టి–20 టోర్నమెంట్‌లో భాగంగా ఆదివారం హిమచల్ ప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో పంత్ 32 బంతుల్లోనే సెంచరీ సాధించి చరిత్ర సృష్టించాడు. ఈ క్రమంలో టి–20ల్లో అత్యంత వేగంగా సెంచరీ సాధించిన రెండో క్రికెటర్‌గా నిలిచాడు. పంత్ కంటే ముందు విండీస్ దిగ్గజం క్రిస్ గేల్ మాత్రమే ముందంజలో ఉన్నాడు. ఐపిఎల్‌లో భాగంగా 2013లో పుణె వారియర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో గేల్ 30 బంతుల్లోనే శతకం సాధించాడు. టి–20లో ఇదే ఇప్పటివరకు అత్యంత వేగవంతమైన సెంచరీగా నిలిచింది. కాగా, అంతర్జాతీయ క్రికెట్‌లో భారత స్టార్ రోహిత్ శర్మ, దక్షిణాఫ్రికా స్టార్ డేవిడ్ మిల్లర్లు అత్యంత వేగంగా సెంచరీలు కొట్టిన క్రికెటర్లుగా నిలిచారు. వీరిద్దరు టి–20లో 35 బంతుల్లోనే శతకాలు సాధించారు. కాగా, రిషబ్ పంత్ హిమచల్‌తో జరిగిన మ్యాచ్లో 32 బంతుల్లోనే శతకం సాధించి ఈ ఫార్మాట్‌లో అత్యంత వేగంగా సెంచరీ సాధించిన రెండో క్రికెటర్‌గా నిలిచాడు. ఈ మ్యాచ్‌లో 38 బంతుల్లోనే పంత్ 12 ఫోర్లు, 8 ఫోర్లతో 116 పరుగులు సాధించి అజేయంగా నిలిచాడు. దీంతో హిమచల్ ఉంచిన 144 పరుగుల లక్ష్యాన్ని ఢిల్లీ 11.4 ఓవర్లలోనే ఛేదించింది. గంభీర్ 30(నాటౌట్) పంత్‌కు అండగా నిలిచాడు.

కోహ్లిపై సెహ్వాగ్ పంచ్‌లు

న్యూఢిల్లీ: ట్విటర్ వీరుడు వీరేంద్ర సెహ్వాగ్ మరోసారి చెలరేగి పోయాడు. ఈసారి అతను భారత కెప్టెన్ విరాట్ కోహ్లి, మిస్టర్ డిపెండబుల్ చటేశ్వర్ పుజారాపై సెటైర్లు వేశాడు. రెండో టెస్టులో భువనేశ్వర్ కుమార్, శిఖర్ ధావన్‌లను తప్పించడంపై సెహ్వాగ్ తనదైన శైలిలో విమర్శలు చేశాడు. ఫాంలో లేడనే కారణంతో అజింక్య రహానెను పక్కన బెట్టిన కోహ్లి, తొలి టెస్టులో అసాధారణ రీతిలో చెలరేగిన భువనేశ్వర్ కుమార్‌ను ఎందుకు తప్పించాడో తనకు అర్థం కావడం లేదన్నాడు. కోహ్లి తీసుకున్న ఈ నిర్ణయం తనను ఎంతో కలవరానికి గురి చేసిందన్నాడు. తొలి టెస్టులో అత్యంత విజయవంతమైన ఆటగాడిగా నిలిచిన భువనేశ్వర్‌ను పక్కన బెట్టడం ఏమాత్ర బాగా లేదన్నాడు. ఈ చర్యతో కోహ్లి ఏం సమాధానం చెప్పలను కున్నాడో అతనికే తెలియాలి అని వ్యాఖ్యానించాడు. ఇక, మొదటి టెస్టులో సరిగా రాణించలేదనే ఆరోపణలతో ధావన్‌ను తప్పించడాన్ని కూడా సెహ్వాగ్ తప్పుపట్టాడు. తొలి టెస్టులో రాణించలేదనే కారణంతో ధావన్‌ను తప్పించినట్టు కోహ్లి ప్రకటించడంపై సెహ్వాగ్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఈ సూత్రం కోహ్లికి కూడా వర్తిస్తుందన్నాడు. అతను కూడా తొలి టెస్టు రెండు ఇన్నింగ్స్‌లలో విఫలమైన విషయాన్ని సెహ్వాగ్ గుర్తు చేశాడు. తర్వాతి మ్యాచ్‌లో కోహ్లి కూడా స్వచ్ఛందంగా తప్పుకుంటాడా అని అతను ప్రశ్నించాడు. ఇక, రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో అనవసర పరుగు కోసం వెళ్లి రనౌట్ అయిన పుజారాపై కూడా తనదైన శైలిలో సెటైర్లు వేశాడు. తొలి బంతికే అతను లేని పరుగు కోసం ప్రయత్నించడం ఏమాత్రం బాగాలేదన్నాడు. పుజారాను రనౌట్ చేసిన దక్షిణాఫ్రికా యువ ఆటగాడు లుంగి భారత బ్యాట్స్‌మెన్‌ను కచ్చితంగా లుండి డాన్స్ చేయిస్తాడని వ్యాఖ్యానించాడు.



జాసన్ రాయ్
విధ్వంసం

- తొలి వన్డేలో ఇంగ్లాండ్ ఘన విజయం



మెల్‌బోర్న్: యాషెస్ సిరీస్‌లో ఘోర పరాజయం చవిచూసిన ఇంగ్లాండ్ వన్డే సిరీస్‌లో మాత్రం కళ్లు చెదిరే విజయాన్ని అందుకుంది. ఆదివారం ఇక్కడ జరిగిన తొలి వన్డేలో ఇంగ్లాండ్ ఐదు వికెట్ల తేడాతో ఆస్ట్రేలియాను చిత్తు చేసింది. ముందుగా బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 304 పరుగుల భారీ స్కోరును సాధించింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లాండ్ మరో ఏడు బంతులు మిగిలి వుండగానే ఐదు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. ఓపెనర్ జాసన్ రాయ్ (180; 151 బంతుల్లో 16x4, 5x6) విధ్వంసక బ్యాటింగ్ కనబరచడంతో ఇంగ్లాండ్ చిరస్మరణీయ విజయం సాధించింది. ఈ గెలుపుతో సిరీస్‌లో 1–0 ఆధిక్యాన్ని అందుకుంది.

రాయ్ జోరు...

భారీ లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన ఇంగ్లాండ్‌ను ఓపెనర్ జాసన్ రాయ్ ఆదుకున్నాడు. సహచర ఓపెనర్ బైర్‌స్టో (14)తో కలిసి తొలి వికెట్‌కు నాలుగో ఓవర్‌లోనే 50 పరుగులు జోడించాడు. విధ్వంసక బ్యాటింగ్‌తో రాయ్ ప్రత్యర్థి బౌలర్లను హడలెత్తించాడు. వరుస ఫోర్లతో ఆసీస్ బౌలింగ్‌ను చీల్చి చెండాడాడు. బైర్‌స్టో, వన్‌డౌన్‌లో వచ్చిన అలెక్స్ హెల్స్ (4) వెంటవెంటనే పెవిలియన్ చేరారు. అయితే తర్వాత వచ్చిన జో రూట్ అండతో రాయ్ జోరును కొనసాగించాడు. చూడ చక్కని షాట్లతో పరుగుల వరద పారించాడు. వేగంగా ఆడిన రాయ్ ఏడు ఫోర్లు, రెండు సిక్సర్లతో 32 బంతుల్లోనే అర్ధ సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. మరోవైపు రూట్ కూడా దూకుడుగా ఆడాడు. ఇద్దరు చెలరేగడంతో ఇంగ్లాండ్ స్కోరు 23.4 ఓవర్లలో 150కి చేరింది. కీలక ఇన్నింగ్స్ ఆడిన రూట్ 59 బంతుల్లో మూడు బౌండరీలతో అర్ధ సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. కాగా, రాయ్ కూడా 92 బంతుల్లో 9 ఫోర్లు, మూడు సిక్స్‌లతో వన్డేల్లో తన నాలుగో సెంచరీని పూర్తి చేశాడు. సెంచరీ తర్వాత రాయ్ దూకుడును పెంచాడు. 126 బంతుల్లోనే 150 పరుగుల మైలురాయిని అందుకున్నాడు. అంతేగాక రూట్‌తో కలిసి మూడో వికెట్‌కు రికార్డు స్థాయిలో 200 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. అయితే 151 బంతుల్లో 16 ఫోర్లు, మరో ఐదు భారీ సిక్సర్లతో 180 పరుగులు చేసి ఔటయ్యాడు. మరోవైపు రూట్ ఐదు ఫోర్లతో అజేయంగా 91 పరుగులు చేసి ఇంగ్లాండ్‌కు విజయం సాధించి పెట్టాడు.

ఫించ్ శతకం..

అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియాను ఓపెనర్ అరోన్ ఫించ్ ఆదుకున్నాడు. ఇంగ్లాండ్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్న ఫించ్ ఆసీస్‌కు గౌరవప్రద స్కోరును అందించడంలో ముఖ్య భూమిక పోషించాడు. స్టార్ ఆటగాడు డేవిడ్ వార్నర్ రెండు పరుగులు మాత్రమే చేసి ఔటయ్యాడు. మరోవైపు కెప్టెన్ స్మిత్ (23) కూడా ఎక్కువ సేపు క్రీజులో నిలువలేక పోయాడు. ట్రావిస్ హెడ్ కూడా (5) నిరాశ పరిచాడు. అయితే మిచెల్ మార్ష్‌తో కలిసి ఫించ్ పోరాటాన్ని కొనసాగించాడు. కీలక ఇన్నింగ్స్ ఆడిన మిచెల్ రెండు సిక్స్‌లు, మరో రెండు ఫోర్లతో 50 పరుగులు చేశాడు. ఈ క్రమంలో మిచెల్‌తో కలిసి నాలుగో వికెట్‌కు ఫించ్ సెంచరీ భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. మరోవైపు మార్కస్ స్టోనిస్ 40 బంతుల్లో ఐదు ఫోర్లు, రెండు సిక్సర్లతో 60 పరుగులు చేశాడు. మరోవైపు కీలక ఇన్నింగ్స్ ఆడిన ఫించ్ 110 బంతుల్లో పది ఫోర్లు, మూడు సిక్సర్లతో 107 పరుగులు చేశాడు. చివరల్లో వికెట్ కీపర్ పైన్ 27 పరుగులు చేయడంతో ఆసీస్ స్కోరు 304కు చేరింది.

భారత యువ జట్టు బోణి

ఆసీస్‌పై జయభేరి, అండర్–19 ప్రపంచకప్



మౌంట్ మౌంగనూయి: భారత యువ జట్టు అండర్–19 వన్డే ప్రపంచకప్‌లో శుభారంభం చేసింది. ఆదివారం జరిగిన గ్రూప్–బి మ్యాచ్‌లో భారత్ 100 పరుగుల తేడాతో అగ్రశ్రేణి జట్టు ఆస్ట్రేలియాను చిత్తు చేసింది. ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ 50 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 328 పరుగులు చేసింది. తర్వాత లక్ష్య ఛేదనకు దిగిన ఆసీస్ కేవలం 228 పరుగులకే కుప్పకూలింది. భారత బౌలర్లలో శివం మావి, కమ్లేశ్ నాగకోటి మూడేసి వికెట్లు తీసి జట్టును గెలిపించారు. భారీ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియాకు ఓపెనర్లు జాక్ ఎడ్వర్డ్స్, మాక్స్ బ్రయంట్ శుభారంభం అందించారు. ఇద్దరు భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ ముందుకు సాగారు. ఒకవైపు వికెట్‌ను కాపాడుకుంటూనే అడపాదడపా భారీ షాట్లతో స్కోరు వేగం తగ్గకుండా చూశారు. అయితే రెండు సిక్స్‌లు, మరో రెండు ఫోర్లతో 29 పరుగులు చేసిన బ్రయంట్‌ను కమ్లేశ్ వెనక్కి పంపాడు. దీంతో 57 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. తర్వాత వచ్చిన కెప్టెన్ జాసన్ సంగా 14 పరుగులు మాత్రమే చేసి ఔటయ్యాడు. అయితే తర్వాత వచ్చిన జొనాథన్ మెర్లో అండతో ఎడ్వర్డ్ స్కోరును పరిగెత్తించాడు. ధాటిగా ఆడిన మెర్లో 4 ఫోర్లతో 38 పరుగులు చేసి పెవిలియన్ చేరాడు. తర్వాత భారత బౌలర్లు పట్టు బిగించారు. వరుస వికెట్లతో ఆసీస్‌ను కట్టడి చేశారు. కీలక ఇన్నింగ్స్ ఆడిన ఎడ్వర్డ్స్ ఆరు ఫోర్లు, ఒక సిక్స్‌తో 73 పరుగులు చేసి ఔటయ్యాడు. చివర్లో వికెట్ కీపర్ హోల్ట్ (39) మాత్రమే కాస్త రాణించాడు. మిగతావారు విఫలం కావడంతో ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ 42.5 ఓవర్లలో 328 పరుగులకే పరిమితమైంది.



షా, మన్‌జోత్ దూకుడు..

అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన భారత్‌ను ఓపెనర్లు పృథ్వీ షా, మన్‌జోత్ కర్లా ఆదుకున్నారు. ఇద్దరు ఆస్ట్రేలియా బౌలర్లను హడలెత్తించారు. ఒకవైపు వికెట్‌ను కాపాడుకుంటూనే చెత్త బంతులను బౌండరీలకు తరలిస్తూ స్కోరు వేగం తగ్గకుండా చూశారు. కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడిన పృథ్వీ షా ఆసీస్ బౌలర్లను ముప్పుతిప్పలు పెట్టాడు. చూడచక్కని షాట్లతో అలరించిన భారత ఓపెనర్లు తొలి వికెట్‌కు వంద పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. అంతేగాక, ఇద్దరు అర్ధ సెంచరీలు కూడా నమోదు చేశారు. కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడిన పృథ్వీ షా 100 బంతుల్లో 8 ఫోర్లు, రెండు సిక్సర్లతో 94 పరుగులు సాధించి తృటిలో సెంచరీ సాధించే అవకాశాన్ని కోల్పోయాడు. అప్పటికే తొలి వికెట్‌కు 180 పరుగులు జోడించాడు. మన్‌జోత్ కూడా అద్భుతంగా ఆడాడు. ఆసీస్ బౌలర్లను దీటుగా ఎదుర్కొన్న మన్‌జోత్ 12 ఫోర్లు, ఒక సిక్స్‌తో 86 పరుగులు చేశాడు. శుభం గిల్ కూడా ధాటిగా ఆడి జట్టును ఆదుకున్నాడు. వేగంగా ఆడిన గిల్ ఆరు ఫోర్లు, సిక్స్‌తో 63 పరుగులు చేశాడు. అభిషేక్ రెండు సిక్స్‌లు, మరో రెండు ఫోర్లతో 8 బంతుల్లోనే వేగంగా 23 పరుగులు చేశాడు. దీంతో భారత్ స్కోరు 328 పరుగులకు చేరింది. కాగా, కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడిన పృథ్వీషాకు మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు లభించింది.

శ్రీలంక జయకేతనం

వంగారెల్: అండర్–19 ప్రపంచకప్‌లో భాగంగా ఆదివారం జరిగిన శ్రీలంక ఏడు వికెట్ల తేడాతో ఐర్లాండ్‌ను చిత్తు చేసింది. గ్రూప్–డిలో భాగంగా జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఐర్లాండ్ నిర్ణీత 48 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 207 పరుగులు చేసింది. ఓపెనర్ జామి గ్రాసి (75) జట్టును ఆదుకున్నాడు. ఒంటరి పోరాటం చేసిన గ్రాసి ఏడు ఫోర్లు, ఒక సిక్సర్‌తో 75 పరుగులు చేశాడు. మరో ఓపెనర్ మార్క్ డొనెగన్ 36 పరుగులు సాధించాడు. చివరల్లో జోషువా లిటిల్ వేగంగా 25 పరుగులు చేశాడు. అయితే లంక బౌలర్లు వరుస క్రమంలో వికెట్లు తీయడమే కాకుండా కచ్చితమైన లైన్ అండ్ లెన్త్‌తో బౌలింగ్ చేయడంతో ఐర్లాండ్ స్కోరు 207 పరుగులకే పరిమితమైంది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 37.3 ఓవర్లలోనే కేవలం మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. ఓపెనర్ ధనంజయ లక్షన్ 8 ఫోర్లు, ఒక సిక్స్‌తో అజేయంగా 101 పరుగులు చేసి లంకకు విజయానందించాడు. కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడిన కమిందు మెండిస్ 8 ఫోర్లతో 74 పరుగులు చేసి జట్టు విజయంలో తనవంతు సహకారం అందించాడు.



Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.